శుక్రవారం
4-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 192
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మళ్లీ నటిగా స్మృతి ఇరానీ?

న్యూఢిల్లీ: కేంద్ర మాజీమంత్రి, బీజేపీ నేత స్మృతి ఇరానీ మళ్లీ నటనారంగంలో అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. రాజకీయాల్లోకి రాకముందు ఆమె సినీ, సీరియల్ నటిగా ప్రేక్షకులను అలరించారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నాటి నుంచి ఆమె నటనకు దూరంగా ఉన్నారు. తాజా సమాచారం ప్రకారం ఆమె తిరిగి నటిగా రాణించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆమె ఒక సిరీస్ కోసం వర్క్ చేయనున్నారంటూ జాతీయ మీడియాలో కథనాలు ప్రచురితమవుతున్నాయి. బుల్లితెర వేదికగా ప్రసారమైన అనేక ధారావాహికల కోసం గతంలో స్మృతి ఇరానీ పని చేశారు. ఏక్తా కపూర్ రూపొందించిన 'క్యోంకీ సాస్ భీ కభీ బహూ థీ' అనే సీరియల్ ఆమెకు నటిగా మంచి గుర్తింపు తెచ్చి పెట్టింది.

పార్లమెంటును మోసం చేయడమే

అర్ధరాత్రి తీర్మానాలపై సీపీఐ

న్యూఢిల్లీ: హింసతో అట్టుడికిపోయే మణిపూర్‌లో శాంతి నెలకొల్పడం అవసరమని సీపీఐ నొక్కిచెప్పింది. ఈశాన్య రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి బయటకు తేవడం, అక్కడి సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో, నిబద్ధతతో కేంద్రం పనిచేయాలని సూచించింది. జవాబుదారీతనాన్ని తప్పించుకోకుండా సమయానుచిత చర్యలు, చర్చల ద్వారా మణిపూర్‌కు న్యాయం చేయాలని కోరింది. ఇందుకోసం అన్ని పార్టీల ప్రతినిధులు, భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు జరపడం ద్వారా అర్థవంత-ఆచరణ

- మిగతా 2 లో

శాంతిభద్రతల సంగతేమిటి

మణిపూర్‌పై విపక్షాలు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధింపునకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. పార్టీలతో సంబంధం లేకుండా సభ్యులందరూ దీనికి ఆమోదం తెలిపారు. దీన్ని ధృవీకరిస్తూ చట్టబద్ధమైన తీర్మానాన్ని ఆమోదించారు. బిల్లుకు ఆమోదం తెలిపినప్పటికీ... మణిపూర్‌లో రాష్ట్రపతి పాలకు కేంద్రమే కారణం అంటూ విపక్షాలు విమర్శించాయి. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ... 'ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు

- మిగతా 2 లో

మిథున్ రెడ్డికి చుక్కెదురు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. వైసీపీ హయాంలో మద్యం విక్రయాలు, తయారీలో జరిగిన అవకతవకల్లో మిథున్‌రెడ్డి పాత్ర ఉన్నట్లు అరోపణలు. మద్యం కుంభకోణంపై ఇప్పటికే ఏపీ సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతోంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మిథున్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు ఆ పిటిషన్‌ను

- మిగతా 2 లో

అకాల వర్షంతో

ఉక్కిరిబిక్కిరి

- పొంగిపొర్లిన డ్రెయినేజీలు... వాహనదారుల ఇక్కట్లు
- నేలకొరిగిన చెట్లు... ట్రాఫిక్‌కు అంతరాయం
- తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు
- ఆరెంజ్ అలెర్ట్ జారీ
- మరో నాలుగురోజులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరిక

విశాలాంధ్ర- హైదరాబాద్: భాగ్యనగరంతోపాటు తెలంగాణలోని వివిధ జిల్లాల్లో గురువారం సాయంత్రం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్ బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్ నగర్, నారాయణ గూడ, లక్డీకాపుల్, ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయం అయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు, బాటసారులు చాలా ఇబ్బందులు పడ్డారు. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. భారీ వర్షంతో పాటు ఈదురు గాలులకు నగరంలో వివిధ చోట్ల చెట్లు నేలకొరిగాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. దీంతో ఎండతీవ్రత నుంచి నగర ప్రజలకు కొంతమేర ఉపశమనం లభించింది. జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో ఆవేదనకు గురవుతున్నారు. మరో నాలుగు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో ఆరోతేదీ వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో

- మిగతా 2 లో

అప్రమత్తం

అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

విశాలాంధ్ర - హైదరాబాద్: నగరంలో అకాల వర్షాలు భారీగా కురుస్తున్నాయని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షం, ఈదురుగాలులతో గురువారం

- మిగతా 2 లో

ఆస్తుల వెల్లడికి సుప్రీం జడ్జీలు ఓకే

న్యూఢిల్లీ: న్యాయమూర్తుల ఆస్తులకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక చర్యలు చేపట్టింది. సుప్రీంకోర్టు జడ్జీలు తమ ఆస్తులు బహిర్గతం చేసేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇటీవల జరిగిన ఫుల్ కోర్టు సమావేశంలో ఈ ప్రతిపాదనకు న్యాయమూర్తులంతా ఏకగ్రీవంగా అంగీకరించారు. న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టల వివాదం నేపథ్యంలో తాజా పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏప్రిల్ 1వ తేదీన సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా సమావేశమయ్యారు. తమ ఆస్తులకు సంబంధించిన వివరాలను కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేందుకు వారంతా సుముఖత వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సహా 30 మంది జడ్జీలు తమ ఆస్తులకు సంబంధించి డిక్లరేషన్లు సమర్పించారు. వీటిని త్వరలోనే సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నారు. అయితే ఇదంతా స్వచ్ఛందంగా జరుగుతున్న ప్రక్రియేనని సుప్రీంకోర్టు వెబ్‌సైట్ వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు జడ్జీలు ప్రమాణస్వీకారం చేయగానే తమ ఆస్తుల వివరాలను ప్రధాన న్యాయమూర్తికి సమర్పించాలని ఉంటుంది. అయితే, వాటిని బహిర్గతం చేయాలన్న తప్పనిసరి నిబంధనేదీ లేదు. సుప్రీం వెబ్‌సైట్‌లో న్యాయమూర్తుల ఆస్తుల డిక్లరేషన్ల కోసం ఇప్పటికే ఓ సెక్షన్ ఉంది. కానీ, కొన్నేళ్లుగా అందులో ఎలాంటి అప్‌డేట్స్ లేవు. తాజా నిర్ణయంతో త్వరలోనే సుప్రీం న్యాయమూర్తుల ఆస్తుల వివరాలు బహిర్గతం కానున్నాయి. ఢిల్లీ

- మిగతా 2 లో

ముఖ్యమంత్రి సంయమం పాటించాలిగా...

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీం తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారంపై సుప్రీంకోర్టులో గురువారం వాడివేడిగా వాదనలు జరిగాయి. ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం తీర్పును సుప్రీంకోర్టు రిజర్వు చేసింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుకు సంబంధించి స్పీకర్ కార్యదర్శి తరపున అభిషేక్ మను సింఘ్వి తొలుత వాదనలు వినిపించారు. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవని సింఘ్వి తెలిపారు. మణిపూర్ వ్యవహారం పూర్తిగా భిన్నమైనదని, ఆ ఒక్క విషయాన్ని ప్రత్యేకంగా పరిగణించారని అన్నారు. అలాగే రాణా కేసు కూడా పూర్తిగా ప్రత్యేకమైనదని, ప్రస్తుత అంశానికి సరిపోదని సింఘ్వి కోర్టుకు తెలిపారు. దీంతో రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుని అనర్హత విధించిందని జస్టిస్ గవాయ్ తెలిపారు. మీ దృష్టిలో సహేతుక సమయం అంటే ఏమిటని సింఘ్విని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. న్యాయవాదులు ఇలాంటి కేసుల విషయంలో వ్యవహరించే విధానం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. సుప్రీం కోర్టుకు వచ్చిన తర్వాత న్యాయవాదుల తీరు పూర్తిగా మారిపోతోందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఇదే అంశంపై బుధవారం కూడా సుదీర్ఘవిచారణ జరిగింది. స్పీకర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. గురువారం స్పీకర్ కార్యదర్శి తరపున సింఘ్వి వాదనలు వినిపించారు. కాగా, ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన మాటలను కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది మరోసారి ప్రస్తావించారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావని, స్పీకర్ తరపున కూడా చెపుతున్నానటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను న్యాయవాది గుర్తుచేశారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచి అయినా రక్షణ ఉంటుందని వ్యాఖ్యానించారని న్యాయవాది అన్నారు. దీంతో ముఖ్యమంత్రి కనీసం స్వీయ నియంత్రణ పాటించలేరా అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. గతంలోనూ ఇలాంటి ఘటనే జరిగిందని, ఆ తర్వాత కూడా

- మిగతా 2 లో

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటారా?

కంచ గచ్చిబౌలి భూముల కేసుపై సుప్రీం

2 లో

మతోన్మాదుల దాడులు

ఎదుర్కొందాం

- లేబర్‌కోడ్‌లపై కార్మిక సంఘాల సమ్మెకు మద్దతు
- సీపీఎం జాతీయ మహాసభ తీర్మానం

మదురై: ఆర్ఎస్ఎస్, బీజేపీ, సంఘ్‌పరివార్ చేస్తున్న మతోన్మాద దాడులను ఎదుర్కోవాలని పార్టీ శ్రేణులకు సీపీఎం అఖిల భారత మహాసభ పిలుపునిచ్చింది. ఇందుకోసం ప్రజానీకంలో పెద్దఎత్తున విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచిస్తూ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. సంఘ్ పరివార్ హిందుత్వ అసలు ఎజెండా ఏమిటో ప్రజలకు అర్థమయ్యేలా చేయడానికి, ఈ దాడులను తీవ్రంగా తిప్పికొట్టడానికి ప్రజాసంఘాలను, లౌకిక, ప్రజాతంత్ర, అభ్యుదయ శక్తులతో కలిసి అన్ని రకాల ప్రయత్నాలు చేయాలి' అని తీర్మానం పేర్కొంది. సంఘ్ పరివార్ వ్యూహాత్మకంగా చేస్తున్న మతపరమైన దాడులను మహాసభ తీవ్రంగా ఖండించింది. 'హిందుత్వ ఎజెండాకు మద్దతు పొందాలంటే సమాజాన్ని మతపరంగా ద్వేషంతో నింపడమే మార్గమని సంఘ్‌పరివార్ భావిస్తోంది. కేంద్రంలో, రాష్ట్రాల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేకపోవడం వల్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని పక్కదోవ పట్టించేందుకు ఈ దాడులు చేస్తున్నారు' అని తీర్మానంలో పేర్కొన్నారు. ఇప్పటికే

- మిగతా 2 లో

మమత సర్కార్‌కు ఎదురుదెబ్బ

25 వేల టీచర్ల నియామకాలు చెల్లవు: సుప్రీం

న్యూఢిల్లీ: ఉపాధ్యాయుల నియామక వ్యవహారంలో మమతా బెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో దాఖలైన పిటిషన్లపై దర్యాప్తు చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటున్న 25 వేల టీచర్ల నియామకాలు చెల్లవని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఆ నియామకాలను రద్దు చేస్తూ గతంలో కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం సమర్థించింది. ఈ కుంభకోణంపై గతేడాది ఏప్రిల్‌లో కలకత్తా హైకోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. 2016లో చేపట్టిన టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామక ప్రక్రియ చెల్లదని స్పష్టం చేసింది. ఆ పరీక్షతో జరిపిన నియామకాలను తక్షణమే రద్దు చేయాలని

- మిగతా 2 లో

ఎకరం కొన్నా నష్టపోవాల్సిందే

- కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామిక స్ఫూర్తి నిల్
- పాలకులు ప్రజాసేవకులే... రేవంత్ ఓ మానసిక రోగి: కేటీఆర్

2 లో

అబద్ధాలకోరు రేవంత్

- చెప్పేదొకటి... చేసేదొకటి
- సంక్షేమ పథకాల్లో కోత
- ఫార్మా పేరుతో భూములు లాక్కుంటే ఊరుకోం: హరీశ్‌రావు

విశాలాంధ్ర - ఆమనగల్లు: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రమంతా ఆగమైందని... హామీలను అమలు చేయకపోగా సంక్షేమ పథకాల్లో కోత పెడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ముద్విన్ పంచాయతీ పరిధిలోని బోయిన్ గుట్ట తండాలో గురువారం ఆయన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి లతో కలిసి సేవాలాల్, అంబేద్కర్, గాంధీ విగ్రహాలను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏయ్.. ఎన్నిసార్లు చెప్పాలి ఆ బుక్కు జోలికెళ్లొద్దనీ, అస్తమానూ తెరుస్తారు, చచ్చూరుకుంటావ్!

ఒక్క మాట చెప్పించండి... 24 గంటల్లో

రిజర్వేషన్లు అమలు చేస్తాం

- ఏపీలో ముస్లింలకు 4 శాతం తొలగించగలరా
- 13 శాతం ఉన్న వారికి 10 శాతం ఎలా ఇస్తారు?
- బండి సంజయ్‌కు పొన్నం హితబోధ

విశాలాంధ్ర-హైదరాబాద్: కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పిన విధంగానే బీసీ రిజర్వేషన్లు రాష్ట్రమే చేసుకోవచ్చని కేంద్రం నుంచి ఒక్క మాట చెప్పిస్తే 24 గంటల్లో రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఢిల్లీలో గురువారం మీడియా సమావేశంలో పొన్నం మాట్లాడుతూ ఇద్దరు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి, ఎంపీలు అరవింద్, లక్ష్మణ్, ఈటల రాజేందర్ తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ముస్లింలకు రిజర్వేషన్లు వర్తించొద్దు అని బీజేపీ అనుకుంటే మీరు అమలు చేస్తున్న ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లలో ముస్లింలు

- మిగతా 2 లో

రాజ్యాంగ ధ్వంసమే బీజేపీ ధ్యేయం

- లోక్‌సభలో వక్ఫ్ బిల్లును 'బుల్డోజ్' చేశారు
- కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ
- సమష్టిగా పోరాడాలని పార్టీ ఎంపీలకు పిలుపు



న్యూఢిల్లీ: వక్ఫ్ బిల్లును లోక్‌సభలో 'బుల్డోజ్' చేశారని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లును రాజ్యాంగంపై జరిగిన దారుణమైన దాడిగా ఆమె అభివర్ణించారు. గురువారం ఆమె కాంగ్రెస్ పార్లమెంటరీ కమిటీ (సీపీపీ) సమావేశంలో మాట్లాడుతూ... భారత సమాజాన్ని శాశ్వత విభాజిత స్థితిలో ఉంచాలనే బీజేపీ వ్యూహంలో ఇదో భాగమని మండిపడ్డారు. ఒకే దేశం, ఒకే ఎన్నికల బిల్లు మరో రాజ్యాంగ ధిక్కరణమని తెలిపిన సోనియా... దాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. రాజ్యాంగాన్ని కేవలం కాగితానికి పరిమితం చేస్తూ మోదీ ప్రభుత్వం దేశాన్ని అగాధంలోకి నెడుతోందనీ, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడమే బీజేపీ ప్రధాన ఉద్దేశమని సోనియాగాంధీ ఆరోపించారు. భారత దేశాన్ని తమ నిఘా నేత్రంగా మార్చుకోవాలని మోదీ ప్రభుత్వ ఉద్దేశాన్ని బహిర్గతం చేయాలని నేతలకు సూచించారు. మోదీ ప్రభుత్వ

- మిగతా 2 లో

సీపీఐ ప్రధాన కార్యదర్శులు - 6

అజయ్ ఘోష్

బెంగాల్‌లోని వర్ధమాన్ జిల్లాలో జన్మించిన అజయ్ ఘోష్ తన తండ్రి డా. సచీంద్రనాథ్ ఘోష్ తో పాటు కాన్పూర్ వెళ్లిపోయారు. 1926లో అలహాబాద్ విశ్వవిద్యాలయంలో చేరకముందు అజయ్ ఘోష్‌కు భగత్ సింగ్, భటుకేశ్వర్ దత్‌తో పరిచయం అయింది. భగత్ సింగ్ నాయకత్వంలోని హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌లో అజయ్ ఘోష్ సభ్యులుగా ఉండేవారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

రష్యా, ఉ.కొరియా, క్యూబాపై సుంకాల్లేవు

అనేక ఆంక్షలు ఉన్నందునే మినహాయింపు: శ్వేతసౌధం

వాషింగ్టన్: ప్రతీకార సుంకాల పేరిట ప్రపంచ దేశాలపై విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్... కొన్ని దేశాలకు మినహాయింపు ఇవ్వడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. సుంకాలు మినహాయించిన దేశాల్లో రష్యా, ఉత్తర కొరియా, క్యూబా, బెలారస్ ఉన్నాయి. ఇంకొన్ని దేశాలకూ ఆయన మినహాయింపు ప్రకటించినట్లు శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఆ దేశాలపై అనేక ఆంక్షలు అమల్లో ఉండటంతో తాజా సుంకాల నుంచి మినహాయింపు ఇచ్చినట్లు వెల్లడించాయి. ఇరాన్, సిరియా దేశాలకు మాత్రం సుంకాల నుంచి మినహాయింపు ఇవ్వలేదు. ఆ దేశాలపై 10 నుంచి 40 శాతం వరకు సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4 గంటలకు వాషింగ్టన్ డీసీ నుంచి సుంకాలపై ప్రకటనను ట్రంప్ చేశారు. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విక్రయించుకోవచ్చన్నారు. అందుకోసం కనీసం 10 శాతం సుంకం చెల్లించాలన్నారు. అమెరికా ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న ఇతర దేశాలపై ఆయా దేశాలు విధిస్తున్న సుంకాల్లో సగం విధిస్తున్నట్లు వెల్లడించారు. భారత్ తమ ఉత్పత్తులపై 52 శాతం సుంకం విధిస్తున్నందున, తాము 26శాతం మేర సుంకం విధిస్తున్నట్లు తెలిపారు.

ముందే రద్దు చేసుకున్న ఇజ్రాయిల్

అమెరికా దిగుమతులపై అన్ని రకాల సుంకాలను రద్దు చేస్తున్నట్లు ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. తమ దేశానికి అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా తెలిపారు. ఆ దేశం నుంచి దిగుమతి చేసుకునే అన్ని ఉత్పత్తులపై సుంకాలు రద్దు చేస్తున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. మార్కెట్లో పోటీని ప్రోత్సహించడం... ఆర్థికపరంగా వైవిధ్య విధానాలు అమలు చేయడం, జీవన వ్యయాన్ని తగ్గించడం కోసం దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానానికి ఈ నిర్ణయం మరో ముందడుగు అని నెతన్యాహు పేర్కొన్నారు. సుంకాల రద్దుతో తమ పౌరులకు, దేశీయ మార్కెట్కు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. అమెరికాతో ప్రత్యేక అనుబంధాన్ని కొనసాగిస్తామని, వాణిజ్య సంబంధాన్ని బలపర్చుకుంటామని నెతన్యాహు వెల్లడించారు.

ప్రపంచ ఆర్థికాభివృద్ధికి ముప్పు

ట్రంప్ సుంకాలకు దీటుగా బదులిస్తాం: చైనా

బీజింగ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించడాన్ని చైనా తీవ్రంగా ఆక్షేపించింది. దీటైన బదులిస్తామని ఆ దేశ వాణిజ్య శాఖ తాజాగా ఒక ప్రకటన చేసింది. తక్షణమే సుంకాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో ప్రపంచ ఆర్థికాభివృద్ధికి ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించింది. చైనా దిగుమతులపై ఇప్పటికే ఉన్న 20 శాతం సుంకాలను 34 శాతానికి పెంచుతూ ట్రంప్ ప్రకటన చేశారు. ట్రంప్ ప్రకటన ఏకపక్షంగా ఉందని, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలకు అనుగుణంగా ఆయన తీరు లేదని చైనా వాణిజ్య శాఖ పేర్కొంది. వాణిజ్యపరమైన విభేదాలను చర్చలతో పరిష్కరించుకోవాలని హితవు పలికింది. వాణిజ్య యుద్ధంలో విజేతలు ఉండబోరని తేల్చిచెప్పింది. సొంత ప్రయోజనాలను కాపాడుకునేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని, ట్రంప్కు దీటుగా బదులిస్తామని స్పష్టం చేసింది.

విదేశీ విద్యార్థులపై ఏఐతో అమెరికా నిఘా

వాషింగ్టన్: హమాస్కు మద్దతిస్తుండటం, ఆందోళనల్లో పాల్గొనడం, జాత్యాంహకార సందేశాలను సామాజిక మాధ్యమాల్లో పెట్టడం, ఆ సందేశాలకు మద్దతివ్వడం వంటి కారణాలు చూపుతూ విదేశీ విద్యార్థులపై ట్రంప్ ప్రభుత్వం కొరఢా ఝుళిపిస్తోంది. వారందరినీ దేశం నుంచి పంపివేస్తోంది. ఇజ్రాయిల్పై హమాస్ దాడి చేసిన రోజు నుంచి ఇప్పటివరకు సామాజిక మాధ్యమాల్లో సంబంధిత సందేశాలకు లైక్లు, షేర్లు కొట్టిన విదేశీ విద్యార్థులను గుర్తించే పనిలో నిమగ్నమైంది. విద్యార్థుల సామాజిక మాధ్యమాల ఖాతాలను జల్లెడ పడుతోంది. ఇదే క్రమంలో వారిపై కృత్రిమ మేధ (ఏఐ)తో నిఘా పెట్టింది. ఉగ్రవాద సంఘాలకు మద్దతిచ్చే వారిని గుర్తించడమే లక్ష్యంగా ఈ చర్యలకు పూనుకున్నది. ఈ కార్యక్రమానికి విదేశాంగ శాఖ కార్యదర్శి మార్కో రూబియో నాయకత్వం వహిస్తున్నారని అధికారులు పేర్కొన్నారు.

రాజ్యాంగ ధ్వంసమే బీజేపీ ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

వైఫల్యాలపై సమష్టిగా పోరాడాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఎంపీలకు సోనియా సూచించారు. 2004-2014 మధ్య యూపీఏ హయాంలో చేపట్టిన అనేక కార్యక్రమాలను ప్రధాని మోదీ తన వ్యక్తిగత విజయాలుగా రీబ్రాండ్ చేసి మార్కెట్ చేసుకుంటున్నారని విమర్శించారు.

ఆ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమె సూచించారు. ఈ సీపీపీ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ ఎంపీలు పాల్గొన్నారు. 'పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్ష నాయకులను మాట్లాడటానికి అనుమతించడం లేదు. కాంగ్రెస్ తమ సమస్యలను లేవనెత్తకుండా ట్రెజరీ బెంచీలు తరచుగా గందరగోళం సృష్టిస్తున్నాయి. బీజేపీ ఎంపీలు కాంగ్రెస్ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలపై పూర్తి అబద్ధాలతో టార్గెట్ చేస్తున్నారు. పార్లమెంట్లో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వైఫల్యాలను కాంగ్రెస్ ఎంపీలు లేవనెత్తాలి' అని సోనియా గాంధీ సూచించారు.

బిల్లుపై సుప్రీంకు వెళతాం: స్టాలిన్

మరోవైపు వక్ఫ్ బిల్లుపై సుప్రీంకు వెళ్తామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. బిల్లు ఆమోదం పొందడాన్ని నిరసిస్తూ నల్ల బ్యాడ్జ్ ధరించి అసెంబ్లీకి హాజరయ్యారు. మెజారిటీ పార్టీల వ్యతిరేకత ఉన్నప్పటికీ కొన్ని మిత్రపక్షాల సూచనలతో తెల్లవారుజామున 2 గంటలకు సవరణను ఆమోదించారని వివరించారు. ఇది రాజ్యాంగ నిర్మాణంపై దాడి అన్న స్టాలిన్, మత సామరస్యాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. "ఈ వివాదాస్పద వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా డీఎంకే తరపున సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేస్తాం. వక్ఫ్ బోర్డు స్వయంప్రతిపత్తిని నాశనం చేసే, మైనారిటీలైన ముస్లింలను బెదిరించే కేంద్ర ప్రభుత్వ చట్టానికి వ్యతిరేకంగా తమిళనాడు పోరాడుతుంది. 232 మంది ఎంపీలు వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. అయినప్పటికీ లోక్ సభలో ఆమోదించడం తీవ్రంగా ఖండించదగ్గ చర్య. ఇది సాధారణ సంఖ్య కాదు. 288 మంది సభ్యులు మాత్రమే బిల్లుకు అనుకూలంగా ఓటేశారు" అని స్టాలిన్ తెలిపారు.

మతోన్మాదుల దాడులు ఎదుర్కొందాం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న పాత సమస్యలకు అనేక కొత్త అంశాలను చేరుస్తున్నారని, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వంటి హిందూ పండుగలను ముస్లింలపై దాడులకు ఉపయోగిస్తున్నారని తెలిపింది. రంజాన్ సందర్భంగా శుక్రవారం రోజున హోలీ జరగడంతో ముస్లింలను లక్ష్యంగా చేసుకుని అనేక ప్రాంతాల్లో చోటుచేసుకున్న బెదిరింపు ఘటనలను తీర్మానంలో ఉదహరించింది. మహారాష్ట్రలోని మాల్వాన్లో 15 ఏళ్ల ముస్లిం బాలుడిని నిరాధారంగా 'పాక్ జిందాబాద్' నినాదాలు పెట్టాడని ఆరోపిస్తూ జైలుకు పంపిన సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగించే అంశాలు. ఇటీవల విడుదలైన 'ఛావా' సినిమా ఔరంగజేబ్ను క్రూరుడిగా చూపించింది. అతనితో పాటు మొత్తం ముస్లిం సమాజాన్ని అపఖ్యాతిపరచేలా చిత్రీకరించారు. మహారాష్ట్ర మంత్రులు దీన్ని ముస్లింల పండుగలు, యాత్రల నుండి వేరుచేయడానికి ఉపయోగించుకున్నారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు 'మతమార్పిడి నిరోధక చట్టాలు' తీసుకురావడమే కాకుండా... హిందూ మహిళ, ముస్లిం పురుషుడు కలిసి పెళ్లి చేసుకుంటే మరణదండన విధించాలనే ప్రతిపాదనను ముందుకు తెచ్చాయి. ఇటువంటి ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటించాలి' అని మహాసభ పిలుపునిచ్చింది. ఈ తీర్మానాన్ని కేంద్ర కమిటీ సభ్యులు పి.రాజీవ్ ప్రతిపాదించగా, మధుగార్గ్ బలపరచారు.

లేబర్కోడ్లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల సమ్మెకు మద్దతు

మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన లేబర్కోడ్లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర అఖిల భారత సమాఖ్యలు మే 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ... ఈ సమ్మెను జయప్రదం చేయాలని మహాసభ తీర్మానం చేసింది. '29 ప్రస్తుత కార్మిక చట్టాలను రద్దు చేసి... వాటిని నాలుగు లేబర్ కోడ్లలో విలీనం చేసినట్లు మోదీ ప్రభుత్వం చెబుతోంది. నిజానికి ఈ కార్మిక చట్ట సవరణలు కార్మికులు సాధించిన ప్రాథమిక హక్కులను హరించడానికి ఉద్దేశించినవి. ముఖ్యంగా ఇవి పని గంటలు, కనీస వేతనాలు, సామాజిక భద్రత, కార్మికుల సంఘటిత హక్కు, సమ్మె హక్కు వంటి అంశాలపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని, ఈ చట్టాల వల్ల కార్మికులకు మేలు జరుగుతుందని మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని తీర్మానంలో తెలిపారు. సులభతర వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పేరుతో అమలు చేస్తున్న అన్ని చర్యలు కార్మిక సంఘాలను బలహీనపరుస్తాయని, కార్మికవర్గాన్ని తీవ్రంగా అణగదొక్కి, స్వదేశీ-విదేశీ కార్పొరేట్లకు అనుకూలంగా శ్రమదోపిడీ కొనసాగించేందుకు ఉపయోగపడతాయని వివరించింది. ఈ నాలుగు కోడ్లను 2019-20లో ఆమోదించినా, కార్మికవర్గం ఐక్యంగా ప్రతిఘటిస్తున్నందున ఇప్పటివరకు వాటిని పూర్తిగా అమలు చేయలేకపోయారని పేర్కొంది. ఈ నేపథ్యంలో లేబర్ కోడ్లను రద్దు చేయాలన్న డిమాండ్తో మే 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం అన్ని కమిటీలను, శాఖలను, కార్యకర్తలను కోరింది. ఈ తీర్మానాన్ని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.హేమలత ప్రవేశపెట్టగా, మరో కేంద్ర కమిటీ సభ్యులు అమియ పాత్ర బలపరచారు.

శాంతిభద్రతల సంగతేమిటి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. నాలుగు నెలలుగా మణిపూర్లో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోలేదు. మైతి, కుకి తెగల మధ్య చర్చలు జరపడమే ఈ సమస్యకు శాంతియుత పరిష్కారం' అన్నారు. కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్సభలో వక్ఫ్ బిల్లు -2025 ప్రవేశపెట్టింది. దీనిపై చర్చించేందుకు గురువారం తెల్లవారుజాము రెండు గంటల వరకు సుదీర్ఘ సమయం పాటు సభ కొనసాగింది. ఈ క్రమంలోనే అమిత్ షా... మణిపూర్లో రాష్ట్రపతి పాలన విధింపునకు సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టారు. సుమారు 40 నిమిషాల పాటు దీనిపై చర్చించారు. అనంతరం సభ ఈ తీర్మానాన్ని వాయిస్ ఓటు ద్వారా ఆమోదించింది. అమిత్ షా మాట్లాడుతూ... 'మణిపూర్లో పరిస్థితి ప్రశాంతంగానే ఉంది. ప్రజలు శిబిరాల్లో ఉన్నంత వరకు, పరిస్థితి సంతృప్తికరంగా ఉందని చెప్పడం భావ్యం కాదు. మణిపూర్లో శాంతిని పునరుద్ధరించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది' అని తెలిపారు. హైకోర్టు ఆదేశం తర్వాతనే మణిపూర్లో హింస చెలరేగిందని చెప్పారు. 'హైకోర్టు ఆదేశాలు వెలువడిన రోజే... కేంద్ర బలగాలను వాయుమార్గంలో మణిపూర్కి పంపాం. మా వైపు నుంచి పరిస్థితిని అదుపు చేయడంలో ఎటువంటి ఆలస్యం జరగలేదు' అని స్పష్టం చేశారు. 2023 మేలో ప్రారంభమైన హింసలో ఇప్పటివరకు 260 మంది మరణించారని... వారిలో 80 శాతం మంది గొడవలు ప్రారంభం అయిన తొలి నాళ్లలోనే ప్రాణాలు కోల్పోయారని వివరించారు. 'సుమారు దశాబ్దం పాటు మణిపూర్లో చెదురుమదురు హింస కొనసాగింది. ఫలితంగా సుమారు 750 మంది ప్రాణాలు కోల్పోయారు. 1997-98లో కుకి-పైతి ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ గొడవల్లో 352 మంది మరణించారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటారా?

న్యూఢిల్లీ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (కంచ గచ్చిబౌలి) భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. సుమోటాగా కేసు స్వీకరించిన ధర్మాసనం హెచ్సీయూ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టొదంటూ స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై ఉన్నత న్యాయస్థానం గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వంపై జస్టిస్ గవాయ్ ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. మూడ్రోజుల వ్యవధిలో వంద ఎకరాల్లో చెట్లు కొట్టేయడం మామూలు విషయం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. దీన్ని చాలా తీవ్రమైన అంశంగా పరిగణించింది. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారని తెలంగాణ ప్రభుత్వాన్ని జస్టిస్ గవాయ్ ధర్మాసనం ప్రశ్నించింది. విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన మధ్యంతర నివేదికను ఉన్నత న్యాయస్థానం పరిశీలించింది. మీడియా, పత్రికల్లో వచ్చిన కథనాలను సైతం జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు అమికస్ క్యూరీ పరమేశ్వర్ ఉంచగా... వాటినీ పరిశీలించింది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని సుప్రీంకోర్టు ప్రతివాదిగా చేర్చింది. ఇంత అత్యవసరంగా భూముల్లో చెట్లు తొలగించి పనులు చేపట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 15న నియమించిన కమిటీలోని అధికారులు సైతం సమాధానం చెప్పాలని హుకుం జారీ చేసింది. ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా... రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా... చెట్లు కొట్టేసే ముందు సీఈసీ అనుమతి తీసుకున్నారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన నివేదికలోని ఫొటోలు చూసి అక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పింది. వందల కొద్దీ యంత్రాలు మోహరించాల్సిన అగత్యం ఏమిటో అర్థం కావడం లేదని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం చేపట్టిన పనులపై స్టే విధించింది. సుప్రీంకోర్టు తీర్పుపై హెచ్సీయూ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. భూముల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గాలంటూ డిమాండ్ చేశారు. గో బ్యాక్ పోలీస్ అంటూ నినాదాలు చేశారు. భారీ వర్షంలోనూ నిరసనలు తెలిపారు.

ఎకరం కొన్నా నష్టపోవాల్సిందే

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రభుత్వం విక్రయించాలని చూస్తున్న హెచ్సీయూలోని 400 ఎకరాల భూమిలో ఎకరం కొన్నా.. భవిష్యత్తులో వాళ్లు నష్టపోవడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భవిష్యత్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే విక్రయించిన భూములను తిరిగి తీసుకుంటామని స్పష్టం చేశారు. అక్కడ అద్భుతమైన ఏకో పార్క్ నిర్మించి వర్సిటీ విద్యార్థులు, నగర ప్రజలకు బహుమతిగా ఇస్తామన్నారు. వర్సిటీ విద్యార్థుల పోరాటానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ఈ విషయంలో వెనక్కి తగ్గి నిర్ణయాన్ని మార్చుకోకపోతే... వేలాది మందితో హెచ్సీయూకి మార్చ్లా తరలి వెళ్తామన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా, కాకతీయ, శాతవాహన వర్సిటీల్లో జరిగిన పోరాటాలకు ధీటుగా సెంట్రల్ వర్సిటీ విద్యార్థులు వీరోచితంగా పోరాడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ చెప్పుకుంటున్న ప్రజాపాలనలో ప్రజాస్వామిక స్ఫూర్తి అణువంతైనా లేదని అన్నారు. మేం పాలకులం... మీరంతా బానిసలు అన్న ట్టుగా ఓ విచిత్రమైన మానసిక రోగంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. పది రోజులుగా విద్యార్థులు పోరాడుతుంటే కనీసం వారితో చర్చలు జరపడానికి కూడా ప్రభుత్వం ముందుకు రాకపోడం శోచనీయమన్నారు. విద్యార్థులను గుంటనక్కలు, పేయిడ్ బ్యాచ్ అంటూ ముఖ్యమంత్రి, మంత్రులు వ్యాఖ్యానించడం వారి అహంకారానికి నిదర్శనం అన్నారు. సీఎం అయినా, మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా తాము ప్రజా సేవకులం అనే విషయం గ్రహించాలని సూచించారు. కోర్టు సెలవులను ఆసరా చేసుకుని సెంట్రల్ వర్సిటీలో ప్రభుత్వం విధ్వంసం సృష్టిస్తుందని ధ్వజమెత్తారు. శని, ఆదివారాలు ప్రజల మీదికి బుల్డోజర్లు ఎందుకు పోతున్నాయని హైకోర్టు, సుప్రీంకోర్టులు ప్రశ్నించినా ప్రభుత్వానికి ఇంగిత జ్ఞానం లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ను గ్రీన్ సిటీగా మార్చి ఎన్నో జాతీయ ,అంతర్జాతీయ అవార్డులు సాధించామని, కేసీఆర్ హయాంలో 270 కోట్ల మొక్కలు నాటి హరిత విప్లవాన్ని సృష్టించామన్నారు. పర్యావరణ పరిరక్షణ, గ్రీన్కవర్ పెంచడంలో తెలంగాణ దేశంలోని నెంబర్ వన్గా నిలిపామన్నారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్ లా 400 ఎకరాలను కబ్జా పెట్టాలనుకుంటున్నారని ఆరోపించారు. రాజ్యసభలో మా ఎంపీలు సురేశ్రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర ఈ విషయాన్ని లేవనెత్తారని... కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారన్నారు. రోహిత్ వేముల మరణంపై నిరసన తెలపడానికి హెచ్సీయూకి రాహుల్ గాంధీ వస్తే ప్రభుత్వ ఎస్కార్ట్తో అక్కడకు తీసుకెళ్లామని, కానీ నేడు అదే వర్సిటీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడపిల్లల బట్టలు చించి, జుట్టు పట్టుకొని పోలీసులతో కొట్టిస్తుందని మండిపడ్డారు. బండి సంజయ్ ...ఓ ఐటమ్ నంబర్ సిక్స్ అంటూ వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రి సంయమం పాటించాలిగా...

(మొదటిపేజీ తరువాయి)

ఇలాగే వ్యవహరిస్తే ఎలా అని జస్టిస్ గవాయ్ అన్నారు. దీనికి అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ ప్రతిపక్షం నుంచి అంతకుమించిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఇప్పుడు అవన్నీ అప్రస్తుతమని ధర్మాసనం పక్కన పెట్టింది. సీఎం మాటలు కోర్టు ధిక్కారం కింద తీసుకోవాల్సి వస్తుందని జస్టిస్ గవాయ్ అన్నారు. తాము సంయమనం పాటిస్తున్నామని, మిగతా రెండు వ్యవస్థలు అదే గౌరవంతో ఉండాలని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. స్పీకర్కు ఫిర్యాదు చేసిన తర్వాత కోర్టులో కేసులతో తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని చూశారని సింఘ్వి అన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన సూచనలను సానుకూలంగా తీసుకుని ఉంటే కేసు ఇక్కడివరకు వచ్చేది కాదని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి విచారణకు వచ్చిన తర్వాతే ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారని జస్టిస్ గవాయ్ అన్నారు. అభిషేక్ మను సింఘ్వి వాదనలు ముగియడంతో పిటిషనర్ల తరపున న్యాయవాది ఆర్యామ సుందరం మరోసారి చివరి వాదనలు వినిపించారు. జనవరిలో సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించాక స్పీకర్ నోటీసులు ఇచ్చారని, మూడు వారాలు సమయం ఇచ్చారని, ఆ మూడు వారాల సమయం కూడా పూర్తి అయిందని న్యాయవాది ఆర్యామ సుందరం అన్నారు. నోటీసులు పంపిన సమాచారం కూడా ప్రతిపక్ష నేతకు ఇవ్వలేదని న్యాయవాది పేర్కొన్నారు. చివరికి బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్పై విచారణ సుప్రీంకోర్టులో ముగిసింది. రెండు వైపుల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది. అయితే 8 వారాల్లోగా తీర్పు ఇవ్వాలని సుప్రీంకోర్టును న్యాయవాది ఆర్యమ సుందరం కోరారు.

అప్రమత్తం

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని , ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్ను ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై నీటి నిల్వలు లేకుండా, ట్రాఫిక్ సమస్య, విద్యుత్ అంతరాయాలు కలుగకుండా జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, విభాగాలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి వాహనదారులు ఇళ్లకు చేరుకునేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో కూడా వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లవాన కురుస్తున్నందున కలెక్టర్లు, పోలీసు అధికారులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

రిజర్వేషన్లు అమలు చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఉన్నారనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. మీరే 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో ముస్లింలను కాదని రిజర్వేషన్లు అమలు చేస్తున్నారా అంటూ నిలదీశారు. టీడీపీతో బీజేపీ పొత్తు ఉన్న ఆంధ్రప్రదేశ్లో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని, దానిని తీసివేసే దమ్ము ఉందా అని నిలదీశారు. మైనార్టీలకు ఈబీసీ రిజర్వేషన్లు ఇచ్చారని దీనికి బండి సంజయ్ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ, మహారాష్ట్రలో రిజర్వేషన్లు లేవా ... అవి రద్దు చేసే దమ్ముందా మీకు అంటూ మండిపడ్డారు. దూదేకులు ఇతర ముస్లిం వర్గాలు బీసీల్లోకి కొత్తగా వచ్చాయా అనే విషయంపై బండి సమాధానం చెప్పాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లలో ఏ బీ సీ డీ ...జనాభా ప్రకారం విభజింపబడతాయన్నారు. కేంద్ర విధానం ఒక రకంగాను, రాష్ట్ర విధానం మరోవిధంగాను ఉండదని, మీ ఎమ్మెల్యేలు శాసనసభలో బిల్లు పెట్టినప్పుడు ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చారనే విషయాన్ని మీరు గుర్తిస్తే మంచిదని హితబోధ చేశారు. కూటమి ప్రభుత్వంలో రిజర్వేషన్లు తొలగించి ఇక్కడికి రావాలన్నారు. బీసీ అని చెప్పుకునే ప్రధాని మోదీ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు దేశంలో 13 శాతం ఉన్న సామాజికవర్గానికి 10 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నారు... అసలు ఇదేం పద్ధతో అర్థం కావడం లేదన్నారు.

మిథున్ రెడ్డికి చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ సందర్భంగా పత్రికల్లో కథనాలు ఆధారంగా చూపుతూ ముందస్తు బెయిల్ కోరడం సరికాదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) వాదించారు. గతంలో అధికారిగా పని చేసిన సత్యప్రసాద్ 164 వాంగ్మూలం ఇచ్చారని పీపీ గుర్తు చేశారు. సత్యప్రసాద్ వాంగ్మూలం ఆధారంగా పత్రికల్లో కథనాల మేరకు బెయిల్ కోరడం సరికాదన్నారు. ఈ కేసులో పిటిషనర్ను నిందితుడిగా చేర్చలేదని ప్రభుత్వ న్యాయవాది ఉన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. ఇంత వరకు పిటిషనర్కు సీఐడీ నోటీసులు కూడా ఇవ్వలేదని తెలిపారు. ఈ దశలో ముందస్తు బెయిల్ వేయడం సరికాదన్నారు. మిథున్రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ను కొట్టివేయాలని కోర్టును విన్నవించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు మిథున్రెడ్డి పిటిషన్ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అకాల వర్షంతో ఉక్కిరిబిక్కిరి

(మొదటిపేజీ తరువాయి)

ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అకాల వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్ జిల్లాల్లో అక్కడక్కడ వడగండ్ల వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో ప్రజలు బయటకు రావొద్దని హెచ్చరించింది. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సూర్యాపేట, నల్గొండ, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

ఆస్తుల వెల్లడికి సుప్రీం జడ్జీలు ఓకే

(మొదటిపేజీ తరువాయి)

హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ యశ్వంత్వర్మ అధికారిక నివాసంలో భారీఎత్తున నోట్ల కట్టలు బయటపడినట్లు వచ్చిన వార్తలు సంచలనం సృష్టించాయి. న్యాయమూర్తి అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరగడంతో... మంటలు ఆర్పేందుకు వెళ్లిన సిబ్బందికి అనుకోకుండా భారీగా నోట్ల కట్టలు దర్శనమిచ్చాయి. ఇది వివాదాస్పదం కావడంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తూ కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.

మమత సర్కార్కు ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించింది. దీనికింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు తమ వేతనాన్ని తిరిగి ఇచ్చేయాలని వెల్లడించింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో కొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం ఫిబ్రవరి 10న తీర్పును రిజర్వ్లో పెట్టింది. తాజాగా తీర్పు వెలువరించింది. ఆ నియామక ప్రక్రియను కలుషితమైనదిగా, కళంకమైనదిగా అభివర్ణించింది. హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకునేందుకు సరైన కారణాలు లేవని పేర్కొంది. ఆ నియామకాలు చెల్లవని స్పష్టంచేసింది. అయితే, ప్రభావిత ఉపాధ్యాయులకు కొంత మేరకు ఊరట కల్పించింది. ఈ నియామక ప్రక్రియ కింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు అప్పటివరకు అందుకున్న వేతనాలు, ఇతర భత్యాలను తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదని వెల్లడించింది. మూడు నెలల్లో కొత్తగా టీచర్ల నియామకాలు పూర్తి చేయాలని సుప్రీంకోర్టు బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే, దివ్యాంగ ఉపాధ్యాయులకు మానవతా కోణంలో ఊరట కల్పించింది. వారు విధుల్లో కొనసాగొచ్చని స్పష్టంచేసింది. ఈ కుంభకోణం వ్యవహారంపై మరింత సమగ్ర దర్యాప్తు జరపాలని గతంలో హైకోర్టు సీబీఐని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ మమత సర్కారు దాఖలు చేసిన పిటిషన్పై ఏప్రిల్ 4న విచారణ జరుపుతామని ధర్మాసనం పేర్కొంది. ఈ కుంభకోణానికి సంబంధించిన కేసులో విద్యాశాఖ మాజీమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత పార్థా ఛటర్జీని ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

పార్లమెంటును మోసం చేయడమే

(మొదటిపేజీ తరువాయి)

సాధ్య పరిష్కారాన్ని చూపాలని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం గురువారం ఒక ప్రకటనలో కేంద్రానికి హితవు పలికింది. పారదర్శకత, జవాబుదారీతనం, సమగ్రతగల ప్రభుత్వం మణిపూర్ ప్రజలతో పాటు యావత్ దేశానికి కావాలని నొక్కిచెప్పింది. మణిపూర్లో రాష్ట్రపతి పాలన విధిస్తూ లోక్సభలో అర్ధరాత్రి 2 గంటలకు తీర్మానం చేయడమన్నది పార్లమెంటును, ప్రజలను మోసం చేయడమే అవుతుందని పేర్కొంది. ఫిబ్రవరిలో జరిగిన పార్లమెంటు సమావేశాల్లో సీపీఐ సహా ప్రతిపక్ష పార్టీలన్నీ మణిపూర్పై చర్చ కోసం డిమాండ్ చేసినప్పటికీ, ఈ అంశాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ఈ పరిణామం ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్కు దారితీసిందని, అధికార దురహంకారానికి, అణచివేతకు అద్దం పట్టిందని సీపీఐ వ్యాఖ్యానించింది. పార్లమెంటరీ పరిశీలన, చర్చల నుంచి తప్పించుకోవడం కోసమే అర్ధరాత్రి దాటాక తీర్మానాలు చేస్తున్నారని అధికారపక్ష సభ్యులను దుయ్యబట్టింది. అసమర్థంగా, అసంబద్ధంగా పార్లమెంటు పనితీరుండటం ఆందోళన కలిగిస్తోందని... మణిపూర్ ప్రజలు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారని, వారికి న్యాయం చేయాలని సూచించింది. మణిపూర్ ప్రజల వెతలపై పార్లమెంటులో చర్చించడం పాలకుల నైతిక బాధ్యత అని సీపీఐ పేర్కొంది. సంబంధిత వర్గాలతో విస్తృతంగా చర్చలు జరపడం చర్చల ద్వారా ఈ రాష్ట్ర సంక్షోభాన్ని పరిష్కరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది.

అబద్ధాలకోరు రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో హరీశ్రావు మాట్లాడుతూ సీఎం హోదాలో ఉండి రేవంత్ రెడ్డి అసెంబ్లీలోను, బయట అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. రోడ్లు, ఫార్మా పేరుతో పేదల భూములు లాక్కుంటే ఊరుకునేది లేదని... వారికి అండగా ఉంటామని చెప్పారు. పేదల పై చిత్తశుద్ధి ఉంటే రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలను మోసం చేసేందుకు బిల్లు పెట్టి కేంద్రాన్ని ఒప్పిస్తానని ఢిల్లీలో ధర్నా చేసిన రేవంత్ ధర్నాకు రాహుల్ ముఖం చాటేశారని ఇక కేంద్రాన్ని ఏం ఒప్పిస్తాడని ఎద్దేవా చేశారు. నెలకు రూ.నాలుగువేల పింఛన్ ఇస్తానని చెప్పిన కాంగ్రెస్... 16 నెలల్లో ఇవ్వకపోగా రెండు నెలల పింఛను కోత పెట్టి నాలుగు వేలు ఎగ్గొట్టారని విమర్శించారు. మహిళలకు రెండున్నర వేలు, కల్యాణ లక్ష్మి తులం బంగారం, ఇవ్వకపోగా బతుకమ్మ, కేసీఆర్ కిట్లు, రంజాన్ తోఫా బంద్ చేశారని తెలిపారు. ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది ఒకటిగా ఉందని... ప్రజలు గుర్తెరగాలని హరీశ్రావు కోరారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని ప్రశాంతత కోసం ఆలయాలకు వెళ్తే వారిపై లైంగిక దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. కరెంటు కష్టాలు ప్రారంభమయ్యాయని హామీల అమలులో ప్రభుత్వం విఫలమైనదని దుయ్యబట్టారు. సెంట్రల్ యూనివర్సిటీ లో వన్యప్రాణులు రోధిస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చీమ కుట్టినట్లు కూడా లేదని, రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో లేకుండా పోయాయని విమర్శించారు. గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, గంప వెంకటేష్, దశరథ్ నాయక్, సత్యం, పత్య నాయక్, రాఘవేందర్, నిరంజన్, శ్రీనివాస్, తులసిరామ్, గోపాల్, రమేష్, చంద్రమౌళి, వీరయ్య పాల్గొన్నారు.

వైద్య పట్టా పొందిన డాక్టర్లు ప్రజలకు సేవ చేయాలి : మంత్రి కోమటి రెడ్డి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ఎంబిబిఎస్ పూర్తి చేసుకుని వైద్య పట్టా పొందిన డాక్టర్లు ప్రభుత్వ సర్వీస్‌లో చేరి ప్రజలకు సేవ చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.గురువారం నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థుల కాన్వకేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంబిబిఎస్ డిగ్రీ కాదని, మనుషుల ప్రాణాలను నేరుగా నిలబెట్టగలిగే ఆయుధమన్నారు. అలాంటి వైద్య వృత్తిని పూర్తిచేసిన డాక్టర్లు ప్రభుత్వ సర్వీసులో చేరి పేద ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఎంతోమంది వైద్యులు పేద ప్రజలకు గొప్ప వైద్య సేవలను అందించి పేరు, ప్రఖ్యాతులు సాధించడమే కాక, పద్మభూషణ్, పద్మ విభూషన్ వంటివి పొందారని, అందులో తెలంగాణ నుండి డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి దేశంలోనే రెండవ అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషన్ పొందారని అన్నారు. రోగులకు గౌరవంగా చికిత్స చేయాలని, ప్రతి డాక్టర్ దేవుడితో సమానమని, డబ్బే ధ్యేయంగా కాకుండా, ప్రాణాలు కాపాడటమే ధ్యేయంగా పనిచేయాలని పునరుద్ఘాటించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఎంబిబిఎస్ మనుషుల జీవితాలను కాపాడే అద్భుతమైన కోర్స్ అని అన్నారు. నూతనంగా వైద్య విద్య పట్టాలు పొందిన డాక్టర్లు ఎంతోమందికి వైద్య సేవలు అందించాలని, సంఖ్యాపరంగా చూడకుండా ఎంతమంది ప్రాణాలు కాపాడేమో, ఎంత మంచి నాణ్యమైన వైద్య సేవలు అందించామో చూడాలని ప్రివెంటివ్ మెడిసిన్ పై దృష్టి సారించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు ఏ .నరేంద్ర కుమార్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీవాణి ప్రభుత్వ ప్రధానాస్పత్రి సూపరిండెంట్ అరుణ కుమారి పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం పేదలకు ఉచితంగా సన్నబియ్యాన్ని ఇస్తున్నదని దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ అన్నారు. గురువారం అయన నల్గొండ జిల్లా, దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని గుండ్లపల్లి మండల కేంద్రం డిండిలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రారంభించారు. సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మక కార్యక్రమని ఆయన అన్నారు. ప్రస్తుతం ఇస్తున్న దొడ్డు బియ్యం పథకంలో అనేక లోపాలు ఉన్నాయని, ముఖ్యంగా ఈ బియ్యం 90 శాతం రీసైక్లింగ్ అవుతున్నదని, దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఏ రాష్ట్రంలో లేనివిధంగా సన్నబియ్యాన్ని రేషన్ షాపుల ద్వారా ప్రతి మనిషికి 6 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ప్రభుత్వం సన్నధాన్యం పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నదని రైతులు పండించిన సన్న వడ్లను ప్రాసెసింగ్ చేసి సన్నబియ్యాన్ని చౌక ధర దుకాణాలు, రేషన్ షాపులు, హాస్టళ్లు, పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - కారేపల్లి : ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి నవీన్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ యువతి యువకులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు ప్రభుత్వం గడువు విధించిందని అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ పథకంపై గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి టామ్ టామ్ వేయించాలన్నారు. ఎంపీడీవో జి సురేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడి అమానుషం

ఇల్లందు - విశాలాంధ్ర : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం అమానుష చర్యలకు దిగుతున్నదని పట్టణ, మండల బీఆర్ఎస్ యువజన విద్యార్థి విభాగం ఆరోపించింది. గురువారం మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ఆదేశాలతో విద్యార్థి నాయకులు స్థానిక కొత్త బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్ళకు నల్లగంతలు, బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ పరిధిలోని 400 ఎకరాల విషయంలో కాంగ్రెస్ సర్కార్ విధానంపై విమర్శలు చేశారు. పర్యావరణాన్ని కాపాడాలని ఉద్యమిస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లపై లాఠీ చార్జి చేయడం పై మండిపడ్డారు. ఇకనైనా విద్యార్థులపై దాడులు మానుకోకపోతే కాంగ్రెస్ పతనం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన, విద్యార్థి నాయకులు గిన్నారపు రాజేష్, హరికృష్ణ, హరిప్రసాద్, సురేష్, రవి, రాజశేఖర్, కుమార్ పాసి, చాంద్ పాషా, నిఖిల్, ఇమ్రాన్, బిపిన్, ఉపేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఏరియాలో 144.18 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కొత్తగూడెం ఏరియాలో గడచిన ఆర్థిక 2024-25 ఏడాదికి గాను కేటాయించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని 100శాతం పూర్తి చేసిందని జనరల్ మేనేజర్ షాలేం రాజు సంతోషం వ్యక్తం చేసారు. కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 143.50 లక్షల టన్నులకు (వీకేఓసి కు నిర్దేశించిన లక్ష్యాన్ని మినహాయింపు చేసి) గాను 144.18 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని 100.5శాతంతో సాధించడం జరిగిందన్నారు. ఈ ఉత్పత్తి సాధనలో ప్రధాన పాత్ర పోషించిన జే.వి.ఆర్ ఓసి ఉత్పత్తి లక్ష్యం 112 లక్షల టన్నులకు గాను 114.58 ఉత్పత్తిని సాధించి సింగరేణి సంస్థకు పెద్దన్న పాత్ర పోషిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. గురువారం ఆయన రుద్రంపూర్‌లోని తన కార్యాలయంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి వివరించారు. కొత్తగూడెం ఏరియా నుండి ఉత్పత్తి అయిన బొగ్గును మొత్తంగా 162.39 లక్షల టన్నులు బొగ్గు రవాణా చేయడం జరిగినదన్నారు. అదే విధముగా రానున్న ఆర్థిక ఏడాదికి (2025-26) గాను పద్మావతి ఖని మైన్ కు 2.5 లక్షల టన్నులు, జే.వి.ఆర్. ఓసి.2 ప్రాజెక్ట్‌కు 116.00, కిష్టారం ఓసి కు 28.00, అలాగే నూతనంగా అనుమతులు పొందిన వి.కే.ఓసి కి 10.00 లక్షల టన్నులుగా నిర్ణయించి మొత్తంగా కొత్తగూడెం ఏరియా కు 156.50 లక్షల టన్నుల లక్ష్యం నిర్దేశించడం జరిగిందన్నారు. ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించుటలో భాగస్వాములైన ఉద్యోగులకు, అధికారులకు, జెవిఆర్ సి.హెచ్.పి, ఆర్.సి.హెచ్.పి సిబ్బందికి, యూనియన్ ప్రతినిధులకు, కాంట్రాక్ట్ కార్మికులకు షాలేం రాజు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

పేదలకు కడుపునిండా భోజనం పెట్టడమే లక్ష్యం: సీతక్క

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : రాష్ట్రంలో ప్రతి నిరుపేద కుటుంబం కడుపు నిండా భోజనం చేయడమే లక్ష్యంగా కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ములుగు మండలం జంగాలపల్లి, ఏటూరునాగారం, చిన్నబోయిన్నపల్లి, మంగపేట, కన్నాయిగూడెం మండలం ఏటూరు, చింతగూడెం, సర్వాయి, బుట్టాయిగూడెం, కమలాపురం అంబేద్కర్ నగర్‌లో రేషన్ షాపు వద్ద సన్నబియ్యాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, డీఎండీసీ ఎస్.రాంపతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్‌తో కలిసి మంత్రి పంపిణీ చేశారు. చింతగూడెం, మంగపేటలో కళ్యాణి లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు, ఏటూరునాగారంలో సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. సీతక్క మాట్లాడుతూ అధికంగా సన్న వడ్లను రైతులు పండించాలన్నారు.భూమిలేని నిరుపేద కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తున్నట్టు చెప్పారు. పైడాకుల అశోక్, రవీందర్, మల్లేష్, సతీష్ కుమార్, జగదీశ్వర్,రవీందర్ రెడ్డి, వేణుగోపాల్, రామకృష్ణ, రాజ్యలక్ష్మి, అనిత, శ్రీనివాస్, తాజ్‌ద్దీన్, వెంకన్న, రఘు, అప్సర్ పాషా, చిన్న ఎల్లయ్య, సులేమాన్, కొప్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంప్యూటర్ల ల్యాబ్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర - (తాడ్వాయి) ములుగు జిల్లా బ్యూరో : తాడ్వాయి మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్, సందర్శించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం 15 కంప్యూటర్లు కలిగి ఉన్న ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ విద్యతో పాటు సంస్కారం నేర్చుకోవాలని, పలు అంశాలపై మంత్రి మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ విద్యపై పలు విషయాలు తెలిపారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, సుహాసిని, పాఠశాల, ప్రధానోపాధ్యాయురాలు రేవతి, కంప్యూటర్ ల్యాబ్ ఇన్చార్జి, సృజన, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర - (రామన్న గూడెం) ములుగుజిల్లా బ్యూరో : ములుగు జిల్లా, ఏటూరునాగారం మండలం, రామన్నగూడెం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గద్దల నవీన్- పూజిత వివాహమునకు, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మంచినీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హాజరై, నూతన వధువు వరులను ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు గొల్లపెల్లి రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షులు చిటమట రఘు, జిల్లా, మండల, గ్రామ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి ఇంటి ముట్టడికి విద్యార్థి సంఘాల యత్నం

అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

విశాలాంధ్ర - ఖమ్మం : సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాదులో 400 ఎకరాల భూముల వ్యవహారంపై అక్కడి విద్యార్థులను అరెస్టు చేయడం లాఠీచార్జి చేయడానికి వ్యతిరేకంగా ఖమ్మంలో గురువారం విద్యార్థి సంఘాలు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించాయి. ఈ సందర్భంగా పోలీసులకు విద్యార్థి సంఘ నాయకులకు మధ్య తోపులాట జరిగింది ఉదిరిక్త పరిస్థితుల మధ్య పోలీసులు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు విద్యార్థి సంఘ నాయకులను ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూములు పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి మస్తాన్ జార్జి రెడ్డి, జిల్లా అధ్యక్షులు మంద సురేష్‌లు పిలుపునిచ్చారు. స్థానిక ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్ నుండి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇల్లు ముట్టడికి వెళ్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను అడ్డుకున్న పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులకు పోలీసులకు మధ్యలో తోపులాట జరిగింది. అక్రమ అరెస్టులను ఆపాలి కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనుక తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాగం లోకేష్, సుధాకర్ శివ నాగులమేర రాజు. అజయ్ వంశి వినోద్. మనోజ్ సాగర్ భాను ఉదయ్. ప్రతాపు గోపి రాకేష్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

విశాలాంధ్ర- తొర్రూర్: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా నాయకులు ఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బందు మహేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎండి అమీర్ అన్నారు. వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా చలో సెక్రటేరియట్ కి బయలుదేరిన ఎస్.ఎఫ్.ఐ, ఏ.ఐ.ఎస్.ఎఫ్. విద్యార్థి సంఘ నాయకులను గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో అక్రమంగా అరెస్ట్ చేసి తొర్రూరు పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా బందు మహేందర్, ఎండి అమీర్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తుంటే పోలీసులు అక్రమంగా అరెస్టులు చేస్తున్నారన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు గత వారం రోజుల నుండి మా యూనివర్సిటీ భూములను వేలం వెయ్యద్దు అని ఉద్యమాలు చేస్తూ ఉంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులపై అక్రమంగా లాఠీచార్జిలు చేపిస్తూ అరెస్టులు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ ప్రైవేటు వ్యక్తులకు యూనివర్సిటీ భూములను కట్టబెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందన్నారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా మరో విద్యార్థి ఉద్యమాలు ఉంటాయని ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో ఏఐఎస్ఎఫ్ ఎస్.ఎఫ్.ఐ తొర్రూరు మండల నాయకులు ఆకాశ్, మహేష్ ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి, సింగరేణి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం ఆయన అంతర్గాం మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండల రెవెన్యూ అధికారి కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆఫ్‌లైన్ దరఖాస్తులను స్వీకరించాలని, వాటిని ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు లేబర్ సంఖ్య పెంచాలని, ఎటువంటి ఆలస్యం లేకుండా వేతనాలు జమ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీల వివరాలు ట్రాకింగ్ పకడ్బందీగా జరగాలని, మెడిసిన్ రీజిస్టర్ పక్కాగా మెయింటేన్ చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కనీస అభ్యాసన సామర్థ్యాలు ఉండే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పర్యటనలో అధికారులు వేణు మాధవ్, డాక్టర్ ఉదయ కిరణ్ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యను ఆదర్శంగా తీసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్యను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. రెవెన్యు అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మాచారీ, ఇతర అధికారులతో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డిన తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య అని ప్రశంసించారు. వెట్టి చాకిరీ, దోపిడీలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి అమరుడైన దొడ్డి కొమురయ్య సాహసాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బి.సి సంక్షేమ శాఖ అధికారి బి. నరసింహస్వామి, మైనారిటీ, ఎస్.సి సంక్షేమ శాఖ అధికారులు బి.శ్రీనివాస రావు, శ్రీనివాస్, బి.సి కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పదోసారి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా అల్లూరి మల్లారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షుల వారి గృహ నివాసంలో కలిసి ఇటీవల మార్చి 27 తారీఖున నిర్మల్ కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగగా ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా 10 ఓసారి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా అల్లూరి మల్లారెడ్డి విజయం సాధించిన సందర్భంగా, కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి ఇరువురికి పూల గుచ్చా అందించి అభినందనలు తెలిపారు. ఆదివాసి కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద నాయక్ జర్నలిస్ట్ మదిరే శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య పోరాట పటిమ భావితరాలకు స్ఫూర్తిదాయకం : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్యమంలో వీరోచిత పోరాటం చేసిన దొడ్డి కొమురయ్య పోరాట పటిమ భావితరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, యాదవ కుల సంఘ నాయకులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘ నాయకులతో కలిసి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంగా మారడానికి దొడ్డి కొమురయ్య అమరత్వం ప్రధాన కారణమని, 7వ నిజాం కాలంలో తెలంగాణ ప్రజలు అనుభవిస్తున్న దుర్భర పరిస్థితులలో ప్రజలను చైతన్యవంతం చేసి ఉద్యమాన్ని నడిపించారని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు.

ధృవీకరణ పత్రాలను అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూ బాబాద్/ దంతాలపల్లి: విద్యార్థులకు కావలసిన ధ్రువీకరణ పత్రాలు సత్వరమే అందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం జిల్లాలోని దంతాలపల్లి, చిన్నగూడూర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయాలను, రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేసి కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ శక్తి పథకం ద్వారా ఆన్లైన్లో, ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తు వివరాలను పరిశీలించి, విద్యార్థులకు కావాల్సిన ధృవీకరణ పత్రాలను సత్వరమే అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దంతాలపల్లి ఆశ్రమ పాఠశాలను, చిన్నగూడురు మండలాలలోని బీరిశెట్టిగూడెం, జయ్యారంలో రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీని పరిశీలించి, రేషన్ దుకాణం ద్వారా పంపిణీ సాఫీగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అధికారులకు తెలిపారు. సన్న బియ్యం నాణ్యతను పరిశీలించి, కోటాకు అనుగుణంగా బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీస్తూ, స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ తనిఖీలో మండల ప్రజా పరిషత్ అధికారులు, తహసీల్దార్లు, పౌరసరఫరాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ

విశాలాంధ్ర - పెద్దపల్లి బ్యూరో : పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో గురువారం రేషన్ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. బ్రాహ్మణపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ విజేందర్ సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. మాజీ సర్పంచ్‌లు గాండ్ల మల్లేశం, బొల్లం తిరుపతి, పిప్పాల శ్రీనివాస్, సూత్రపు పరమేశ్వర్, దాసరి రాజేశం, మేకల భాస్కర్, మూల రమేష్, పూదరి కిషన్, మ్యాకల రాజయ్య, ఓదెల రాజు, పడాల రాజయ్య, కాంపెల్లి చంద్రశేఖర్, గురిజాల లక్ష్మయ్య, నీలి రాజేశం, డీలర్ రవి, గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే రాగినేడులో ప్రారంభ కార్యక్రమంలో గుమ్మడి విజయ్, సోమ చంద్రయ్య, నాగపూరి తిరుపతి, తొడేటి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే అన్ని గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రాంభమంతో లబ్దిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి : ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : పెరుగుతున్న వేసవి ఎండల నేపథ్యంలో కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల పరిధిలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికులు, పాదచారుల దాహార్తిని తీర్చాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం కొత్తగూడెం ఇంచార్జి కమిషనర్, పాల్వంచ కమిషనరైన సుజాతకు మంగళవారం ఫోన్ చేసి పలు సూచనలు చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కొత్తగూడెం, పాల్వంచ మీదుగా వేలాది మంది భక్తులు భద్రాచలం సీతారాముల కల్యాణ మహోత్సవానికి వచ్చి పోతుంటారన్నారు. భక్తులకు మన ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవలసిన బాధ్యత తమపై ఉందన్నారు. పరిసర గ్రామాల నుంచి వివిధ పనులపై కొత్తగూడెం జిల్లా కేంద్రానికి, పాల్వంచ పట్టణానికి వచ్చే ప్రజలు తాగునీరు కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. వాటర్ బాటిళ్లు కొనుక్కొని తాగే స్తోమత అందరికీ ఉండదని అందుకే ముఖ్య ప్రదేశాల్లో చలివెంద్రాలు చాలా అనివార్యమని కూనంనేని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చేందుకు ముందుకు రావాలని అభ్యర్థించారు.

సంపదను పెంచే పరిశ్రమలు స్థాపించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : ప్రభుత్వం అందించే రుణాలతో సంపదను పెంచే పరిశ్రమలను, వ్యాపార యూనిట్లను స్థాపించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పనులు త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఫామ్ పాండ్ నిర్మాణాలు చేపట్టాలని తద్వారా ఆర్థిక పరిపుష్టిని సాధించాలని కలెక్టర్ సూచించారు. గురువారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అనేక పథకాలపై సమీక్షించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో అన్ని వ్యవసాయ భూముల్లో ఫామ్ పాండ్ నిర్మాణాలను చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 52 వేల బోర్లు వ్యవసాయ భూముల్లో ఉన్నాయని, కనీసం 50 వేల ఫామ్ పాండ్ నిర్మాణాలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ నిర్మాణం ద్వారా చేపల పెంపకం, అజోల్ల పెంపకం వల్ల రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ఏ గ్రామంలో అయితే ఎక్కువ ఇంకుడు గుంతలు నిర్మాణం చేపడతారో 5 గురికి ఆగస్టు 15 సన్మాన కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు. స్వచ్ఛభారత్ మరుగుదొడ్ల నిర్మాణం వారంలోగా పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ నెల ఆఖరి లోపు తాగునీటి వనరుల మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, సిపిఓ సంజీవరావు, హౌసింగ్ పీడీ శంకర్, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, మిషన్ భగీరథ ఈఈ లు నలిని, తిరుమలేష్, ఎస్సీ సంక్షేమ అధికారి అనసూయ, బీసీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

పద్మావతి ఖనిని తనిఖీ చేసిన డైరెక్టర్ వెంకటేశ్వర్లు



విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఇటీవలే సింగరేణి డైరెక్టర్ అండ్ ప్లానింగ్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన కే. వెంకటేశ్వర్లు తొలిసారిగా కొత్తగూడెం ఏరియాలోని పద్మావతి ఖనిని గురువారం తనిఖీ చేశారు. ఈ మైన్ తనిఖీలో భాగంగా బొగ్గు ఉత్పత్తి వివరాలను మైన్ మేనేజర్, ఏజెంట్‌లతో సమీక్షించారు. మైన్‌లోని సర్ఫేస్ టన్నెల్ పనుల పురోగతిని డైరెక్టర్ సమీక్షించారు. అనంతరం అండర్ గ్రౌండ్ మైన్ లో దిగి మెన్ రైడింగ్ సిస్టం, అండర్ గ్రౌండ్ పని స్థలాలను క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. కంటిన్యూషన్ మైనర్ వర్కింగ్ కండిషన్స్ ను, పనితీరును సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకొని ఆ యంత్రం పనితీరును మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేసారు. ఈ మైన్లో బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు ఎల్‌హెచ్‌డి యంత్రాలను పెంచాలని ఏజెంట్, మేనేజర్‌లు డైరెక్టర్ పా ను అడిగారు. దింతో ఆయన సానుకూలంగా స్పందించి యంత్రాలను పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం షాలెం రాజు, జీఎం (సేఫ్టీ) తివారి, సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఖని ఏజెంట్ రవీందర్, మేనేజర్ శ్యాం ప్రసాద్, సర్వేయర్ ప్రదీప్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల అధీనంలోని వాహనాలకు 6 నెలల గడువు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లా వ్యాప్తంగా పలు కేసులకు సంబంధించి పోలీసుల ఆధీనంలో ఉన్న వాహనాలను తిరిగి పొందడానికి ఆరు నెలల గడువు మాత్రమే ఉంటుందని పోలీస్ మోటార్ వాహనాల అధికారి సుధాకరరావు అన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ పలు సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కేసులతో సంభంధం ఉన్న 116 ద్విచక్ర వాహనాలు, 10 ఇతర వాహనాలు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌లోని హేమచంద్రపురంలో ఉంచడం జరిగిందన్నారు. ఈ వాహనాలకు సంబంధించి యజమానులు నిబంధనల ప్రకారం సరైన పత్రాలను చూపించాల్సి ఉంటుందన్నారు. తమ వాహనాలను ఈ రోజు నుండి 6 నెలల లోపు పొందవచ్చని ఆయన సూచించారు. ముందుగా ఈ వాహనాలకు సంబం ధించి సరైన పత్రాలను సంబంధిత పోలీస్ స్టేషన్లలో సమర్పించాలన్నారు. అక్కడి నుండి రుజువు పత్రాన్ని పొంది మోటారు వాహనాల అధికారి కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. అప్పుడే వాహనాన్ని పొందే అవకాశం ఉంద న్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచనల ప్రకారం ఈ అన్ క్లైమడ్ వాహనాల జాబితాను జిల్లా పోలీస్ సోషల్ మీడియాలో ఉంచడం జరిగిందన్నారు. యజమా నులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సుధాకరరావు కోరారు.

నూతన సీఎంఓను కలిసిన ఎస్టీ, ఎస్సీ అసోషియేషన్ నేతలు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ఇటీవల సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన కిరణ్ రాజ్ కుమార్ ను ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియే నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంఓను కలిసి పూల బోకే అందించి శాలువాతోఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ అంతోటి నాగేశ్వరావు, సెక్యూరిటీ జియం లక్ష్మి నారాయణ, ఏజీఎం గోనె శ్రీకాంత్, ఐటీ మేనేజర్ మాలకొండయ్య, లైజన్ ఆఫీసర్లు కలవల చంద్రశేఖర్, నాగరాజు నాయకులు వంగపండ్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ముస్లిం ఆస్తుల మీదే గురి

కొద్ది రోజుల కింద నరేంద్ర మోదీ దేశవాసులకు మరో సుందర స్వప్నం చూపించారు. వచ్చే 1000 సంవత్సరాలకోసం ఈ దేశం సిద్ధమవుతోందని ఆయన అన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు, విదేశాలలో దాచిన నల్ల ధనాన్ని నౌకల నిండా నింపుకొచ్చి ఒక్కొక్కరి ఖాతాలో పదిహేను లక్షలు వేస్తాం లాంటి మోదీ హామీలకు పట్టిన గతిని అనుభవ పూర్వకంగా చూసిన ఈ జాతి జనులు వెయ్యేళ్ల స్వప్నాన్ని అర్థం చేసుకునే స్థితిలో ఉండే ఆశే లేదు. 2047 వరకు సాధించిన లక్ష్యాలను గురించి కూడా మోదీ కమ్మని కలలు అమ్ముతూనే ఉన్నారు. మోదీ హయాంలో ఆయన అనుకున్నదే చట్టంగా మారుతున్న పరిస్థితి. ఈ దేశంలో భిన్నమైన మతాలు ఉన్నాయని, వాటికి తమ మతాన్ని అనుసరించే, తమ మతం గురించి ప్రచారం చేసుకునే హక్కు ఉంటుందని మోదీ అంగీకరించరు. అందుకని ఆయన మదిలో ఉన్నదల్లా చట్టం అయిపోతుంది. వక్ఫ్ సవరణ చట్టమే దీనికి ఉదాహరణ. ఈ చట్టం పేద ముస్లింలకు బోలెడు ప్రయోజనం కలగ జేస్తుందట. పేద ముస్లింల మీద, ముస్లిం మహిళల మీద మోదీ టన్నులకొద్దీ ప్రేమ కురిపిస్తుంటారు. ముమ్మారు తలాక్‌కు అవకాశం లేకుండా చేయడం, ఆ పద్ధతిని అనుసరించిన వారికి కనీసం మూడేళ్ల జైలు శిక్ష విధించడం లాంటివన్నీ ముస్లిం మహిళల మేలు కోసమేనని మోదీ చెప్తూ ఉంటారు. ఇప్పుడు వక్ఫ్ సవరణ చట్ట మహదాశయం కూడా అదేనట. దేశంలోని వివిధ సంస్కృతుల అంశంపై రాజ్యాంగ నిర్ణాయక సభలో కూడా చర్చ జరిగింది. కానీ అవేవీ మోదీకి పట్టవు. వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగాన్ని ఆపడానికి ప్రత్యేక చట్టం ఏమీ అక్కర్లేదు. వక్ఫ్ బోర్డుల్లో అవినీతి జరుగుతూ ఉంటే దాన్ని అరికట్టడానికి అనువైన చట్టాలూ ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. ముస్లింల, ముఖ్యంగా పేద ముస్లింల ప్రయోజనాలు పరిరక్షించడానికి ఇవేవీ చాలవట. ఏకంగా వక్ఫ్ చట్టాన్ని సవరించి వక్ఫ్ ఆస్తులు కాపాడతారట. ఈ బిల్లు పార్లమెంటులో ప్రవేశ పెట్టిన తరవాత కేంద్ర ప్రభుత్వ, బీజేపీ అధికార ప్రతినిధుల వాదన విపరీతంగా ఉంది. ఈ సవరణ చేయడం మత వ్యవహారానికి సంబంధించింది కాదట. అది భూములకు సంబంధించిందట. వక్ఫ్‌కు ఇచ్చిన భూములు అన్యాక్రాంతం కాకుండా, అక్రమంగా అమ్ముకోకుండా మరిన్ని కట్టుదిట్టాలు కావాలట. అయితే గుడ్డిలో మెల్లగా ఈ వక్ఫ్ సవరణ బిల్లు మీద లోక్‌సభలో, రాజ్యసభలో విస్తృతమైన చర్చకు అవకాశం ఇచ్చారు. ప్రతిపక్షాలు తమ వాదన వినిపించడానికైనా అవకాశం దక్కింది. సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసే ఔదార్యాన్ని కూడా మోదీ ప్రభుత్వం చూపింది. కానీ ఆ సంయుక్త పార్లమెంటరీ కమిటీకి నాయకత్వం వహించిన బీజేపీ నాయకుడు ఆ కమిటీ కార్యకలాపాల మీద కూడా బుల్డోజర్ నడిపారు. ఒక్కో అంశం మీద కూలంకశంగా చర్చ జరగడానికి అవకాశం లేకుండా చేశారు. ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన అసమ్మతి పత్రాలను సంయుక్త పార్లమెంటరీ కమిటీ నివేదికకు జత చేయకుండా జాగ్రత్త పడ్డారు. అసలు వక్ఫ్ బిల్లు అన్న పేరే సుదీర్ఘంగా ఉంది. దాన్ని యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్మెంటు, ఎఫిసిషియెన్సీ అండ్ డెవలప్‌మెంటు బిల్లు అంటారట. దీన్నీ ఏ భాషలో తర్జుమా చేసినా అర్థంకావడం కష్టమే. వెయ్యేళ్ల సుందర స్వప్నం చూపించడం అంటే మతాన్ని, రాజకీయాన్ని కలగాపులగం చేయకూడదని, రాజకీయ ప్రయోజనాలకోసం మతాన్ని వినియోగించకూడదన్న విధానానికి మంగళం పాడడమేనని ప్రజలు గ్రహించకుండా చూడడమే. తమను ప్రజలు ఎన్నుకున్నారు కనక తాము ఏం చేసినా చెల్లుతుందన్న విశ్వాసం మోదీకి అపారంగా ఉంది.

ఈ బిల్లు ముస్లింల మతానికి సంబంధించింది కాదని, ఇది వక్ఫ్ భూములకు సంబంధించిందని నమ్మబలకడంతో ఈ దేశ వైవిధ్యభరిత సంస్కృతికి గండి కొట్టినట్టైంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ అనుకూల తీర్పులు ఎందుకు వస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. అధికారం సంపాదించడానికి ముస్లిం ఓట్లు అవసరమని తెలిసినా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ, నితీశ్ కుమార్ నాయకత్వంలోని జనతాదళ్ (యు), చిరాగ్ పాశ్వాన్ నాయకత్వంలోని ఎల్.జె.పి., జయంత్ చౌదరి నాయకత్వంలోని ఆర్.ఎల్.డి. వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇవ్వడానికి అంత అత్యుత్సాహం ఎందుకు ప్రదర్శించాయో కూడా ఈ నేపథ్యం నుంచే అర్థం చేసుకోవచ్చు. ఈ నాలుగు పార్టీలు అనువైనప్పుడల్లా వల్లించే సెక్యులర్ పాఠాలకు కట్టుబడి ఉంటే ఈ బిల్లు పార్లమెంటు ఉభయ సభల్లో గట్టెక్కి ఉండేదేకాదు. అసలు ఈ బిల్లును ప్రతిపాదించడానికే మోదీ సర్కారు సాహసించేది కాదు. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులకు కూడా ప్రాతినిధ్యం ఇవ్వాలన్న వితండవాదం సునాయాసంగా నెగ్గేదే కాదు. వక్ఫ్ బిల్లుల ద్వారా వాటి ఆస్తులను, భూములను కాపాడడం మాటేమోగాని మసీదులు, దర్గాల పరిధిలోని ఆస్తుల మీద బీజేపీ కన్నేసిందనేది మాత్రం స్పష్టం. ముస్లింల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలన్నదే మోదీ ప్రభుత్వ అసలు ఎత్తుగడ. ఇది హిందూత్వ ఎజెండాలో భాగమే. ముస్లింలను షరియాను, వారి మతాన్ని అనుసరించకుండా చేసే దాష్టీకంలో భాగమే. ప్రతిపాదిత బిల్లు రాజ్యాంగంలోని 14, 15, 16, 26, 29 అధికరణాలను ఉల్లంఘిస్తోందని ప్రతిపక్షాలు చేస్తున్న వాదనలను కూడా అధికారంలో ఉన్న పార్టీ, దానికి ఊతకర్రలు అందిస్తున్న పార్టీలు బుల్డోజర్ కింద నలిపేస్తున్నాయి. గత ఆగస్టులోనే ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టారు. అప్పుడూ ప్రతిపక్షాలు ఇది "కిరాతక" చట్టం అని అభ్యంతరం వ్యక్తం చేశాయి. దానికి కంటి తుడుపుగానే సంయుక్త పార్లమెంటరీ కమిటీ లాంటి చర్యలు తీసుకున్నారు. ముస్లింలను "ఉద్ధరించే" పేరుతో మోదీ ప్రభుత్వం ముమ్మారు తలాక్ చట్టం తీసుకొచ్చింది. ఇమ్మిగ్రేషన్ బిల్లు, వక్ఫ్ సవరణ బిల్లు, శత్రు ఆస్తుల బిల్లును మోదీ ప్రభుత్వం ఇప్పుడు ముస్లింల మెడ మీద కత్తుల్లా వినియోగిస్తోంది. మోదీ వ్యవహార సరళి చూస్తుంటే ప్రతిపక్షాల అభిప్రాయాలకు చోటే ఇవ్వని రీతిలో ఉంది. మోదీకి మద్దతిచ్చే ఎన్డీయేలోని పార్టీల వైఖరీ చూస్తే స్వచ్ఛందంగా మోదీ పాదారవిందాల కింద ఆత్మార్పణ చేస్తున్నట్టుగానే ఉంది. ఎన్డీయే ప్రభుత్వంతో సయ్యాట తెలుగు దేశానికి అలవాటే. అసలు మోదీ పేరును 2013 లో ప్రధాని అభ్యర్థిగా ప్రకటించినప్పుడు నితీశ్‌కుమార్ అధికారం పట్టుకుని వేలాడడానికి కనీసం రెండు సార్లు పిల్లి మొగ్గ వేశారు. వక్ఫ్ సవరణ బిల్లు బుధవారం లోక్‌సభలో చర్చకు రావడానికి ముందు పది రోజులుగా తెలుగుదేశం, జేడీ(యు) నాయకులు చేసిన ప్రకటనలకు, తీరా పార్లమెంటులో చర్చ సందర్భంగా ఈ పక్షాలు ప్రదర్శించిన వైఖరికి మధ్య ఏ మాత్రం పొంతనే లేదు. మాకు ముస్లిం ఓట్లు అవసరం లేదు అని బీజేపీ ప్రకటించి చాలా కాలం అయింది. అంటే 80:20 సిద్ధాంతానికే బీజేపీ కట్టుబడి ఉంది. మోదీ ప్రభుత్వ అసలు లక్ష్యం ముస్లింల ఆస్తులే.

ప్రజాస్వామ్యంలో ప్రజలే ముఖ్యం

ఈ పాలన నాకు నచ్చలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే ముఖ్యం. కాని ప్రస్తుతం మన దేశంలో ప్రజా వ్యతిరేక పాలన జరుగుతోంది. ఈ విషయంలో పూర్తి నిరసన తెలియజేస్తున్నా. ఏంటి బావ నిరసన బాట పడుతున్నావు. కమ్యూనిస్టులు ఈ మధ్య ప్రభుత్వ వ్యతిరేక చర్యలపై నిరసన తెలియజేస్తూ ప్రదర్శన చేస్తున్నారు. నువు కూడా కలుస్తావా కలిస్తే తప్పేంటి. నిజమేనయ్యా తప్పుకాదు. తప్పక ప్రజల హితం కోరే వారందరు నిరసన బాట పట్టాల్సిందే. ప్రపంచంలో మనది అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అని గొప్పలు చెప్పుకుంటాం. కాని ఏలిన వారు తీసుకునే నిర్ణయాలు ప్రజలకు కాక కుబేరులకు మేలు చేసేవిగా ఉంటున్నాయి. ప్రపంచ సంపద, ముఖ్యంగా మన దేశ సంపద కన్నా పదిమంది పారిశ్రామికవేత్తల సంపద ఎక్కువని కొన్ని సర్వేలు చెబుతున్నాయి. అసలు ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు తమ అవసరాలు తీర్చడానికి కొంతమందిని ఎన్నుకుంటారు. వారినే ప్రజా ప్రతినిధులు అంటారు. వారు నిరంతరం ప్రజల హక్కులకు, ప్రజల స్వేచ్ఛకు భంగం కలుగకుండా పాలన సాగించాలి. కాని వాస్తవానికి అందుకు విరుద్ధంగా జరుగుతోంది. పాలించే వారు ఆశ్రిత పక్షపాతంతో వ్యవహరించడమే అందుకు కారణం. రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చాక తనవాడు తమ పార్టీ వారే ప్రజలని వారికి మాత్రమే ఉపయోగపడటం జరుగుతోంది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో జరగరానిది.

నిజమేనయ్యా అసలు అవసరమైతే రాజ్యాంగంలో సవరణలు చేయాలి. ఎన్నికలలో ముగ్గురు పోటీ చేసినప్పుడు విజయం సాధించిన వ్యక్తి కంటే మిగతా ఇద్దరికి కలిపి ఎక్కువ ఓట్లు రావచ్చు. అంటే గెలిచిన వ్యక్తికి సంబంధించిన పార్టీ అధికారంలోకి వచ్చి వారి పార్టీ వారికే పని చేయడం తప్పుకదా. పది నెలల నాడు జరిగిన ఎన్నికలలో బీజేపీ కేవలం రెండు శాతం కన్నా తక్కువ ఓట్ల తేడాతో అధికారం చేజిక్కించుకుంది. అంటే మిగతా 48 శాతం ప్రజలకు అన్యాయం చేయడం చట్టబద్ధంగా కాకపోయినా న్యాయబద్ధంగా తప్పే. అసలు ఓట్ల ద్వారా ఎన్నికలు జరిగినప్పుడు ఎక్కువ ఓట్లు వేసిన వారికి అన్యాయం

జరగరాదు. ముగ్గురు, నలుగురు పోటీ చేసినప్పుడు మూడో వంతు ఓట్లతో నెగ్గితే వారు ప్రభుత్వం ఏర్పాటు చేసినపుడు మిగతా రెండు వంతుల ప్రజలకు ప్రభుత్వంలో ప్రాతినిధ్యం లేకపోవడం నైతికంగా అన్యాయమే. ప్రజాస్వామిక పాలనలో ఓట్ల శాతం ముఖ్యం. అంటే ఓట్ల శాతం బట్టి ఎక్కువ శాతం ప్రజలు కోరుకున్న వారే పరిపాలించాలి. మన రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీకి కలిపి 60 శాతం ఓట్లు రాగా వైసీపీకి 39.37 శాతం ఓట్లు పోలైనాయి. కాని 39.37 శాతం ప్రజల తరపున అసెంబ్లీలో మాట్లాడడానికి ప్రతిపక్ష హోదా దక్కడం లేదు. మొత్తం శాసన సభ్యుల్లో 10 శాతం సభ్యులు ఉన్నా మాట్లాడే అర్హత ఉంటుంది కదా. శాసన సభ్యుల సంఖ్యలో 10 శాతం కంటే ఓట్లలో దాదాపు 40 శాతం పొందినా ప్రతిపక్ష హోదా దక్కని రాజ్యాంగంలో ప్రజలకు అన్యాయం జరిగినట్లే. ఏ శాసనం చేసినా ఎన్ని జీవోలు తెచ్చినా ప్రజల కోసమే అయినప్పుడు 40 శాతం ప్రజలను విస్మరించడం అన్యాయం. అవసరమయితే ప్రజల కోసం రాజ్యాంగంలో సవరణలు కూడా అవసరమనే సంగతి పాలకులు గుర్తించాలి. ఈ విషయంలో అవసరమయితే రాజ్యాంగ నిపుణులతో, మేధావులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి ప్రజల కోసం ప్రజలు పరిపాలించుకునే ప్రజాప్రభుత్వంలో కొన్ని సవరణలు ప్రజల కోసం చేయడం అవసరం. ప్రజాస్వామ్య వ్యవస్థలో సర్వం ప్రజల కోసమనే సంగతి మరువరాదు.

అంతేకాకుండా మూడో వంతు ఓట్లతో విజయం సాధించిన శాసన సభ్యులు అందులో తన వెంట తిరగని సామాన్య ప్రజలకు పనులు చేయకుండా తమతో అంటకాగిన వారికే పనులు చేయడంతో నాల్గవ వంతు ప్రజలకే అభివృద్ధి దక్కుతున్న విషయం తెలియంది కాదు. ప్రజాహితం కోరే పార్టీలన్నీ కూటమిగా ఏర్పడటం తప్పుకాదు. ఏర్పడి ప్రభుత్వాని ఏర్పాటు చేసుకుని ప్రజలకు ఏం చేస్తున్నారనేది ముఖ్యం. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు ఎందుకు నెరవేర్చడం లేదో సమాధానం చెప్పాలి. ఖాళీ ఖజానా సంగతి ఎన్నికల ముందు తెలియక వాగ్దానాలు చేశారా అని ప్రజలడుగుతున్న వారికి సమాధానం చెప్పవలసిన నైతిక బాధ్యత కూటమిదే. అందలం ఎక్కగానే సరిపోదు దాన్ని నిలుపుకోవడం ముఖ్యం. గద్దె ఎక్కిన తరువాత పన్నులు పెంచడం మంచిది కాదు. 40 ఏళ్ల అనుభవంతో సంపద సృష్టిస్తానని ఎన్నికల ముందు చెప్పి గద్దెనెక్కి సంపద సృష్టి సంగతి పక్కనపెట్టి పన్నులు పెంచడం ప్రజలను మోసం చేయడం కాదా అని సామాన్య ప్రజలు అడుగుతున్నారు. నిబంధనల ప్రకారం 17 మంది శాసన సభ్యులుంటే ప్రతిపక్ష హోదా ఇస్తారు. కాని 17 మంది శాసన సభ్యులు సాధించిన ఓట్ల కంటే అధికంగా 40 శాతం ఓట్లు సాధించినా హోదా దక్కక పోవడం నైతికంగా తప్పు కావచ్చు. 40 శాతం ఓట్లు వేసిన వారిని పరిగణనలోకి చట్టం అనుమతించకపోయినా ప్రజలకు మంచి చేసే మంచి ప్రభుత్వం తమదని చెప్పుకునే కూటమి ప్రభుత్వం ఆ అవకాశం ఇవ్వవచ్చు. ప్రజలందరికి మంచి చేస్తున్నప్పుడు ప్రతిపక్ష నేతకు విమర్శించడానికి విషయం ఉండదు కదా అని ప్రభుత్వంలో ఉన్నవారు ఆలోచించాలి. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో మంచి ప్రభుత్వానికి ఎదురు దెబ్బతగలడం ప్రజల తీర్పుగా భావించాలి. మంచి ప్రభుత్వమని ప్రజలు చెప్పాలి కాని అధికారంలో ఉన్నవారు కాదు. ఏదిఏమైనా ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే ముఖ్యం కనుక ఎక్కువ శాతం ప్రజల కొరకు రూపొందిన రాజ్యాంగాన్ని ప్రజల కోసం కొన్ని సవరణలు చేయడం అవసరంగా రాజ్యాంగ నిపుణులు భావించాలి.

సెల్: 9885569394

పునర్విభజన వద్దు... పరిమితి మేలు

నంటూబెనర్జీ

ప్రపంచంలో అతి పెద్ద ఫెడరల్ (సమాఖ్య) ప్రజాస్వామ్య దేశం అమెరికా ప్రతినిధుల సభలో 1913 నుంచి ఇంతవరకు 435 సీట్లు మాత్రమే ఉన్నాయి. అయితే అత్యధిక జనాభా గల భారతదేశ లోక్‌సభలోను, రాష్ట్రాల అసెంబ్లీలలో సీట్లు పెంచడం కోసం నియోజక వర్గాల పునర్విభజించడం అమెరికాతో పోలిస్తే ఏమాత్రం సమర్థనీయమైంది కాదు. చాలా సంవత్సరాల తర్వాత దేశంలో జనాభా గణనను నిర్వహిస్తున్నారు. భారతదేశంలో జనాభా నియంత్రణ ఎంతైనా అవసరం. పెరుగుతున్న జనాభా విషయంలో ఆందోళన చెందాలి.

పాలకులు తమకు అనుకూలంగా ఉన్న రాష్ట్రాలలో ఎక్కువ సీట్లు ఉంటే ఎన్నికల్లో అధిక సీట్లు గెలుచుకొని మళ్లీ అధికారం చేపట్టాలన్న ఆరాటంతో నియోజక వర్గాల పునర్విభజన కోసం ప్రభుత్వం తహతహలాడుతోంది. ఓట్లు వేసి గెలిపించే ప్రజలకు మేలు చేకూర్చే పాలన అందివ్వడమే అవసరం. గత సంవత్సరం మన దేశ జనాభా చైనా జనాభాను మించిపోయింది. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కువ జనాభా మనది. భూమి విస్తీర్ణంలో భారతదేశం కంటే చైనా భూ విస్తీర్ణం మూడు రెట్లు ఎక్కువగా ఉంది. ప్రజలంతా ఆర్థిక వృద్ధి ద్వారా ప్రయోజనం పొందడానికి, ప్రత్యేకించి విద్యా, వైద్య రంగాలలో వృద్ధి చెందడానికి జనాభా నియంత్రణపై దృష్టి పెట్టాలి. జనాభా నియంత్రణకే ప్రాధాన్యత నిచ్చి, పునర్విభజనను ప్రస్తుతానికి నిలిపి వేయాలి. అదనంగా సభ్యులు ఎన్నికై పని లేనట్లుగా సీట్లలో కూర్చుని ఉండటం కంటే తక్కువ మంది సభ్యులు ఉన్నప్పటికీ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి శ్రద్ధగా చర్చల్లో పాల్గొనే అవకాశం కలుగుతుంది. సభ్యులు పెరిగినంత మాత్రం ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్న హామీ లేదని ప్రస్తుతం జరుగుతున్న పాలన స్పష్టం చేస్తోంది.

ప్రతి రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీలో నియోజక వర్గాలు, సరిహద్దులకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీలకు కూడా సీట్లు ఉన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 82, 170 ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీలో సీట్ల సంఖ్యను నిర్ణయిస్తారు. అయితే ప్రతిసారి జనాభా గణన అనంతరం సరిహద్దుల ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీల్లో సీట్లను తిరిగి సర్దుబాటు చేయవచ్చు. లోక్‌సభ,

అమెరికాలో 1911లో అపోర్షన్‌మెంట్ (కేటాయింపు చట్టం) ద్వారా ప్రతినిధుల సభ సభ్యుల సంఖ్యను 435 తో కట్టడి చేసింది. 1959 లో హవేలి, అలస్క రాష్ట్రాలను తాత్కాలికంగా కలపగా సభ్యుల సంఖ్య 437కు పెరిగింది. 1910లో జనాభా గణన తర్వాత జిల్లాల సంఖ్య మూడు రెట్ల కంటె ఎక్కువయ్యాయి. జిల్లాకు దాదాపు 2,12,000 జనాభా ఉన్నారు. ఫెడరల్ చట్టం గణాంకాల సూత్రాల ప్రకారం ఒక రాష్ట్రంలో ఎంతమంది సభ్యులుండాలని ప్రతినిధుల సభ నిర్ణయించింది.

అసెంబ్లీల్లో సీట్ల సంఖ్యను పెంచకుండా నిలిపివేయ డానికి చట్ట సవరణ ఎంతైనా అవసరం. చట్ట ప్రకారం పార్లమెంటు నియమించే 'పునర్విభజన కమిషన్' నివేదిక ప్రకారం 'పునర్విభజన ప్రక్రియ' జరిగింది. గతంలో 1951, 1961, 1971 సంవత్సరాల్లో పదేళ్లకు ఒకసారి ఈ ప్రక్రియ జరిగింది. అమెరికా ప్రతినిధుల సభలో 1913 నుంచి ఇంతవరకు సీట్ల సంఖ్య మారలేదు. జనాభా సంఖ్య 1913 లో 94 మిలియన్లుండగా మధ్య నాలుగు సార్లు మినహా అదీ స్వల్పంగా గత సంవత్సరం నాటికి 340 మిలియన్లకు పెరిగింది.

అమెరికాలో 1911లో అపోర్షన్‌మెంట్ (కేటాయింపు చట్టం) ద్వారా ప్రతినిధుల సభ సభ్యుల సంఖ్యను 435 తో కట్టడి చేసింది. 1959 లో హవేలి, అలస్క రాష్ట్రాలను తాత్కాలికంగా కలపగా సభ్యుల సంఖ్య 437కు పెరిగింది. 1910 లో జనాభా గణన తర్వాత జిల్లాల సంఖ్య మూడు రెట్ల కంటె ఎక్కువయ్యాయి. జిల్లాకు దాదాపు 2,12,000 జనాభా ఉన్నారు. ఫెడరల్ చట్టం గణాంకాల సూత్రాల ప్రకారం ఒక రాష్ట్రంలో ఎంతమంది సభ్యులుండాలని ప్రతినిధుల సభ నిర్ణయించింది. భారతదేశంలో పార్లమెంటు స్వభావాన్ని లేదా నాణ్యతను పెంచవలసిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే రాష్ట్రాల అసెంబ్లీల నాణ్యత కూడా పెరగవలసి ఉంది. చట్ట సభల్లో ఎక్కువ మంది సభ్యులను గెలిపించుకోవాలని రాజకీయ పార్టీలు ఆరాటపడతాయేగాని ప్రజల సమస్యలను పరిష్కరించడానికి చట్టాలను సమర్థంగా వినియోగించడంలో ఆసక్తి చూపవు. ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం సమర్థంగా సమస్యలు, చేయవలసిన పనులపై చర్చించాలి, అవసరమైతే సవరించుకోవాలి. అవసరాన్ని అనుసరించి కొత్త సమస్యలను చర్చించాలి. ఎన్నికల్లో గెలవగలరని గట్టిగా అనుకున్న సినీ నటులు, ఇతర విధంగా గెలుస్తారనుకున్న అభ్యర్థులను ఎంపిక చేసుకొని సీట్లను చేపట్టడం వలన ప్రయోజనం ఉండదు. భారతదేశంలో పరిస్థితి ఇప్పుడు ఇదే. ఇలాంటి సభ్యులు సభాకాలమంతా ఎలాంటి చర్చల్లో పాల్గొనకుండా సీట్లలో కూర్చుని కాలం గడిపే వారిని చూస్తూనే ఉంటాము. లోక్‌సభలో క్రియాశీలంగా చర్చల్లో పాల్గొనే సభ్యులు కనీసం 30 శాతం కూడా లేరు. కొంతమంది సభ్యులు కునుకుపడుతూ, కనీసం చర్చలను వినను కూడా వినరు. కొన్ని రాజకీయ పార్టీలు తమకు మెజారిటీ సభ్యులు కావాలని అన్ని రకాల కుయుక్తులు పన్ని తమ లక్ష్యం నెరవేర్చుకుంటారు. ఎక్కువ మంది సభ్యులను గెలిపించుకునేందుకు మాత్రమే తమ సమయాన్ని కేటాయించకుండా సభకు ఎక్కువ సమయం హాజరు కారు. పునర్విభజన ద్వారా చట్టసభలో సీట్లను పెంచుకోవడం ద్వారా ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుచుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసి తమ చిరకాల లక్ష్యం నెరవేర్చుకునేందుకే. ఇలాంటి చర్యలు నిలిచిపోవాలి. అయితే పాలకులు ఇలాంటి మంచి నియమ నిబంధనలు పాటించాలన్న చిత్తశుద్ధి ఉండాలి. తప్పుడు కార్యకలాపాలు నిర్వహించిన రాష్ట్రాలను శిక్షించాలి. జనాభా వృద్ధి విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. జనాభా విపరీతంగా పెరిగితే మరింత ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయి. ఇలా పెరగడాన్ని ఏమాత్రం అంగీకరించరాదు.

లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ సభ్యులు పెరిగిన కొలదీ పాలనా ఖర్చులు అపారంగా పెరుగుతాయి. ఇప్పటికే సభ్యులకు అనేక రకాల ఖర్చులు ప్రజలకు అపార భారమయ్యాయి. ఉదాహరణకు ఒక ఎంపీకి సంవత్సరానికి ప్రభుత్వం 6 కోట్ల రూపాయల ఖర్చవుతుంది. ఇందులో వేతనాలు, పెర్క్‌లు, (ప్రభుత్వం నుంచి అదనంగా లభించే ఆదాయం) ఇతర ఖర్చులు, ఎంపీ లాడ్స్ (పార్లమెంటు సభ్యులు స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం) ఉంటాయి. గత సంవత్సరం ఎంపీకి 24 శాతం వేతనాన్ని పెంచారు. అయితే ఈ పెంపుదల 2023 ఏప్రిల్ నుంచే అమలైంది. గత ఐదు దశాబ్దాల కాలంలో భారత పార్లమెంటు (లోక్‌సభ) 543 మందితో పరిపాలన జరిగింది. 55 కోట్ల నుంచి ఇప్పటికీ 145 కోట్ల జనాభాకు చేరింది. రానున్న మూడు దశాబ్దాల్లో 165 కోట్ల నుంచి 170 కోట్లకు జనాభా పెరుగుతుందని అంచనా. అదే చైనా 2060 నాటికి 121 కోట్ల జనాభాకు చేరుకుంటుందని అంచనా. ఏ విధంగా చూసినప్పటికీ జనాభాను మరింత పెంచుకొని తద్వారా నియోజక వర్గాలను పెంచుకోవడం ఏమాత్రం మంచిది కాదని విశ్లేషకులు, నిపుణులు చెప్తున్నారు.

సీపీఐ ప్రధాన కార్యదర్శులు - 6

అజయ్ ఘోష్

ఆర్వీ రామారావ్

బెంగాల్‌లోని వర్ధమాన్ జిల్లాలో జన్మించిన అజయ్ ఘోష్ తన తండ్రి డా. సచీంద్రనాథ్ ఘోష్ తో పాటు కాన్పూర్ వెళ్లిపోయారు. 1926లో అలహాబాద్ విశ్వవిద్యాలయంలో చేరకముందు అజయ్ ఘోష్‌కు భగత్ సింగ్, భటుకేశ్వర్ దత్‌తో పరిచయం అయింది. భగత్ సింగ్ నాయకత్వంలోని హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌లో అజయ్ ఘోష్ సభ్యులుగా ఉండేవారు. 1929లో లాహోర్ కుట్రకేసు విచారణ నేపథ్యంలో అజయ్ ఘోష్‌ను అరెస్టు చేశారు. కానీ తగిన సాక్ష్యాధారాలు లేనందున విడుదల చేశారు. 1931లో ఆయనను మరో సారి అరెస్టు చేశారు. అప్పుడే ఆయనకు జైలులో శ్రీనివాస్ సర్దేశాయ్‌తో పరిచయమైంది. జైలు నుంచి విడుదలైన తరవాత అజయ్ ఘోష్ కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

1951లో ఆయన కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1962లో క్షయ వ్యాధితో 53వ ఏట మరణించేదాకా సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. భారత్, చైనా యుద్ధం జరిగినప్పుడు కూడా ఆయనే సీపీఐ అగ్రనాయకుడు. ఆ సమయంలో అజయ్ ఘోష్ సీపీఐలో మధ్యేవాద నాయకుడిగా ఉండేవారు. అజయ్ ఘోష్ సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో సీపీఐని దేశమంతటా తెలిసేట్టు చేశారు. ఆ దశలోనే కాంగ్రెస్ తరవాత సీపీఐ అతి పెద్ద పార్టీగా ఉండేది. సీపీఐ ప్రతిష్ఠ పెరగడంలో అజయ్ ఘోష్ పాత్ర చాలా ఉంది. 1920లు, 1930లలో అజయ్ ఘోష్ భగత్ సింగ్ నడిపిన అజ్ఞాత కార్యకలాపాలలో భాగస్వామిగా ఉన్నారు. అయితే అలాంటి ఉద్యమానికి జనబాహుళ్యంతో సంబంధం ఉండదని ఆయన గ్రహించారు. అజ్ఞాతంగా ఉద్యమం నడపడం సరైన దారి కాదన్న భావన భగత్ సింగ్‌కు కూడా ఉండేది. ఉరి తీయకుండా ఉంటే భగత్ సింగ్ కచ్చితంగా సీపీఐలో చేరి ఉండేవారు.

అజయ్ ఘోష్ కు మార్క్సిస్టు సిద్ధాంతం మీద మంచి పట్టు ఉండేది. ఈ సిద్ధాంతాన్ని కరదీపికగా ఉపయోగించి ఆయన అనేక క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడ్డారు. తాను తీసుకునే ప్రతి నిర్ణయానికి సైద్ధాంతిక వివరణ ఇచ్చే వారు. స్వాతంత్ర్య సాధన తరవాత తొలి దశలో కమ్యూనిస్టులలోనే నెహ్రూ ప్రభుత్వ సామర్థ్యం, స్వభావంపై అనేక అనుమానాలు ఉండేవి. అసలు బూర్జువా వర్గం స్వాతంత్ర్యం సాధిస్తుందా అన్న అనుమానాలు ఉండేవి. స్వతంత్ర భారతంలో విచిత్రమైన పరిస్థితులు ఉండేవి. ఒక వేపు రాజకీయ ప్రజాస్వామ్యం వేళ్లూనుకుంటోంది. మౌలిక సదుపాయాలు గల ఆర్థిక పునాది మీద ప్రజాస్వామ్యం బలపడుతోంది. ప్రభుత్వ రంగం బలంగా ఉండేది. విదేశాంగ విధానం స్వతంత్రంగా ఉండేది. భావ ప్రకటనా స్వేచ్ఛకు కొదవే లేదు. బహుళ పార్టీల వ్యవస్థ



అజయ్ ఘోష్

రూపుదిద్దుకుంటూ ఉండేది. ప్రజలకు ప్రజాస్వామ్య హక్కులు ఉండేవి. ప్రజోద్యమాలు బహిరంగంగానే జరిగేవి.

ప్రజోద్యమాల ద్వారానే అనేక హక్కులు ప్రజలు సాధించుకోగలిగారు. వెనుకబడిన దేశంలో బూర్జువా వర్గం అధికారంలో ఉండగా ఇలాంటి పరిస్థితులున్నప్పుడు కమ్యూనిస్టుల వైఖరి ఎలా ఉండాలి అన్నది అప్పుడు సమస్య. ఈ స్థితి కమ్యూనిస్టులలో ఒక వర్గానికి అయోమయంగా ఉండేది. ఈ వర్గానికి అసలు మనం సాధించిన స్వాతంత్ర్యమే బూటకం అన్న అభిప్రాయమూ ఉండేది. ప్రజాస్వామ్యం, మౌలిక మార్పులు కేవలం శ్రామిక వర్గ నాయకత్వంలో (అంటే కమ్యూనిస్టు పార్టీ సారథ్యంలోనే సాధ్యం) అన్న ధోరణి కొందరు కమ్యూనిస్టుల్లో ప్రబలంగా ఉండేది. ఈ వర్గం వారు ఎన్నికలే బూటకం అన్నారు. కానీ ఆ ఎన్నికల ప్రక్రియ ద్వారే 1957లో కమ్యూనిస్టు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇలాంటి పెడసర ధోరణే ఆ సమయంలో కమ్యూనిస్టు పార్టీని బాగా దెబ్బ తీసింది. దేశంలో అప్పుడు ఓ విశిష్టమైన పరిస్థితి ఉండేది. ఒక వేపున మంచి పునాదులున్న ప్రజాస్వామ్యం, ప్రగతిశీలమైన సామాజికార్థిక అభివృద్ధి పంథా కొనసాగుతూ ఉండేది. ఒక రకంగా చెప్పాలంటే దేశం అభివృద్ధి పథంలో సాగుతున్నప్పుడు కమ్యూనిస్టులు తమకు తామే నష్టం చేసుకున్నారు.

ఈ స్థితిలో అజయ్ ఘోష్ రచనలు, ఉపన్యాసాలు జాతీయ భావనలు, వర్గ దృక్పథంతో విశ్లేషణలతో కూడి ఉండేవి. జాతీయ దృష్టి లేకుండా కమ్యూనిస్టు పార్టీ మనలేదని అజయ్ ఘోష్ సరిగ్గానే అంచనా వేశారు. అభివృద్ధి చెందుతున్న దేశంలో ఈ అవగాహన తప్పని సరి. దేశంలో, ప్రపంచంలో నూతనాంశాలన్నింటినీ అజయ్ ఘోష్ ఆకళింపు చేసుకున్నారు. జాతీయ, వర్గపరమైన సమస్యలకు పరిష్కారం కోసం జనం కమ్యూనిస్టుల వేపు చూస్తున్న రోజులవి. ప్రభుత్వ రంగం, జాతీయకరణ, జమీందారీ వ్యవస్థ రద్దు, భారీ స్థాయిలో పారిశ్రామికీకరణ, శాంతి, నిరాయుధీకరణ కోసం పోరాటం, ప్రాంతీయ భాషల ప్రాధాన్యతను గుర్తించడం, గోవా, పుదుచ్చేరి విమోచన, సోషలిస్టు దేశాలతో స్నేహం; ఇలా అన్ని చోట్ల కమ్యూనిస్టుల పాత్ర కనిపించేది. దీనికి అజయ్ ఘోష్ కృషే ప్రధానం. మావోయిస్టు భావజాల ప్రభావాన్ని కూడా అజయ్ ఘోష్ సవ్యంగానే గుర్తించారు. ఆ దశలోనే కమ్యూనిస్టు పార్టీ చీలకుండా చూడడానికి ఆయన తన ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా ప్రయత్నించారు. అంతర్జాతీయంగా మావోయిస్టు ధోరణి వల్ల కలిగే నష్టాన్ని వివరించడానికి ఆయన చైనా కూడా వెళ్లారు. అదే సమయంలో అంతర్జాతీయంగా మావోయిజం ప్రాబల్యం కారణంగా సీపీఐలో మావోయిస్టు భావజాలానికి గురైన వారు బలం పుంజుకున్నారు. 1961లో విజయవాడలో జరిగిన సీపీఐ మహాసభకు క్షయ వ్యాధితో బాధపడుతున్న అజయ్ ఘోష్‌ను స్ట్రెచర్ మీద తీసుకు రావాల్సి వచ్చింది. అజయ్ ఘోష్ సైద్ధాంతిక పోరాటం మరువలేనిది.

బెదిరింపులకు 'తగ్గేదేలే'

- నాపై ఆరోపణలు నిరూపించగలరా?
- బీజేపీకి మల్లికార్జున ఖర్గే సవాల్
- అనురాగ్ ఠాగూర్ రాజీనామాకు డిమాండ్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం రాజ్యసభ శూన్య గంటలో ఖర్గే మాట్లాడుతూ... బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ తనపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఖర్గే నోటి వెంట పుష్ప చిత్రంలోని డైలాగ్ "ఝుకేగా నహీ" (తగ్గేదేలే) కూడా వచ్చింది. లోక్‌సభలో బుధవారం వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ముస్లిం సమాజ సంక్షేమం కోసం ఉద్దేశించిన వక్ఫ్ ఆస్తులను రాజకీయ సామ్రాజ్యాన్ని నిర్మించడానికి కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు దోపిడీ చేస్తున్నాయని ఠాకూర్ ఆరోపించారు. ఈ భూములను సరైన రీతిలో ఉపయోగించుకునే బదులు కాంగ్రెస్ తన ఎన్నికల లాభాల కోసం వాటిని ఓటు బ్యాంకు ఏటీఎంగా మార్చిందని ఆరోపణలు చేశారు. ఖర్గే ఎలాంటి అనుమతి లేకుండా భూముల్ని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణపై గురువారం ఖర్గే రాజ్యసభలో స్పందించారు. రాజకీయ దాడులకు తాను తలొగ్గనని స్పష్టం చేస్తూ... అనురాగ్ ఠాకూర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు నన్ను భయపెట్టి లొంగదీసుకోవాలనుకుంటే... నేను ఎప్పటికీ తలవంచను(ఝుకేగా నహీ) అని అన్నారు. తాను బెదిరింపులకు భయపడనని గుర్తుంచుకోవాలని చెప్పారు. "నా జీవితం ఎప్పుడూ తెరిచిన పుస్తకం. అది పోరాటాలతో నిండి ఉంది. అయితే నేను ఎల్లప్పుడూ ప్రజా జీవితంలో అత్యున్నత విలువలను సమర్థించాను. దాదాపు 60 సంవత్సరాల రాజకీయాల్లో ఉన్న తర్వాత... ఇటువంటి వంటివాటికి అర్హుడిని కాదు. నిన్న లోక్‌సభలో అనురాగ్ ఠాకూర్ నాపై పూర్తిగా తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు. లోక్‌సభలో అనేకమంది ఎంపీలు ప్రశ్నించినప్పుడు... అతను తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవలసి వచ్చింది. కానీ నష్టం జరిగింది" అని ఖర్గే పేర్కొన్నారు. అనురాగ్ ఠాకూర్ దాడి తన రాజకీయ జీవితంపై భారీ మచ్చ వేసిందని ఖర్గే పేర్కొన్నారు. ఇందుకు బీజేపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనురాగ్ ఠాకూర్ చేసిన ఆరోపణలను నిరూపించలేకపోతే ఆయనకు పార్లమెంటులో కూర్చునే హక్కు లేదని...వెంటనే రాజీనామా చేయాలన్నారు. ఆయన ఆరోపణలు రుజువైతే, తాను రాజీనామా చేస్తానన్నారు. వక్ఫ్ భూమికి సంబంధించిన ఒక్క స్థలాన్ని కూడా తాను లేదా తన పిల్లలు ఆక్రమించుకున్నారని ఆయన నిరూపిస్తే... తాను రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. తాను ఇలాంటి బెదిరింపులకు భయపడనని... తాను ఒక కార్మికుడి కొడుకుని ఖర్గే పేర్కొన్నారు. అయితే ఈ వ్యవహారంపై రాజ్యసభ జైర్మన్ ధన్కర్ స్పందిస్తూ... సభలోని సభ్యులు ఒకరినొకరు గౌరవించుకోవాలని కోరారు. సభ్యులకు కౌన్సెలింగ్ అవసరమని, రాజకీయ పార్టీలు తప్పనిసరిగా వారికి వర్క్‌షాప్‌లను నిర్వహించాలని, వారి సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఈపీఎఫ్ విత్‌డ్రా సులభతరం

న్యూఢిల్లీ: ఈపీఎఫ్ విత్‌డ్రా మరింత సులభతరం కానుంది. ఆన్‌లైన్‌లో డబ్బు ఉప సంహరించుకోవాలంటే చెక్కుకు సంబంధించిన ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని ఈపీఎఫ్‌వో పేర్కొంది. దీంతో పాటు బ్యాంక్ ఖాతాను యజమానులు ధ్రువీకరించాల్సిన అవసరం లేదని తెలిపింది.

ఈ ఫాస్ట్ ట్రాక్ క్లెయిమ్ సెటిలెమెంట్ ప్రక్రియతో దాదాపు ఎనిమిది కోట్ల మందికి ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం ఉద్యోగులు తమ పీఎఫ్ ఖాతాలో నిధులు ఉపసంహరణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలంటే యూఏఎన్ లేదా పీఎఫ్ నంబర్‌తో లింక్ చేసిన బ్యాంక్ పాస్‌బుక్‌కు సంబంధించిన చెక్ ఫొటోని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత దరఖాస్తుదారుడి బ్యాంక్ ఖాతా వివరాలు కూడా యజమానులు ఆమోదించాల్సి ఉంటుంది. ఈ రెండంచెల వెరిఫికేషన్ పూర్తయిన తర్వాతే నగదు చేతికందుతుంది. ఈ అవసరాన్ని ఈపీఎఫ్‌వో పూర్తిగా తొలగించినట్లు కార్మిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు క్లెయిమ్ తిరస్కరణల్ని తగ్గించేందుకు ఈ చర్యలు సాయపడతాయని పేర్కొంది.

పీపీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త

పీపీఎఫ్ ఖాతాలో నామినీ పేరు అప్‌డేట్ చేయడానికి లేదా జోడించడానికి ఇకపై ఎటువంటి ఫీజు ఉండదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పీపీఎఫ్‌లో నామినీ మార్చుకునేందుకు ఇకపై చార్జీలుండవని పేర్కొంటూ దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. పీపీఎఫ్ ఖాతాలలో నామినీ వివరాలు సవరించడం కోసం ఆర్థిక సంస్థలు చార్జీలు విధిస్తున్నట్లు ఇటీవల తమ దృష్టికి వచ్చిందని ఆర్థిక మంత్రి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ప్రభుత్వ పొదుపు ప్రమోషన్ జనరల్ రూల్స్, 2018లో ఏప్రిల్ 2, 2025 నాటి గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అవసరమైన మార్పులు చేయబడ్డాయి, పీపీఎఫ్ ఖాతాలకు నామినీల మార్పుపై చార్జీని తొలగించడం జరిగింది. గెజిట్ నోటిఫికేషన్ ద్వారా చిన్న పొదుపు పథకాలకు నామినేషన్ రద్దు లేదా మార్పు కోసం రూ.50 రుసుం రద్దు చేయబడింది' అని నిర్మలా సీతారామన్ తెలిపారు. పార్లమెంటులో ఆమోదించబడిన బ్యాంకింగ్ సవరణ బిల్లు 2025 నిబంధనల ప్రకారం ఇప్పుడు బ్యాంకు ఖాతాదారుల డబ్బు, లాకర్ల చెల్లింపు కోసం నలుగురు వ్యక్తులను నామినీలుగా చేర్చుకోవడానికి అనుమతిస్తుందని ఆర్థిక మంత్రి అన్నారు.

ప్రజా సమస్యలు విస్మరించారు

పవన్‌పై ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యలు

బెంగళూరు: ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి నటుడు ప్రకాశ్ రాజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ జాతీయ అవార్డులు, రాజకీయాలపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. ఇందులోభాగంగా పవన్ కల్యాణ్ గురించి మాట్లాడారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సమయంలో ప్రజా సమస్యల గురించి పవన్ మాట్లాడారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక మాత్రం వాటిపై పెద్దగా దృష్టిపెట్టడం లేదనే భావనను వ్యక్తం చేశారు. రకరకాలుగా మాట్లాడటానికి ఇదేం సినిమా కాదని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించకుండా సమయం ఎందుకు వృథా చేస్తున్నారని ప్రకాశ్‌రాజ్ ప్రశ్నించారు. తిరుపతి లడ్డూ వివాదంపై మాట్లాడుతూ సనాతన ధర్మానికి తాను వ్యతిరేకిని కాదన్నారు. అది చాలా సున్నితమైన అంశమన్నారు. భక్తుల మనోభావాలకు సంబంధించినదని, అందువల్ల ఇలాంటి వాటి గురించి మాట్లాడేటప్పుడు సరైన ఆధారాలతో జాగ్రత్తగా వ్యవహరించా లని తెలిపారు. లడ్డూ తయారీలో నిజంగానే కల్తీ జరిగితే బాధ్యులను వెంటనే శిక్షించాలని కోరారు.

దొంగలను పట్టించిన పెళ్లి కార్డు

ముంబై: పెళ్లికార్డు దోపిడీ దొంగలను పట్టించింది. ఈ ఘటన మహారాష్ట్రలో చోటుచేసుకుంది. బాధితుడి సోదరుడు సహా మరో నలుగురు ఈ దోపిడీకి పాల్పడినట్లు తేలిందని సీనియర్ అధికారి ఒకరు గురువారం తెలిపారు. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా జవహర్‌లోని వావర్ గ్రామ సమీపంలో మార్చి 28న దోపిడీ జరిగినట్లు పేర్కొన్నారు. మోఖాడ తాలుకాకు చెందిన బోరు ఖాండు బిన్నార్ (30) వ్యాన్‌లో ప్రయాణిస్తుండగా, బైక్ చెడిపోయిందంటూ ముగ్గురు వ్యక్తులు అతన్ని అడ్డగించారు. సాయం కోసం వారు చేసిన విజ్ఞప్తిని నమ్మిన బిన్నార్ డ్రైవర్‌ను వ్యాన్ ఆపాలని కోరాడు.

ఆ వెంటనే ముగ్గురు దొంగలు వారి కళ్లలో కారం చల్లి డ్రైవర్ సీటు వెనుక ఉంచిన రూ.6,85,500ను తీసుకుని పారిపోయారు. బీఆర్ఎస్‌లోని 309(4) (దొంగతనం), 3(5) (సాధారణ ఉద్దేశం) సెక్షన్ల కింద గుర్తు తెలియని నిందితులపై జవహర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

క్రైమ్ సీన్ విచారణలో పోలీసులు పెళ్లి కార్డులో కారం పొడి చుట్టినట్లు గుర్తించారు. పెళ్లికార్డులో ఉన్న పేరు ఆధారంగా కిరణ్ అనంత్ లామ్టే (23)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను కూడా దోపిడీలో పాల్గొన్నట్లు గుర్తించారు. బాధితుడి సోదరుడు దత్తు ఖాండు బిన్నార్ (34) ఈ దోపిడీకి ప్లాన్ వేసినట్లు తెలుసుకుని పోలీసులు అవాక్కయ్యారు. వారితో పాటు పరమేశ్వర్ కమ్లాకర్ జోలె (24), దాదా బాజీరావ్ పఝె (24)లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి నగదు స్వాధీనం చేసుకున్నారు.

అమెరికా సుంకాలపై మీ స్పందనేమిటి?

- మోదీ సర్కారుకు రాహుల్ సూటి ప్రశ్న
- ఆర్థిక వ్యవస్థ నాశనమవుతుందని ఆందోళన



న్యూఢిల్లీ: భారత్ దిగుమతులపై అమెరికా భారీస్థాయిలో సుంకాలు విధించిన క్రమంలో ఈ టారిఫ్‌లపై కేంద్ర ప్రభుత్వం స్పందన తెలియజేయాలని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. గురువారం లోక్‌సభ శూన్యగంటలో మాట్లాడిన రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధించిన సుంకాలు మన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తాయన్నారు. దీనిపై కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని నిలదీశారు. ఈ సందర్భంగా భారత్- చైనా దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకలపై రాహుల్ గాంధీ ప్రభుత్వాన్ని విమర్శించారు. "చైనా మన భూభాగంలో 4,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ఆక్రమించింది. కొంతకాలం క్రితం మన విదేశాంగ కార్యదర్శి (విక్రమ్ మిస్త్రీ) చైనా రాయబారితో కలిసి కేక్ కట్ చేయడం చూసి నేను షాక్ అయ్యాను. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే - చైనా స్వాధీనం చేసుకున్న 4వేల చదరపు కిలోమీటర్ల ఈ భూభాగం విషయంలో ఏం జరుగుతోంది?" అని రాహుల్ ప్రశ్నించారు. గల్వాన్ సంఘటనను ప్రస్తావిస్తూ... 2020లో 20 మంది జవాన్లు అమరులయ్యారని చెప్పారు. 'కేక్ కట్ చేయడం ద్వారా వారి బలిదానానికి ఒక వేడుక జరుగుతోంది. మేము సాధారణ స్థితికి వ్యతిరేకం కాదు. కానీ దానికి ముందు యథాతథ స్థితి ఉండాలి. మన భూమిని తిరిగి పొందాలి. రాష్ట్రపతి, ప్రధానమంత్రి చైనీయులకు లేఖ రాశారని కూడా నా దృష్టికి వచ్చింది' అని రాహుల్ అన్నారు. తాము దీనిని ఎవరో చెబితే తెలుసుకోలేదని, ప్రధానమంత్రి, రాష్ట్రపతి తమకు లేఖ రాశారని భారత ప్రజలకు చెబుతున్నది చైనా రాయబారేనని రాహుల్ పేర్కొన్నారు. విదేశాంగ విధానం గురించి మాట్లాడుతూ... ఒక వైపు, 'మీరు చైనాకు మన భూమిలో 4,000 చదరపు కిలోమీటర్లు ఇచ్చారు... మరోవైపు మన మిత్రదేశమైన అమెరికా అకస్మాత్తుగా మనపై సుంకాలు విధించాలని నిర్ణయించింది' అంటూ ఎద్దేవా చేశారు. అమెరికా విధించిన సుంకాలు భారత ఆర్థిక వ్యవస్థను, ముఖ్యంగా ఆటో పరిశ్రమ, ఔషధాలు, వ్యవసాయం వంటి రంగాలను పూర్తిగా నాశనం చేయబోతున్నాయని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. 'మన భూమి గురించి, మన మిత్రదేశం మనపై విధించిన ఈ సుంకాల గురించి కేంద్ర ప్రభుత్వం సమాధానాలు ఇవ్వాలి' అని ఆయన డిమాండ్ చేశారు. కాగా రాహుల్ వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ స్పందిస్తూ... ఎవరి హయాంలో చైనా ఈ ప్రాంతాన్ని అధీనంలోకి తీసుకుందో అందరికీ తెలుసన్నారు. డోక్లాపై ప్రతిష్టంభన జరుగుతున్న సమయంలో బీజింగ్ అధికారులతో కలిసి సూప్ ఎవరు తాగారో తెలుసని రాహుల్‌పై విమర్శలు చేశారు. ఇలాంటి అంశంపై రాజకీయాలు చేయడం వల్ల ఏ ఫలితం ఉండదన్నారు. గతంలో జరిగిన తప్పిదాలకు కాంగ్రెస్సే సమాధానం చెప్పాలన్నారు. వివిధ దేశాలపై సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్... అమెరికా ఉత్పత్తులపై ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌లతో పోలిస్తే... తాము సగం మేర మాత్రమే వసూలు చేయనున్నట్లు తెలిపారు. భారత్ తమకు వాణిజ్య భాగస్వామి అని చెబుతూనే... ట్రంప్ సుంకాల బాంబు వేశారు. భారత్ తమ ఉత్పత్తులపై సగటున 52% సుంకం విధిస్తున్నందున, తాము 27% సుంకం విధిస్తున్నట్లు పేర్కొన్నారు.

వక్ఫ్ బిల్లు తక్షణమే వెనక్కి

- తమిళనాడు అధికార-ప్రతిపక్షాల డిమాండ్
- సుప్రీంకు వెళతాం: స్టాలిన్
- సీఎంకు సంపూర్ణ మద్దతిస్తాం: అన్నాడీఎంకే



చెన్నై: వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లుకు లోక్‌సభ ఆమోదించడాన్ని తమిళనాడులోని అధికార-ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయి. దీనిపై సుప్రీంకు వెళతామని డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ప్రకటించగా, ప్రతిపక్ష అన్నాడీఎంకే సంపూర్ణ మద్దతు తెలిపింది. ముస్లింలకు అన్యాయం జరగనివ్వమని, వక్ఫ్ బోర్డు స్వయంప్రతిపత్తిని హరించేందుకు తీసుకొచ్చిన ఈ బిల్లును అడ్డుకుంటామని రెండు పార్టీలు ప్రకటించాయి. ఇదిలావుంటే, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం నల్ల బ్యాడ్జి ధరించి అసెంబ్లీకి హాజరయ్యారు. వక్ఫ్ బిల్లును లోక్‌సభ ఆమోదించడాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని డీఎంకే ప్రకటించారు. డీఎంకే ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలకు సంపూర్ణ మద్దతిస్తామని అన్నాడీఎంకే సంఘీభావం తెలిపింది. బీజేపీ సభ్యులు మాత్రం అసెంబ్లీలో ఆందోళనకు దిగారు, ఆపై వాకౌట్ చేశారు. స్టాలిన్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించడాన్ని నిరసించారు. ప్రతిపక్షంలోని ప్రధాన పార్టీలన్నీ ముక్తకంఠంతో ఈ బిల్లును వ్యతిరేకిస్తుంటే కొందరు మిత్రుల సహాయంతో అర్ధరాత్రి 2 గంటలకు వక్ఫ్ సవరణ బిల్లును మోదీ ప్రభుత్వం ఆమోదింపజేయించడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఇది రాజ్యాంగ వ్యవస్థపై ప్రత్యక్ష దాడి అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కేంద్ర ప్రభుత్వ చర్య మత సామరస్యానికి భంగం కలిగించేలా ఉంది. ఈ విషయాన్ని ప్రముఖంగా తెలియజెప్పడం కోసమే నల్ల బ్యాడీలతో అసెంబ్లీకి వచ్చాం. చట్ట సవరణను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును డీఎంకే ఆశ్రయించనున్నది. వక్ఫ్ బోర్డు స్వయంప్రతిపత్తిని నాశనం చేస్తూ... మైనారిటీ ముస్లింలను బెదిరించే చట్టానికి వ్యతిరేకంగా తమిళనాడు పోరాడుతుంది' అని స్టాలిన్ ఉద్ఘాటించారు. అధికార పక్ష సభ్యులంతా బల్లలు చరుస్తూ సీఎంకు మద్దతిచ్చారు. మార్చి 27న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ తీర్మానించడాన్ని స్టాలిన్ గుర్తుచేశారు. లోక్‌సభలో 232 మంది ఎంపీలు వ్యతిరేకంగా ఓటు వేయడం మామూలు విషయం కాదని, 288 మంది మద్దతుతో వక్ఫ్ బిల్లును ఆమోదించారని స్టాలిన్ అన్నారు. వక్ఫ్ బిల్లుకు తమ పార్టీ వ్యతిరేకమని, దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తోందని అన్నాడీఎంకే సభ్యుడు, మాజీ మంత్రి ఎస్‌పీ వెలుమణి తెలిపారు. ఈ బిల్లుకు సంబంధించి స్టాలిన్ ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు. ప్రస్తుత రూపంలో ఈ బిల్లును ఆమోదించలేమని, మైనారిటీలతో సంప్రదింపులు జరిపి దీనిని తగిన విధంగా మార్చడం సముచితమని కేంద్రానికి సూచించారు. ఇదిలావుంటే, బీజేపీ సభ్యులు కేంద్రానికి మద్దతు ప్రకటించారు. లోక్‌సభలో సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే ఈ బిల్లును ఆమోదించారన్నారు. సాధారణంగా అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేస్తారు కానీ ఇక్కడ భిన్న పరిస్థితి నెలకొన్నదని, నల్ల బ్యాడ్జీలతో సీఎం సభకు హాజరయ్యారని దుయ్యబట్టారు. స్టాలిన్ ప్రకటనను నిరసిస్తూ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు.

విమానం అత్యవసర ల్యాండింగ్

టర్కీలో చిక్కుకున్న 200 మంది భారతీయులు

న్యూఢిల్లీ: లండన్ నుంచి ముంబైకి రావాల్సిన విమానం టర్కీలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. దీంతో అక్కడి మారుమూల విమానాశ్రయంలో బుధవారం రాత్రి నుంచి 200 మంది భారత ప్రయాణికులు చిక్కుకుపోయారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం లండన్ నుంచి వర్జిన్ అట్లాంటిక్ విమానం ముంబై బయలుదేరింది. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా టర్కీలోని మారుమూల ప్రాంతంలోని దియార్‌బకిర్ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. విమానం ల్యాండ్ అయ్యే సమయంలో సాంకేతిక సమస్య తలెత్తిందని ప్రయాణికులు చెప్పారు. దాంతో దాదాపు 20 గంటలుగా ప్రయాణికులు అక్కడే చిక్కుకుపోయారు. వారిలో 200 మందికిపైగా భారతీయులున్నారని మీడియా కథనాలు తెలిపాయి. తిరిగి వారు ఎప్పుడు గమ్యస్థానం చేరతారనే దానిపై స్పష్టత లేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల గురించి విమానయాన సంస్థ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. ప్రస్తుతం ఎదురైన సమస్యను పరిష్కరించేందుకు కావాల్సిన సౌకర్యాలు ఆ విమానాశ్రయంలో లేవని ఓ ప్రయాణికుడు వెల్లడించారు. సాధ్యమైనంత త్వరగా రవాణా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. తమకు విమానాశ్రయంలో తగిన సౌకర్యాలు లేవని, అది మిలిటరీ బేస్ కావడంతో అక్కడి నుంచి బయటకు వెళ్లడానికి కూడా లేదని తెలిపారు.

యుద్ధ విమానం కూలి పైలట్ మృతి

అహ్మదాబాద్: భారత వాయుసేనకు చెందిన ఫైటర్‌జెట్ విమానం గుజరాత్‌లోని జామ్‌నగర్‌కు 12 కిలోమీటర్ల దూరంలో సువర్దా గ్రామంలో కూలిపోయింది. ఈ దుర్ఘటనలో ఓ పైలట్ మృతి చెందగా... మరొకరు గాయపడ్డారు. ప్రమాదఘటనను భారత వైమానికదళం ధృవీకరించింది. జామ్‌నగర్ ఎయిర్‌ఫీల్డ్ నుంచి ఎగురుతున్న ఐఏఎఫ్ జాగ్వార్ రెండు సీట్ల విమానం రాత్రి మిషన్ సమయంలో కూలిపోయిందని పేర్కొంది. పైలట్లు విమానంలో సాంకేతిక లోపాన్ని గమనించిన వెంటనే ఎయిర్‌ఫీల్డ్, స్థానికులకు ఎలాంటి నష్టం జరుకుండా విమానం నుంచి బయటపడేందుకు ప్రయత్నించారని పేర్కొంది. ఈ క్రమంలో దురదృష్టవశాత్తు ఓ పైలట్ తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడని పేర్కొంది. మరో పైలట్ జామ్‌నగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపింది. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొంది. ప్రమాదంపై విచారణకు ఆదేశించింది.

ఓలా, ఉబర్, ర్యాపిడో సేవలపై హైకోర్టు నిషేధం

బెంగళూరు: ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి యాప్ ఆధారిత బైక్ టాక్సీ సేవలను నిలిపివేయాలని కర్నాటక హైకోర్టు ఆదేశించింది. రాబోయే ఆరు వారాల్లో రైడ్ హెయిలింగ్ ప్లాట్‌ఫామ్‌లు తమ కార్యకలాపాలను నిలిపివేయాలని వెల్లడించింది. అయితే బైక్ ట్యాక్సీ సేవలను 1988 మోటార్ వెహికల్స్ యాక్ట్ కిందకు చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వానికి మూడు నెలల సమయం ఇచ్చింది. రైడ్-హెయిలింగ్ సేవల ఆపరేటర్లు... ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించకపోవడం మాత్రమే కాకుండా, మోటార్ వాహన చట్టాలను కూడా ఉల్లంఘించారు. కొందరు బైక్ ట్యాక్సీ డ్రైవర్లు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడంపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని కోర్టు ఈ ఆదేశాలను జారీ చేసింది. మోటార్ వాహన చట్టం 1988లోని సెక్షన్ 93ని అనుసరించి కొత్త నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసేవరకూ ఈ నిషేధం అమలులో ఉంటుంది. అప్పటి వరకు ఓలా, ఉబర్, ర్యాపిడో బైక్ సర్వీసులు రోడ్డుపై తిరగడానికి అనుమతి లేదు. వైట్ నెంబర్ ప్లేట్ కలిగిన టూ వీలర్స్ కమర్షియల్ వినియోగానికి అనుమతి లేదు.చట్ట విరుద్ధం. అయితే దీనికి సరైన చట్టబద్ధత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ద్విచక్ర వాహనాలను రవాణా వాహనాలుగా గుర్తించడానికి కావాల్సిన అనుమతులను ఇచ్చేలా తాము రవాణా శాఖను ఆదేశించలేము. దీనికి సరైన చట్టం అవసరం అని జస్టిస్ బీఎం శ్యామ్ ప్రసాద్ వెల్లడించారు. ఇక ఓలా, ఉబర్, ర్యాపిడో సేవలు నిలిపివేయడంతో నగరవాసులు ఇబ్బందులుపడే అవకాశం ఉంది.

వక్ఫ్ భూములపై కేంద్రం కన్ను

తదుపరి లక్ష్యం ఆలయ భూములే: ఉద్ధవ్

ముంబై: వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదించడంపై పెద్ద చర్చ జరుగుతోంది. తామంతా వ్యతిరేకించినప్పటికీ ఈ బిల్లును మోదీ ప్రభుత్వం ఆమోదింపజేయించడాన్ని ప్రధాన ప్రతిపక్షాలు ఖండించాయి. ఇదే క్రమంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మోదీ ప్రభుత్వ తీరును శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే తీవ్రంగా ఆక్షేపించారు. వక్ఫ్ భూములను కబ్జా చేసుకొని తమ పారిశ్రామిక మిత్రులకు దారాదత్తం చేయడం కోసమే ఈ బిల్లును తెచ్చారని విమర్శించారు. వక్ఫ్ భూములపై కేంద్రం కన్నేసిందని, దాని తదుపరి లక్ష్యం ఆలయాలు, చర్చీలు, గురుద్వాల భూములని దుయ్యబట్టారు. ముస్లింల విషయంలో బీజేపీ నటించిన అభిమానం చూస్తే పాకిస్థాన్ వ్యవస్థాపకుడు జిన్నా కూడా సిగ్గుతో తలవంచుకుంటారేమో అంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ మోసపూరిత వైఖరిని తమ పార్టీ వ్యతిరేకిస్తోందని ఉద్ధవ్ అన్నారు. హిందూత్వ, బాల్ ఠాక్రే సిద్ధాంతాలను విడనాడి వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తున్నారంటూ శివసేన, బీజేపీ విమర్శించడాన్ని ఉద్ధవ్ ఖండించారు. 'మీరు వక్ఫ్ భూములపై కన్నేశారు. ఆలయ ట్రస్టులు, చర్చీలు, గురుద్వారాలకూ భూములున్నాయి. మీ తదుపరి లక్ష్యం అవే కావచ్చు. వివాదాస్పద బిల్లును కేవలం భూములను స్వాహా చేసేందుకే తెచ్చారు. దీనిని మేము వ్యతిరేకిస్తున్నాం' అని ఉద్ధవ్ అన్నారు. వక్ఫ్ బిల్లును ముస్లింల ప్రయోజనార్థం తెచ్చినట్లయితే... హిందూత్వను ఎవరు విడనాడినట్టు! ఈ బిల్లు వల్ల హిందువులకు కలిగే ప్రయోజనం ఏమిటో! అంటూ బీజేపీ, శివసేననుద్దేశించి అన్నారు. ప్రతికూల రాజకీయాలకు తమ పార్టీ మద్దతివ్వబోదని ఉద్ధవ్ స్పష్టంచేశారు. బాల ఠాక్రే సిద్ధాంతాల గురించి ఉద్బోధించే స్థాయి మీకు లేదంటూ సీఎం ఫడ్నవీస్‌నుద్దేశించి అన్నారు. కాంగ్రెస్ ఒత్తిడి వల్లే వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు తమ పార్టీపై వచ్చిన విమర్శలనూ ఉద్ధవ్ ఖండించారు. తమపై ఎవరి ఒత్తిడి లేదని, ప్రతికూల రాజకీయాలకు తాము మద్దతివ్వబోమని, పారదర్శకతనే కోరుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

థాయ్ ప్రజల జీవితాల్లో రామాయణ గాథలు భాగం: మోదీ

న్యూఢిల్లీ: థాయ్ ప్రజల జీవితాల్లో రామాయణ ఇతిహాస గాథలు భాగమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. బిమ్స్‌టెక్ సదస్సులో భాగంగా నరేంద్రమోదీ థాయ్‌లాండ్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని పేటోంగ్‌టార్న్ షినవత్రాతో గురువారం భేటీ అయ్యారు. దక్షిణాసియా, ఆగ్నేయాసియా ప్రాంతాలకు చెందిన 7 దేశాల సమాగమం అయిన బంగాళాఖాత ప్రాంత బహుళ రంగ, సాంకేతిక, ఆర్థిక సహకార (బిమ్‌స్టెక్) సదస్సు కోసం మోదీ థాయ్‌లాండ్ వెళ్లారు. ప్రధానుల భేటీ అనంతరం మోదీ మాట్లాడుతూ 'భారత్- థాయిలాండ్ మధ్య శతాబ్దాలుగా సంబంధాలు కొనసాగుతున్నాయి. సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలతో బలమైన బంధం ఏర్పడింది. బౌద్ధమతం వ్యాప్తి మన ప్రజలను అనుసంధానించింది. అయుతయ నుంచి నలంద వరకు మేధావులు రాకపోకలు సాగించారు. రామాయణ గాథలు థాయ్ ప్రజల జీవితాల్లో భాగమయ్యాయి. సంస్కృతం, పాళీ భాషల ప్రభావం నేటికీ ఇద్దరి సంప్రదాయాల్లో ప్రతిబింబిస్తుంది. నా పర్యటన సందర్భంగా 18వ శతాబ్దపు రామాయణ కుడ్య చిత్రాల ఆధారంగా ఒక స్మారక స్టాంపును విడుదల చేసిన థాయ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని హర్షం వ్యక్తంచేశారు. భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీ, ఇండో-పసిఫిక్ విజన్‌లో థాయ్‌లాండ్‌ది కీలక పాత్ర అని మోదీ అన్నారు. తమ రెండు దేశాలు అభివృద్ధి వాదాన్ని సమర్థిస్తాయని, విస్తరణ వాదాన్ని కాదని వ్యాఖ్యానించారు. ప్రస్తుత సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఇటీవల సంభవించిన భూకంపంలో మృతి చెందిన వారికి భారత్ తరపున సంతాపం తెలియజేశారు.

అన్నాడీఎంకేతో కూటమి వద్దు... అన్నామలై కావాలి

రామనాథపురంలో పోస్టర్లు

చెన్నై: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నామలై కావాలి... అన్నాడీఎంకేతో కూటమి వద్దంటూ రామనాథపురంలో అంటించిన పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్నాడీఎంకే-బీజేపీ కూటమిపై ఢిల్లీస్థాయిలో మంతనాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైను ఈ పదవి నుంచి తప్పించాలని అధిష్టానం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో, బీజేపీ రామనాథపురం జిల్లా కార్యదర్శి, మేల్‌కొడుమలూరు పంచాయతి యూనియన్ అధ్యక్షుడు సెయ్యామంగళం కె.శరవణన్ పేరుతో పరమకుడిలో వెలిసిన వాల్‌పోస్టర్లలో... 'వేండుమ్...వేండుమ్... రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నామలై వేండుమ్... వేండామ్... వేండామ్, అన్నాడీఎంకేతో కూటని వేండామ్.... అంటూ ముద్రించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి

మాండ్య: కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బెంగళూరు-మైసూర్ ఎక్స్‌ప్రెస్‌వేలో మాండ్య జిల్లా ప్రాంతానికి సమీపంలో కారును బస్సు ఢీకొట్టింది. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా... ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని మాండ్య జిల్లా ఎస్పీ మల్లికార్జున్ బల్దండి తెలిపారు. ఈ ఘటనపై ఎస్పీ మాట్లాడుతూ పిరియాపట్టణానికి వెళుతుండగా ఎక్స్‌ప్రెస్‌వే టోల్‌ను తప్పించడానికి తుబినకెరె ఎగ్జిట్ సమీపంలో డ్రైవర్ కారు వేగాన్ని తగ్గించడంతో... వెనుక ఉన్న బస్సు దాన్ని ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనపై మాండ్య రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

మీర్జాలగూడలో ముంచెత్తిన వర్షం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి సర్కిల్ గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మీర్జలగూడ చిన్మయ స్కూల్ రోడ్డు ప్రాంతంలోని గురువారం కురిసిన వర్షానికి కాలనీల్లో పెద్ద ఎత్తున నీటి వరద పొతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. ఇటీవల ఈ రోడ్డు తవ్వి వదిలివేయడంతో ఎక్కడ ఏ గుంత ఉందో తెలియని పరిస్థితి నెకొంది. చిన్నపాటి వర్షానికి ఈ ప్రాంతం అంతా కూడ జలమయమవ్వడం సాదారణంగా మారుతోంది. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించడంలో పూర్తిగా విఫలమవుతున్న పరిస్థితి నెలకొంది. 10, 15 ఫీట్ల రోడ్లు ఉండడంతో కూడ ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. బాక్స్ డ్రైన్‌లు రోడ్డు సమాంతరంగా నిర్మించకుండా కాంపౌండ్ వాల్ కట్టినట్లు కట్టడంతో వర్షానికి నీరు నిలుస్తుండడమే కాక ఇండ్లలోకి నీరు చేరుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి డివిజన్, చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం. గడ్డం వినోద్ కుమార్ రూ.55 వేలు చిన్న రెడ్డి రూ. 60 వేలు, సాయి కుమార్ రూ.31,500, కళ్యాణ్ చక్రవర్తి రూ.32,500, మొత్తం రూ.1,79,000 చెక్కులు మంజూరు కాగా గురువారం శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి బోయిన్ పల్లి క్యాంప్ కార్యాలయంలో బాధితులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీ.ఎం సంక్షేమ సహాయనిది పేదలు అనారోగ్యానికి గురైన సమయంలో వారికి ఆపన్న హస్తంలా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, జేఏసి వెంకన్న, శ్రీనివాస్ గౌడ్, గంగాధర్ కృష్ణ, శ్రీనివాస్, గణేష్, జనార్ధన్, సూరి తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతులు, పాలకుల అణిచివేత కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు కాకుండా దేశ వ్యాప్తంగా పీడిత ప్రజల పక్షాన నిలబడి జీవితాంతం పోరాటం నిర్వహించిన మహా వ్యక్తి గద్దరని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గురవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్య దర్శి మారుపాక అనిల్ కుమార్, తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, గద్దర్ కుమారుడు సూర్యం తో కలిసి గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న నిర్వహించే ప్రశ్నించే గొంతు లు పాలకుల అణిచివేత కార్యక్రమ పోస్టర్‌ను సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ గద్దర్ పలువురికి స్ఫూర్తి అని, ఆయన ఆశయ సాధన కోసం పోరాడుతామని అన్నారు. గద్దర్ ఆశయ సాధన కోసం వారి కుటుంబం మొత్తం పని చేస్తుంది అని సత్యం తెలిపారు.

సెక్యూరిటీ రాములు నాయక్ కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న రాములు నాయక్ తీవ్రమైన అనారోగ్యం తో గత నెల అకాల మరణం చెందారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కాంట్రాక్టు కార్మికులు మానవత దృక్పథంతో తలా కొంత జమ చేసి గురువారం మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఛాంబర్‌లో సూపరింటెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ చేతుల మీదుగా పదివేల నగదును మృతుడు సెక్యూరిటీ రాముల నాయక్ సతీమణి పారిశుద్ధ్య కార్మికురాలు సుశీలకు అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో పనిచేస్తున్న తోటి కార్మికుడు అకాలంగా మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆలోచనతో ఉద్యోగులు కార్మికులు తోచిన సహాయం అందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవడం గొప్ప విషయమని సహకారం అందించిన వారందరిని అభినందించారు. విధుల్లో వైద్య సిబ్బంది కార్మికులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, సిహెచ్ ఓ రాములు నాయక్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, బ్రాంచ్ నేత వెంకటేష్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్, ఔట్సోర్సింగ్ బ్రాంచ్ అధ్యక్షులు గోపాల్ నాయక్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు చెన్నయ్య, డెవలప్మెంట్ కమిటీ సభ్యులు రాఘవేంద్ర శెట్టి, యూనియన్ నాయకులు దేవానంద్, రంగయ్య, యాదయ్య, నైసస్, అంజిలయ్య పాల్గొన్నారు.

అకాల వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగరంలో కురుస్తున్న అకాల వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. నగరంలో గురువారం సాయంత్రం నుండి కురిసిన వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గురువారం సాయంత్రం అధిక వర్షపాతం నేపథ్యంలో మేయర్ జోనల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులను అప్రమత్తం చేసారు. ఇంజనీరింగ్, ఐ.ఆర్.టీ.వాహనాలు అలర్ట్ చేసి, వాటిని రంగంలోకి దింపినట్లు తెలిపారు. కూలిన చెట్లను ఈ.వి.డి.ఎం. బృందాలు తొలగిస్తున్నాయన్నారు. శేరిలింగంపల్లి జోన్‌లో రైల్వే అండర్ బ్రిడ్జి వలన ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్న నేపథ్యంలో అక్కడ ప్రజలు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ అధికారులను ఆదేశించారు. కూకట్‌పల్లి జోన్‌లో కూడా పలు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని మేయర్ జోనల్ కమిషనర్‌ను ఆదేశించగా వెంటనే సంబంధిత శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు మేయర్‌కు వివరించారు. ఎల్‌బి నగర్ జోన్‌లో కూడా పిల్లలు వరదలో చిక్కుకుపోయినట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వెంటనే పిల్లలను కాపాడాలని మేయర్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసర మైతేనే బయటికి రావాలని, రోడ్డుపై నిలిచిన నీటిలో చిన్న పిల్లలు, వృద్ధులు వెళ్లకూడదని, మ్యాన్ హోల్స్ తెరవ వద్దని మేయర్ ప్రజలను కోరారు. అత్యవసరమైతే జిహెచ్ఎంసి కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు. ప్రస్తుతం నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించడానికి ఇదే సరైన సమయం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో అక్కడే నీటి సంరక్షణ గుంటలను ఏర్పాటు చేయాలని మేయర్ సూచించారు.

ఖైరతాబాద్ జోన్: అన్ని నీరు నిలిచే ప్రాంతాలను వీడియో రికార్డ్ చేస్తున్నట్లు జోనల్ కమిషనర్ తెలిపారు. ఇదే సూచనను మిగతా జోన్లకు మేయర్ అందజేశారు.

కుకట్ పల్లి జోన్: రైల్వేలకు సంబంధించిన కొన్ని ప్రాంతాల్లో నీటి నిలువ సమస్యలున్నాయని, అయితే రైల్వే అధికారులతో సమన్వయం చేసి సమస్యను పరిష్కరించామని జోనల్ కమిషనర్ పేర్కొన్నారు.

చార్మినార్ జోన్: మలక్‌పేట్ వద్ద కొంత నీరు నిలిచినప్పటికీ, ప్రస్తుతం ట్రాఫిక్ సాధారణ స్థితికి వస్తోందని తెలిపారు.

ఎల్బీనగర్ జోన్: చంపాపేట్, సరూర్ నగర్ వద్ద సహజసిద్ధమైన భూస్థితి వల్ల కొంత నీటి నిల్వ ఏర్పడిందని, అయితే కొద్దిసేపటి తరువాత అది తగ్గిపోతుందని వివరించారు.

రక్షణ చర్యలు: మూసీ నది వద్ద ముగ్గురు వ్యక్తులు చిక్కుకుపోవడంతో, డి.ఆర్.ఎఫ్. బృందం రక్షణ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి, త్వరలో పూర్తి స్థాయిలో పరిష్కారం అందించ బడుతుందని అధికారులు తెలిపారు.

హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాలపై

జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉపరితల ఆవర్తన ప్రభావంతో హైదరాబాద్‌లో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. జీహెచ్ ఎంసీ పరిధిలోని ఆరు జోనలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎర్రమంజిల్ ప్రాంతంలో చెట్టు కూలడంతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ ఐఆర్టి టీమ్స్ వాటిని క్లియర్ చేస్తుందని పేర్కొన్నారు. సెక్రటేరియట్, రాజ్‌భవన్ రోడ్, మసబ్ ట్యాంక్ పరిసర ప్రాంతాలతో పాటు వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు వెంటనే నీటిని తొలగించాలని ఆదేశించారు. అరగంట లోపు వాటర్ క్లియర్ చేస్తామని అధికారులు తెలిపారు. డ్రైనేజీ పొంగిపొర్లకుండా హెచ్ఎండబ్ల్యూఎస్ ఎస్‌బి జెట్టింగ్ మిషన్స్ ద్వారా అరికడుతున్నాయి. పోలీస్, జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్ అధికారులు వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

పదేళ్లు భూములను దోచుకున్న ఘనత బీఆర్ఎస్‌దే

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : గడిచిన పదేళ్ళ పాటు అధికారంలో వున్న బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో వున్న బంగారం లాంటి భూములను దోచుకున్న ఘనత వారికే దక్కుతుందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఆర్థిక విధ్వంసం భూముల విధ్వంసం చేసి హైదరాబాద్ చుట్టుపక్కల వున్న ప్రభుత్వ భూములను మొత్తం కూడా వారి అనునయ సంస్థలకు కారుచౌకగా కేటీఆర్ కట్టబెట్టారని అయన ఆరోపించారు. గురువారం డిల్లీలో అయన విలేఖరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం పై మేము చర్చకు సిద్దంగా వున్నామని మరి బీఆర్ఎస్ పార్టీ పెద్దలు సిద్ధమా అని ప్రశ్నించారు. ఆర్థిక విధ్వంసం భూముల విధ్వంసం చేసిన బిఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి నెలకొందని అన్నారు. తెలంగాణలో మళ్ళీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ పగటి కలలు కంటున్నారని, వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో బిఆర్ఎస్ పార్టీ ఉండదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అడుగడుగున బిజెపి బిఆర్ఎస్ నేతలు అడ్డుపడుతూ ప్రభుత్వాని ఇరాకాటంలో పెట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. తాజాగా హెచ్‌సియూ భూముల విషయంలో కూడా వారు ఇలాంటి పద్దతినే కొనసాగిస్తున్నారని, వాస్తవానికి హెచ్‌సియూ భూములు ప్రభుత్వానికి చెందినవిగా అయన పేర్కొన్నారు. అప్పట్లో ఐఎంజి భారత్ సంస్థకు చంద్రబాబు భూములు కట్టబెడితే కోర్టులో కొట్లాడి ప్రభుత్వానికి చెందేలా అప్పటి సీఎం.రాజ శేఖర్ రెడ్డి కృషి చేశారన్నారు. హెచ్‌సియూ భూములపై ప్రతిపక్షాలు దురుద్దేశంతో అసత్య ప్రచారాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో బేషజాలు లేకుండా ఓ మెట్టు దిగడానికి సిద్దంగా వున్నామని, 42 శాత రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం ప్రధాన మంత్రి అపాయింట్మెంట్ తీసుకోవాలని తెలంగాణ బిజెపి నేతలను డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్ల కోసం ఎక్కడికైనా రావడానికి సీఎం రేవంత్‌తో పాటు క్యాబినెట్ మంత్రులు సిద్దంగా ఉన్నారన్నారు. కుల మతం పేరిట రాజకీయం చేయడం బీజేపీకి పరిపాటిగా మారిందన్నారు. తెలంగాణ ముస్లింలకు అన్యాయం చేయాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ధ్వజమెత్తారు. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా ముస్లింలకు ఒబిసి రిజర్వేషన్ వర్తిస్తోందని, తమిళనాడు తరహాలో 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 42శాతం రిజర్వేషన్ అంశాన్ని 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కేబినెట్ విస్తరణ పై అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని కసరత్తు చేస్తున్నామని, కేబినెట్ విస్తరణలో మరో ఇద్దరు బీసీలకు మంత్రి పదవులు ఇవ్వాలని టీపిసిసి అధ్యక్షుడిగా విజ్ఞప్తి చేస్తున్నానని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని, తెలంగాణలో కుల సర్వేకు ఆద్యుడు రాహుల్ గాంధీనే అంటూ చెపుకొచ్చారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు సీఎం రేవంత్ మంత్రుల బృందం కుల సర్వేను నిర్వహించిందని, బీసీ సంఘాల ధర్నా విజయవంతం కావడంపై రాహుల్ గాంధీ ప్రశంసించారన్నారు.

లబ్ధిదారులు సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - మేడ్చల్-మల్కాజిగిరి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్నబియ్యం పంపిణి పథకాన్ని లబ్దిదారులందరు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు తెలిపారు. గురువారం శామీర్‌పేట మండల పరిధిలో గల రేషన్ దుకాణం (షాప్ నెంబర్ 3312025)లో సన్న బియ్యం పంపిణీ ప్రక్రియను ఇంచార్జీ సివిల్ సప్లయ్ అధికారి (డీఎస్ఓ) సుగుణబాయ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. శామీర్‌పేట రేషన్ షాప్ పరిధిలో ఎంత మంది లబ్దిదారులున్నారు. రేషన్ సరుకులు సరఫరా ఎంత అవుతున్నాయి, క్రమం తప్పకుండా నెలవారిగా ఎంత మంది లబ్దిదారులు రేషన్ సరుకులు తీసుకుంటున్నారు, సరుకుల వివరాలను సంబంధిత రిజిష్టర్లలో నమోదు చేస్తున్నారా లేదా అని క్షుణ్ణంగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే బియ్యం పంపిణీ నిర్వహిస్తున్న ఫింగర్ ప్రింట్ స్కానర్‌ను, స్కానర్ రశీదులను, తూకాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రేషన్‌కార్డు కలిగిన ప్రతి లబ్దిదారుడికి సన్న బియ్యాన్ని అందించాలన్న సంకల్పంతో చారిత్రాత్మక పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి రేషన్ కార్డుదారు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని సద్వినియోగం చేసుకోని లబ్దిపొందాలని సూచించారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండగా కార్డుదారులు రేషన్ దుకాణాల వద్దకు వచ్చి తీసువెళ్లాలన్నారు. ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సన్నబియ్యం పంపిణీలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని డీలర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూడి తహాశీల్దార్లు సంయుక్త, స్మృతి, సంబంధిత అధికారులు, డీలర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెక్రటేరియట్ ముట్టడికి విద్యార్థుల యత్నం

విద్యార్థి నేతల అరెస్ట్ - ఉద్రిక్తత

విశాలాంధ్ర - హైదరాబాద్ : హెచ్‌సియూ భూములను కాపాడేందుకు శాతియుతంగా విద్యార్థులు అందోళన చేస్తుంటే వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. హెచ్‌సియూ పరిధిలోని 400ఎకరాల భూమిని ప్రభుత్వం వేలం వేయకూడదని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు నిర్వహించిన చలో సెక్రటేరియట్ కార్యక్రమంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వేలం ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరుతూ విద్యార్థులు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించడంతో పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య తొపులాట చోటుచేసుకవడంతో విద్యార్థులు ప్రభుత్వంకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. వెంటనే 400 ఎకరాల భూమిని యూనివర్సిటీకి రిజిస్టర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సెక్రటేరియట్ వైపుకు దూసుకెళ్ళేందుకు విద్యార్థి సంఘాల నాయకులు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి రాథోడ్ ఆకాష్ నాయక్ సహా పలువురు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసి, బేగం బజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ తీరును ఖండిస్తూ, ప్రజల ఆస్తిని వేలం వేయడం అన్యాయమని ఆరోపించారు.ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే 400 ఎకరాల భూమిని హెచ్‌సీయూకు రిజిస్టర్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఉస్మానియా యూనివర్సిటీ విడుదల చేసిన అప్రజాస్వామిక సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలీసుల లాఠీచార్జిపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. "మహిళలను కూడా చూడకుండా లాఠీచార్జి చేయడం సిగ్గుచేటు," అని వ్యాఖ్యానించారు. ఈ ఘటనలో కొంతమంది విద్యార్థులు స్పృహ తప్పి పడిపోయారని సమాచారం. ఈ ఆందోళనలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి కుమార్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీ వర్ధన్ రెడ్డి, జిల్లా గర్ల్స్ కన్వీనర్ శ్రావణి, ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్ గౌడ్, చింత వెంకటేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య, నల్గొండ జిల్లా కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

హామీలు నెరవేర్చే వరకు పోరాటం ఆగదు

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేషనల్ హెల్త్ మిషన్ నందు పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం ఆగబోదని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ వెల్లడించారు. రెండవ ఏఎన్ఎంలకు ఏఐటియుసి ఆధ్వర్యంలో చేసిన సమ్మె సమయంలో ఆ తరువాత జరిగిన పోరాటాల సమయంలో వయసు రీత్యా పరీక్షకు అర్హత లేని వారిని 100% గ్రాస్ శాలరీ తోపాటు 7 నెలల పిఆర్సి వేతన బకాయిలు, 10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, 10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్, సబ్ సెంటర్ అద్దెపకాయలు, ఏవిడి వ్యాక్సిన్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. ఫిబ్రవరి 17వ తారీఖు నాడు జరిగిన చర్చల్లో భాగంగా మార్చి 31వ తేదీ లోపు ఏడు నెలల పిఆర్సి ఏరియాస్ చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. 2020లో పిఆర్సి ప్రకటన చేస్తే 11 జూన్ 2021న పిఆర్‌సి అమల్లోకి వచ్చింది అన్నారు. పిఆర్సి అమల్లోకి వచ్చిన ఏడు నెలల తర్వాత జీతాలు పెరిగాయని ఆయన గుర్తు చేశారు. ఆ తర్వాత ఏఐటియుసి ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలలో పిఆర్సి బకాయిలను చెల్లిస్తామని చాలాసార్లు హామీ ఇచ్చి నెరవేర్చ లేదన్నారు. వీరితో పాటే పని చేస్తున్న ఈసీ ఏఎన్ఎం లకు 2023 వ సంవత్సరంలోనే పిఆర్సి బకాయిలు చెల్లించారని కానీ రెండవ ఏఎన్ఎం లకు ఇంతవరకు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ఎమ్మెస్సార్బి వారు విడుదల చేసిన నోటిఫికేషన్ 2/2023 పరీక్ష ఫలితాలను కూడా వెంటనే విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వంలో 2018 వ సంవత్సరంలో వెలువడిన నోటిఫికేషన్‌కు 2019వ సంవత్సరంలో పరీక్షలు నిర్వహించగా 2023వ సంవత్సరములో ఫలితాలు వెల్లడించారని ఈ నోటిఫికేషన్ కూడా ఆ విధంగా చేస్తే ఒప్పుకునేది లేదన్నారు. ఏఐటీయూసీ పోరాట ఫలితంగా 52 సంవత్సరాలు దాటిన వారికి కూడా పరీక్ష రాయటానికి అర్హత వచ్చిందని ఇప్పుడు ఫలితాలు వెలువడితే ఐదు ఆరు సంవత్సరాలు పాటు వారు రెగ్యులర్ ఏఎన్ఎంలుగా విధులు నిర్వర్తించే అవకాశం ఉందన్నారు. కానీ ఫలితాలు వెలిగించడానికి ఆలస్యం అయితే తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. కావున అధికారులు సత్వరమే స్పందించి పరీక్ష ఫలితాలను కూడా విడుదల చేయాలన్నారు. ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయులు, సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జక్కుల పద్మ, బోయిని శ్యామల, రాష్ట్ర కార్యదర్శులు తన్వీర్ సుల్తానా, పి.జయమ్మ, ఎస్.సంధ్యారాణి, ఉపాధ్యక్షులు కే.పద్మ, కృష్ణవేణి, పార్వతి, భారతి, కోశాధికారి రాజేశ్వరి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాదాలక్ష్మి, సరస్వతి, రాణి, బాలనాగమ్మ, గిరిజా రెడ్డి, ఆఖేద, సునీత, వినోద, సల్వాది నిర్మల, వనజ, శ్రీలక్ష్మి, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను హరించేలా కొత్త కార్మిక చట్టాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : నిరంకుశ భారత ప్రధానికి నరేంద్ర మోదీ తీసుకువచ్చిన కొత్త కార్మిక చట్టాలు కార్మికుల ప్రాథమిక హక్కులను హరించేవని ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ జి.సంజీవ రెడ్డి తెలిపారు. ఈ కొత్త కార్మిక చట్టాలలో మార్పులు కార్మిక సంఘాల ఉద్యమంపై కొత్త ఒత్తిళ్లను తెస్తున్నాయని, బలమైన పోరాటాలతో ఈ ఒత్తిళ్లను ఎదుర్కోవాలని ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ జి.సంజీవ రెడ్డి కోరారు. హైదరాబాద్, బర్కత్ పుర, జి.సంజీవ రెడ్డి నివాసంలో గురువారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఐ.ఎన్.టి.యు.సి ముఖ్య నాయకుల సమావేశం ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్ర శేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తూర్పు గోదావరి ఐ.ఎన్.టి.యు.సి జిల్లా నూతన అధ్యక్షులుగా వాసంశెట్టి గంగాధర్ ను నియమించి, నియామక పత్రాన్ని జి.సంజీవ రెడ్డి వాసంశెట్టి గంగాధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 4 కోడ్లుగా తీసుకువచ్చిన ఈ నూతన కార్మిక చట్టాలు ఐఎల్ఓ అంతర్జాతీయ కార్మిక ప్రమాణాలను స్పష్టంగా ఉల్లంఘించాయని పేర్కొన్నారు. కార్మికులకు మెరుగైన ఉపాధి, నిజమైన వేతనాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలను కల్పించడంలో యూనియన్లు గణనీయమైన పాత్ర పోషిస్తాయని, కార్మికుల హక్కులను కాపాడేది, వారి శ్రేయస్సును కోరేది దేశవ్యాప్తంగా ఐ.ఎన్.టి.యు.సి ఒకటేనని, దీనిని మరింత బలోపేతానికి కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. జోల్లా తారక రామ రావు అనే వ్యక్తి తూర్పు గోదావరి ఐ.ఎన్.టి.యు.సి జిల్లా అధ్యక్షులుగా నియమితులయ్యానని నకిలీ నియామక పత్రాన్ని సృష్టించి సంఘ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాడని తమ దృష్టికి వచ్చిందని, జోల్లా తారక రామరావు అనే వ్యక్తికి ఐ.ఎన్.టి.యు.సికి సంబంధం లేదని, కార్మికులు ఎవ్వరు అతనిని నమ్మొద్దని, అతనిపై న్యాయ పరమైన చెర్యలు తీసుకుంటామని జి.సంజీవ రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి వై.నాగన్న గౌడ్, నేతలు ఎల్డి. పాల్, కె.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య 98వ జయంతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య చూపిన స్ఫూర్తిని కొనసాగించాలని అని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 98వ జయంతి ఉత్సవంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పాల్గొనీ జ్యోతి ప్రజ్వలన చేసి దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య స్ఫూర్తిని కొనసాగించాలని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తలచుకోగానే మొదటగా గుర్తు వచ్చేది పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య అని, తెలంగాణలో భూస్వామ్యపాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు. దొడ్డి కొమరయ్య జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో 1927 ఏప్రిల్ 3న జన్మించారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభమడానికి భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి ఉద్యమంగా మారడానికి దొడ్డి కొమరయ్య అమరత్వమే ప్రధాన కారణమన్నారు. బిసి సంక్షేమ అధికారి బి.కేశురాం, కలెక్టరేట్ ఏఓ సునీల్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు పి.రమేష్, వై.మాధవ రెడ్డి, కుల సంఘం నేతలు బీసీ ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్ యాదవ్, సి.హెచ్. కొండయ్య, చిత్తరంజన్, కాటపల్లి శ్రీశైలం పొన్నాల సురేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు భూమి కేటాయించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగర్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డయాగ్నొస్టిక్ సెంటర్‌కి భూమి కేటాయించి అధునాతన భవన నిర్మాణానికి చేయూత ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్ర చైర్మన్, కార్యదర్శులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్ సంస్థ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఎన్నో సంవత్సరాలుగా మహబూబ్‌నగర్ ప్రజలకు ఆపత్కాలంలో సేవ అందిస్తూ, తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కువ రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరించి, అవసరమైన వారికి అందజేస్తుందని, మహబూబ్ నగర్ పట్టణంలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డయాగ్నొస్టిక్ సెంటర్ కోసం అధునాతన భవనం అవసరం ఉందని గవర్నర్‌కి ఎమ్మెల్యే వివరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్ సేవలు అమోఘం అని, పేద ప్రజలకు చేస్తున్న సేవలను ఇలాగే కొనసాగించాలని, రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డయాగ్నొస్టిక్ సెంటర్‌కు అధునాతన భవన నిర్మాణానికి అవసరమైన భూమి కేటాయింపు చేయుటకు సహకరిస్తానని ఆయన ఎమ్మెల్యేకి హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డయాగ్నొస్టిక్ సెంటర్ కోసం అధునాతన భవన నిర్మాణానికి అన్ని విధాలా సహకరిస్తామని గవర్నర్ హామీ ఇచ్చారన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ అజయ్ మిత్రా, రాష్ట్ర రెడ్‌క్రాస్ సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ లయన్ నటరాజ్, రాష్ట్ర ఇసి సభ్యులు రమణయ్య ఉన్నారు.

హైదరాబాద్‌లో వివా ఏసీపీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆసియా అతిపెద్ద తయారీదారు మెటల్ కాంపోజిట్ ప్యానెల్స్ (ఎంసిపి) సరఫరాదారు వివా, హైదరాబాద్‌లో తన కొత్త ఎక్స్పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేసింది. బంజారాహి లుంబిని జ్యువెల్ మాల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ అత్యాధునిక సౌకర్య కేంద్రాన్ని వివా కాంపోజిట్ ప్యానెల్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మిస్టర్ ప్రకాష్ జైన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాస్తుశిల్పులు, డిజైనర్లు, తుది వినియోగదారులకు వివా అత్యాధునిక ఉత్పత్తి సమర్పణల లీనమయ్యే అనుభవాన్ని అందించడానికి రూపొందించబడిందన్నారు. దక్షిణ భారతదేశంలో వివా ఉనికిని బలోపేతం చేయడంలో ముఖ్యమైన దశను సూచిస్తుందన్నారు. ఇన్నోవేషన్ వివా తత్వశాస్త్రం ప్రధాన భాగంలో ఉందనీ, డైనమిక్ ఆర్కిటెక్చర్, అభివృద్ధి చెందుతున్న డిజైన్ ల్యాండ్‌స్కేప్‌కు ప్రసిద్ధి చెందిన హైదరాబాద్‌కు తమ పరిధిని విస్తరిస్తున్నామన్నారు. విస్తృత శ్రేణి ఎంసీపీ పరిష్కారాల ద్వారా ప్రీమియం నాణ్యత, మన్నిక సౌందర్య విజ్ఞప్తిని అందించడానికి మేము కట్టుబడి ఉన్నామన్నారు. హైదరాబాద్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ది శాంటా ఫే, టార్నిష్ మెటల్లమ్, నేచురల్ స్టోన్, అలు జింటో, ఎల్ జింక్, లస్టర్, డి మడేరా గెలాక్సీ సిరీస్‌తో సహా వివా అత్యంత కావలసిన సిరీస్‌ను ప్రదర్శిస్తుందని చెప్పారు. వివా డైరెక్టర్లు మిస్టర్ నితిన్ జైన్, మాయక్ జైన్ పాల్గొన్నారు.

అణచివేతలకు పాల్పడుతున్న కాంగ్రెస్

విశాలాంధ్ర - మొయినాబాద్ : ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేతలకు పాల్పడుతోందని ఇదేనా మీరు చెప్పిన ప్రజాపాలన అని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి అనంతరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డిలు ప్రశ్నించారు. గురువారం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని మొయినాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డిల అధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి ప్రతి ఒక్కరూ స్వాగతిస్తారని కానీ అభివృద్ధి పేరుతో విద్యాసంస్థలకు చెందిన 400 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టడం అన్యాయమన్నారు. ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేతలకు పాల్పడుతోందని.. ఇదేనా మీరు చెప్పిన ప్రజాపాలన?.. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ హైదరాబాద్ హెచ్ సీయూలో జరుగుతున్న ఆరాచకం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. విద్యాసంస్థల భూములను కాపాడేందుకు పోరాటం చేస్తున్న విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండిస్తున్నామని పార్టీలకు అతీతంగా 400 ఎకరాల భూమిని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. నాయకులు కొత్త నర్సింహ్మారెడ్డి, ముదిగొండ రవియాదవ్, మోర శ్రీనివాస్, రవూఫ్, జయవంత్, సుధాకర్ యాదవ్, కొత్త మానిక్ రెడ్డి, సురేందర్గౌడ్, షాబాద్ ప్రవీన్, పరమేష్, తిరుపతిరెడ్డి, జల్లెల మల్లేష్ యాదవ్, కుమ్మరి రాము, అంజయ్య గౌడ్ ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో డెలివరీ చేసుకునేలా

గర్భిణీలను చైతన్యపరచాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు చేసుకునేలా గర్భిణీలను ఆశా, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది చైతన్యపర్చాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రోగ్రామ్ అధికారులు, ఎస్‌పిహెచ్ఓలు, వైద్య అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఆ దిశగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలని సూచించారు. ప్రతి పీహెచ్సీల్లో గర్భిణీల రిజిస్ట్రేషన్ సంఖ్య పెరగాలని, ప్రభుత్వ లక్ష్యాలను ఆస్పత్రి వైద్యాధికారులు నిబద్ధతతో బాధ్యతాయుతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీల నమోదు రిజిస్ట్రేషన్, ప్రసవాలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, రాష్ట్రీయ బాల స్వస్తియ కార్యక్రమం, అసంక్రమిత వ్యాధులు, కుష్టు వ్యాధి నివారణ అలాగే క్షయ వ్యాధిపై వైద్య విభాగాల వారీగా సమీక్షించారు. గర్భిణీ స్త్రీల రిజిస్ట్రేషన్‌లో ఆశా, ఏఎన్ఎంల పాత్ర ప్రముఖంగా ఉండాలని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 68 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలో అలాగే 42 శాతం ప్రసవాలు ప్రవేట్ ఆసుపత్రుల్లో జరిగాయని పేర్కొన్నారు. జిల్లాలో బీసీజీ 129శాతం, ఓపివి 120శాతం, హైపర్ టైటిస్ బి 94 శాతం అలాగే పెంటా వాక్సిన్ 129 శాతం చేపట్టడం జరిగిందని అన్నారు. ఇట్టి కార్యక్రమాల నిర్వహణకు వచ్చే సంవత్సరం కూడా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆర్బిఎస్‌కే కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 147 కేసులను రిఫరల్ ఆస్పత్రులకు పంపి న్యూరో, ఆర్థో, డెంటల్ అలాగే అనీమియా కేసులకు మెరుగైన వైద్యం అందించడం జరిగిందన్నారు. ఎన్‌సిడి ద్వారా డయాబెటిస్, బ్లడ్ ప్రెషర్, క్యాన్సర్, హార్ట్ స్ట్రోక్, బ్రెస్ట్ కాన్సర్‌లపై పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పించే దిశగా కార్యచరణ చేపట్టాలని వైద్య అధికారులను ఆదేశించారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయమాలిని, చల్లాదేవి డిడిసి ఓ డాక్టర్ సరస్వతి, చల్లదేవి, మాస్ మీడియా అధికారి, జీ.రాములు, డిప్యూటీ డెమో నరసింహ పాల్గొన్నారు.

రైల్వే డివిజనల్ మేనేజర్‌లను కలిసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్‌ల రైల్వే మేనేజర్‌లను రైల్వే శాఖ డివిజన్ రైల్వే మేనేజర్ భర్తేష్ కుమార్ జైన్, లోకేష్ వైష్ణోయ్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కలిశారు. మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని రాధాకృష్ణ నగర్ వద్ద నూతనంగా నిర్మించిన రైల్వే స్టేషన్‌కు రాధాకృష్ణ నగర్ స్టేషన్‌గా నామకరణం చేయాలని, మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని ముంపును నివారించేందుకు కొత్త బస్తి నాలా వద్ద రైల్వే టన్నెల్ విస్తరించాలని, బొల్లారం బజార్, ఆల్వాల్ రైల్వే స్టేషన్ మధ్యలోని జనప్రియ అపార్ట్మెంట్ వద్ద ఆర్.యు.బి.ని విస్తరించాలని, అల్వాల్ డివిజన్ పరిధిలోని మహాబోధి స్కూల్ వద్ద స్టార్మ్ వాటర్ డ్రైన్‌ను ఆర్.సి.సి బాక్స్ డ్రైన్‌గా మారిస్తే ప్రజలకు వరద ముంపు నుండి విముక్తి కలుగుతుందని, వెంటనే పనులు చేయించాలని మౌలాలి డివిజన్ పరిధిలోని జడ్‌టిసి హనుమాన్ నగర్ డ్రైనేజ్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని, మౌలాలి టీఎస్‌పిఐఐసి, ఐలా ఇండస్ట్రియల్‌లో ఏరియాలో సివరేజి లైన్ ఏర్పాటు చేయాలని, శ్రీనగర్ కాలనీలో డ్రైనేజ్ సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, రావుల అంజయ్య, జగదీష్ గౌడ్, అమీనుద్దీన్, ధిల్లీ పరమేష్, బైరు అనిల్, ఉషశ్రీ, సంతోష్ నాయుడు, శరణ్‌గిరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేపోతున్న బీఆర్ఎస్

విశాలాంధ్ర - ఆమనగల్లు : దక్షిణ తెలంగాణ అభివృద్ధిని చూసి హరీష్ రావు, కేటీఆర్ ఓర్వలేక పోతున్నారని పిసిసి సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. కడ్తాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజా సంక్షేమ పాలన నడుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు 22 వేల కోట్ల రూపాయలతో దాదాపు 26 లక్షల మంది రైతులకు అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపు రుణమాఫీ చేసి, సన్న వడ్లకు 500 రూపాయలు బోనస్ ఇచ్చి రైతులకు పెద్దన్నగా నిలిచారన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేవంత్ రెడ్డి దేశంలో ఎక్కడ చేయని విధంగా రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన చేసి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ బీసీల సంఖ్య తేల్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ విద్యా ఉద్యోగ స్థానిక ఎన్నికల్లో ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపించిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. గిరిజన లంబాడలకు ఏమి చేయలేదని మాట్లాడిన హరీష్ రావు మీరు మర్చిపోయారా.. కాంగ్రెస్ పార్టీ గతంలో లంబాడాలు బీసీ ఈ గ్రూపులో ఉంటే ఇందిరా గాంధీ, ఎస్టీల్లో చేర్చి రిజర్వేషన్లతో పాటు అన్ని సదుపాయాలు కల్పించి ఆదుకున్నారన్నారు. ఉద్యోగాలు ఇస్తామన్న మాట మీద సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసిన గొప్పతనం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెల్లుతుందన్నారు. హాస్టల్ విద్యార్థులకు ఎక్కడి లేని విధంగా మెస్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచార న్నారు. మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500లకే గ్యాస్ సిలిండర్, 10 లక్షలు ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫీ, వ్యవసాయ ఉపాధి కూలీలకు రైతూ భరోసా వంటి హామీలను నెరవేర్చామన్నారు. గతంలో ఏనాడు దక్షిణ తెలంగాణ వైపు చూడని నాయకులు, ఉత్తర తెలంగాణను మాత్రం అభివృద్ధి చేసిన నాయకులు నేడు దక్షిణ తెలంగాణ అభివృద్ధిని చూసి అడ్డుకట్ట వేస్తుంటే ప్రజలు సహించలేక పోతున్నారన్నారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు హన్మ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు అశోక్, మండల యూత్ అధ్యక్షుడు బోస్ రవి, మల్లేష్ గౌడ్, రామచందర్ నాయక్, మంకీ శ్రీను, శంకర్ నాయక్, భానుకిరణ్, శ్రీకాంత్, తులసీ రాం, బుచ్చయ్య, శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

విశాలాంధ్ర - పటాన్ చెరువు : ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బిఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల పనిచేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటడానికి స్పష్టమైన ప్రణాళికలను రూపొందిస్తున్నామని పటాన్ చెరువు కార్పొరేటర్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మెట్టు కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. బుధవారం రాత్రి ఐలాపూర్ బిఆర్ఎస్ నాయకులు మాణిక్ యాదవ్ జన్మదిన వేడుకలను ఐలాపూర్‌లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాణిక్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ గడచిన సంవత్సరంన్నర కాలంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు చేసింది ఏమీ లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధిష్టానం తమ స్వలాభం కోసం రాష్ట్ర ప్రయోజనాలు కాకుండా తమ సొంత ప్రయోజనాల కోసం మూసి ప్రక్షాళన పథకాన్ని ముందుకు తీసుకొచ్చారని విమర్శించారు. బిఆర్ఎస్ రాష్ట్ర అధినాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హామీల అమలుకు ఒత్తిడి తీసుకొచ్చేందుకు బిఆర్ఎస్ పార్టీ చర్యలు తీసుకుంటుందని అన్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు ఎవరు అధైర్య పడవద్దని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభంజనం పెద్ద ఎత్తున రాబోతున్నదని అన్ని స్థానిక సంస్థలు ఎన్నికల్లో టీఆర్ఎస్ జండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొలను బాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీతారాముల కళ్యాణానికి ఎమ్మెల్యే గాంధీకి ఆహ్వానం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే అరికపూడి గాంధీని కృషినగర్ బి బ్లాక్ కమిటీ సభ్యులు బుధవారం రోజున తన నివాసంలో కలిసి ఆహ్వానించారు. మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కూడా ఆహ్వానం అందించారు. స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆకాక్షించారు. కాలనీలో మొదటిసారిగా స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలియజేశారు. ఉదయం 6 గంటల నుండి పూజ కార్యక్రమాలు చేపడుతున్నామని, అలాగే మధ్యాహ్నం 12 గంటలకి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాలనీ వాసులు పిలుపునిచ్చారు. ఆహ్వానించినా వారిలో బి బ్లాక్ సభ్యులు అధ్యక్షులు గున్నాల అనిల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సిద్దన్న యాదవరెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి వెంకట్ రాములు, ఉపాధ్యక్షులు సాయి రెడ్డి, సురేష్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పరమేష్, కోశాధికారి శరత్‌కుమార్, మాల కొండయ్య, పవన్ కుమార్, సంతోష్ కుమార్, ఆదినారాయణ, శ్రీనివాసులు, గోపాలకృష్ణ, ఉదయ్, హరి కృష్ణ, కిరణ్, వికాస్ జి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని పరిరక్షించడమే నిజమైన అభివృద్ధి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాలలో ఉన్న ఆహ్లాదకరం కలిగించే అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి పేరుతో చెట్లను నరికి వెయాలనే ప్రయత్నాన్ని పాలకులు వెంటనే విరమించుకోవాలని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. అభివృద్ధి కోసం అడవులను నరకొద్దని, వృక్ష సంపద నాశనమైతే భవిష్యత్ తరాలకు జీవనం ప్రమాదంలో పడుతుందని, సెంట్రల్ యూనివర్సిటీ భూములలోని చెట్లను నరకవద్దని, వృక్ష సంపద కాపాడాలనే న్యాయ మైన డిమాండ్‌తో ప్రజాస్వామికంగా విద్యార్థులు ఆందోళన చేస్తుంటే అరెస్టులు చేయడం సరికాదన్నారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేసి ప్రభుత్వం హుందాగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములను, విశ్వవిద్యాలయాల భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే వాటిని తెగనమ్మాలని చూడటం చూస్తే కంచే చేను మేసిన చందంగా ఉందని రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. వృక్ష సంపద నాశనమైతే భవిష్యత్ తరాల మనుగడకే ప్రమాదమని, అభివృద్ధి పేరుతో ఊహించని స్థాయిలో వృక్షాలను నరికి వేయడం హేయమైన చర్య అని, అర్థవంతమైన అభివృద్ధి చేయాలంటే ప్రకృతిని రక్షించడం తప్పనిసరన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి భవిష్యత్ విద్యార్థుల ప్రయోజనాలకు, యూనివర్సిటీలో పరిశోధనల అభివృద్ధికి, నాణ్యమైన ప్రయోగశాలల నిర్మాణానికి ఉపయోగ పడే భూములను వేలం వేసే పద్ధతులను విడనాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవరాశులను నాశనం చేసే కుట్రలను తిప్పికొట్టాలని ప్రభుత్వ దమన కాండనపై ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని రామారావు పిలుపునిచ్చారు.

పుస్తకాల రచనలో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - కొత్తూరు : చిన్నతనంలోనే విద్యార్థులు తమ మెదడుకు పదునుపెట్టి పుస్తకాలను రచించడం వారి నైపుణ్యతకు నిదర్శనమని హిప్పో క్యాంపస్ పాఠశాల డైరెక్టర్ ఎంఎస్ఎం శశికళ శర్మ అన్నారు. నందిగామ మండలం, రంగాపూర్ హిప్పో క్యాంపస్ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులు చక్కని సృజనాత్మకతతో లోతైన అధ్యయనం చేసి ఆంగ్లం భాషపై చక్కని నైపుణ్యాన్ని ప్రదర్శించి తమ జీవితంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా రచించిన పలు పుస్తకాలను ఆమె విద్యార్థులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారి విద్యార్థుల ప్రతిభపై ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయశ్రీ, వైస్ ప్రిన్సిపల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు శ్రావన్ కుమార్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవిన్ డేను ప్రారంభించిన మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎంఐఎఫ్) గుర్తించిన సాంకేతిక ఆవిష్కర్తలు మన దేశంలో అత్యంత క్లిష్టమైన సవాళ్లను, వాతావరణ సమస్యలను ఎదుర్కోవడం, వ్యవసాయంలో మార్పులు తీసుకురావడం, నీటి కొరతను పరిష్కరించడం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాలను ఫర్నిచర్‌గా మార్చడం, పారిశ్రామిక ఉద్గారాలను విలువైన రసాయనాలుగా మార్చడం, అరుదైన భూ అయస్కాంత రహిత మోటారు వ్యవస్థలను అభివృద్ధి చేయడం, గాలి నుంచి తేమను వెలికి తీయడం వంటివి వారు చేస్తున్నారు. ఈ ఆవిష్కరణలు హరిత ఆర్థిక వ్యవస్థను రూపుదిద్దుతున్నాయి. కానీ వీటిని పెంచేందుకు సంస్థాగత కస్టమర్లతోపాటు, పెట్టుబడిదారులు, గ్రాంట్ ప్రదాతలతో కీలక అనుసంధానాలు అవసరం. దీనిని పరిష్కరించడానికి, మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఇండియన్ ఇన్నోవేషన్ ఐకాన్స్ 2025 విజేతలను, స్కేల్-అప్ ప్రోగ్రామ్ నుంచి ఆవిష్కర్తలను నిధులు, మార్కెట్ అందుబాటు, పైలట్ అవకాశాలు, నిపుణుల మార్గదర్శకత్వంతో అనుసంధానించడానికి రూపొందించిన, అధిక ప్రభావం చూపగల కార్యక్రమమైన ఇన్నోవిన్ డేను ప్రారంభించింది. క్లీన్ టెక్, అగ్రిటెక్, సర్క్యులర్ ఎకానమీ సహా సిద్ధంగా, అత్యధిక సామర్థ్యం ఉన్న 24 మంది ఆవిష్కర్తలు ప్రారంభ ఇన్నోవిన్ డేలో పాల్గొన్నారు. ఇండియన్ ఇన్నోవేషన్ ఐకాన్స్ 2025 సామాజిక, వ్యాపార విభాగాల నుంచి విజేతలు- అస్సిస్ టెక్ ఫౌండేషన్, చారా టెక్నాలజీస్, ఇంద్రా వాటర్, పరి, రాకెట్ లెర్నింగ్, ఇంకా... ఎంఐఎఫ్ వారి స్కేల్ అప్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ నుంచి బ్రిసిల్, కాలిచ్, గ్రీన్ పాడ్ ల్యాబ్స్, ఇషిత్వా రోబోటిక్ సిస్టమ్స్, ప్యాడ్ కేర్, రిక్రాన్ ప్యానెల్స్, ఉరవు, అర్బన్ కిసాన్ వంటి ఆవిష్కర్తలు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొల్తూరి సాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను గురువారం ఉదయం మాజీ మేయర్ అమర్ సింగ్ హాజరై ప్రారంభించడం జరిగింది. మాజీ మేయర్ అమర్ సింగ్ కొల్తూరి సాయిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సేవా చేసే గుణం ఉండాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితిలో ఎండలు అధికంగా ఉండడంవల్ల వడ దెబ్బ తగలకుండ ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుంటూ మంచి నీరు ఎక్కువ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సుభాష్ నాయక్, అనంత్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ ఇర్ఫాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్ర శ్రీకాంత్ గౌడ్, అలువాల దేవేందర్ గౌడ్, బండారి రవీందర్, బిజెపి నాయకులు నెమలికొండ అనిల్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పంజాగుట్టలో జోయాలుక్కాస్ బ్రిలియెన్స్ డైమండ్ జ్యువలరీ షో

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : జోయాలుక్కాస్, ద వరల్డ్స్ ఫేవరెట్ జ్యువలర్, ఈనెల 3 నుండి 20 వరకు తమ పంజాగుట్ట షోరూంలో ప్రసిద్ధి చెందిన జోయాలుక్కాస్ బ్రిలియెన్స్ డైమండ్ జ్యువలరీని ప్రకటించడంతో హైదరాబాద్ ఎన్నడూ లేనంత ప్రకాశవంతంగా మెరవడానికి సిద్ధమైంది. డైమండ్స్, అన్ కట్ డైమండ్స్ మరియు ప్రెషస్ జ్యువలరీ యొక్క ప్రత్యేకమైన కలక్షన్ ను ప్రదర్శించనుందన్నారు. ఈ గొప్ప ఎగ్జిబిషన్ లో డైమండ్ జ్యువలరీలో ఇంతకు ముందు చూడని స్టైల్స్, జోయాలుక్కాస్ వారి ఉత్తమమైన కళాపనితనానికి ఉదాహరణలు, డిజైనర్ వివరాలు ప్రదర్శించబడతాయన్నారు. జోయాలుక్కాస్ బ్రిలియెన్స్ డైమండ్ జ్యువలరీ షోలో కలక్షన్ ప్రత్యేకంగా లభించేలా చేసింది. డైమండ్‌ను జ్యువలరీని అభిమానించే వారి కోసం, బ్రిలియెన్స్ మొదటిగా వీక్షించి, ఈ కళాఖండాలను సొంతం చేసుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశం అన్నారు. డైమండ్స్ కోసం కళాపనితనంలో శ్రేష్టతకు నిబద్ధత కోసం "ద జోయాలుక్కాస్ బ్రిలియెన్స్ డైమండ్ జ్యువలరీ షో" అభిరుచిని సంబరం చేస్తుంది, అని జాయ్ అలుక్కాస్, చైర్మన్, జోయాలుక్కాస్ ఎండి అన్నారు. రూ. 1 లక్ష అంతకంటే ఎక్కువ విలువైన డైమండ్ జ్యువలరీని కొనుగోలు చేసిన కస్టమర్లు 1 గ్రా గోల్డ్ కాయిన్ ను ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రత్యేకమైన సందర్భం కోసం స్టేట్మెంట్ ఆభరణాన్ని కోరుకుంటున్నా లేదా మీ కలక్షన్ కు చేర్చడానికి శాశ్వతమైన సంపదను చేర్చాలని భావిస్తున్నా, ఈ ఎగ్జిబిషన్ లో ప్రతి ఒక్కరి కోసం ఏదో ఒకటి ప్రత్యేకమైనది లభిస్తుందన్నారు.

డిజిటల్ కమ్యూనికేషన్‌లో సరికొత్త విప్లవం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: డిజిటల్ భద్రతా సమస్యలను పరిష్కరించేందుకు చెన్నైకి చెందిన ఒడిస్సీ టెక్నాలజీస్ లిమిటెడ్ రెండు కొత్త సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్స్‌ను విడుదల చేసింది. ఈ ప్రొడక్ట్స్‌ను డిజిటల్ కమ్యూనికేషన్లో సరికొత్త విప్లవంగా భావించవచ్చు. అవి.. ఎక్స్‌జోర్క్సైన్ మెయిల్, ఎక్స్‌జోర్క్సైన్ స్పాట్. ఈ సందర్భంగా ఒడిస్సీ సీఎండీ బీ రాబర్ట్ రాజా మాట్లాడుతూ ఈ ప్రొడక్ట్స్ ప్రపంచ వ్యాప్తంగా 200 మిలియన్ల ఈ మెయిల్ వినియోగదారులకు, ఒక బిలియన్ స్మార్ట్‌ఫోన్ యూజర్లకు మేలు చేయనున్నాయన్నారు. ఇటీవల డిజిటల్ అరెస్ట్ అనే పదం ప్రజల్లో విస్తృతంగా వినిపిస్తుందని తెలిపారు. ఇది చట్టపరమైన పదం కాదన్నారు. అయినా, ఇది ప్రజలలో విస్తృతంగా ఉందన్నారు. ఈ డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున మోసాలకు కారణం అవుతున్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఐడెంటిటీ థెఫ్ట్, డిజిటల్ బ్లాక్‌మెయిల్, ఎక్స్‌టార్షన్, రాన్సమ్‌వేర్ దాడులు పెరుగుతున్నాయన్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు సెక్యూరిటీ సూచనలు, సాఫ్ట్‌వేర్ అప్డేట్‌లు వస్తున్నా మోసాలు తగ్గడం లేదన్నారు. ఈ సమస్య అంతర్జాతీయ స్థాయిలో విస్తరించిందన్నారు. యూఎస్లోనూ టోల్ టెక్స్, ఇతర స్కామ్‌లకు సంబంధించి హెచ్చరికలు మాత్రమే ఇస్తున్నారని. సరైన పరిష్కారం అందించడం లేదని తెలిపారు. ఈ సమస్యలు ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న భద్రతా చర్యల ద్వారా పరిష్కారం కావడం లేదన్నారు. ఆర్థిక రంగానికి సంబంధించి భద్రతా సాఫ్ట్‌వేర్‌ను అందిస్తున్న అనుభవంతో ఈ సమస్యల మూలాన్ని కనిపెట్టామన్నారు. అన్ని మోసాల వెనుక ఉన్న ప్రాథమిక కారణం డిజిటల్ ఐడెంటిటీ అసిమ్మెట్రీ (అసమానత) అనే దాన్ని హ్యాకర్లు, మోసగాళ్లు తమ లక్ష్యాలను స్పష్టంగా గుర్తించగలుగుతున్నారని తెలిపారు. బాధితులు మాత్రం తమను ఎవరు టార్గెట్ చేస్తున్నారో తెలియని స్థితిలో ఉంటున్నారని పేర్కొన్నారు. ఒడిస్సీ ప్రొడక్ట్స్ ఈ సమస్యను నేరుగా పరిష్కరించనున్నాయని తెలిపారు

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర -కుత్బుల్లాపూర్: దైవ చింతనతోనే ప్రజలకు మానసిక ప్రశాంతత చేకూరుతుందని కార్పొరేటర్ రాగం రాజు ముదిరాజు పేర్కొన్నారు. నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త ఆగం రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వెంకట శివ రామాలయ ప్రథమ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో గణపతి పూజలను ప్రారంభించారు. అనంతరం ఏప్రిల్ 3 నుంచి 5వ తేది వరకు పూజలు, 6వ తేదిన శ్రీ రామనవమి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని స్వామి వారి కృప పొందాలని అన్నారు.

మతోన్మాదాన్ని పారదోలదాం

లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సభలో రామకృష్ణ

విశాలాంధ్ర- విజయవాడ(చిట్టినగర్): ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం... మతోన్మాదాన్ని పారదోలుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ నగర సమితి అధ్వర్యంలో గురువారం లౌకిక రాజ్యాంగ పరిరక్షణ, వక్ఫ్ చట్టసవరణకు వ్యతిరేకంగా, మైనార్టీలపై దాడులను నిరసిస్తూ విజయవాడలో లెనిన్ విగ్రహం వద్ద నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 500 జిల్లాలలో ప్రచార ఉద్యమం మార్చి 23న భగత్‌సింగ్ వర్ధంతి నుండి ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి వరకు ప్రచార ఉద్యమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్, ముస్లిం లీగ్ నేతలు స్వాతంత్ర్య ఉద్యమంలో జీవితాలను, ఆస్తులను త్యాగం చేశారన్నారు. తెలంగాణ నైజాం నవాబుల మారణకాండకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 4 వేల మంది కమ్యూనిస్టులు చనిపోయారని, అదేసమయంలో పది లక్షల ఎకరాలు పేదలకు పంపిణీ చేశామని చెప్పారు. ప్రస్తుతం అధికారం చెలాయిస్తున్న బీజేపీ(ఆర్ఎస్ఎస్) నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి గులాంగిరీగా వ్యవహరించిందని గుర్తుచేశారు. కనీసం స్వాతంత్ర్యం కోసం నినాదాలు కూడా చేయలేదన్నారు. వక్ఫ్ ఆస్తులను హిందువులు కాజేస్తున్నట్లు కేంద్ర మైనారిటీ శాఖమంత్రి కిరెన్ రిజిజు నిస్సిగ్గుగా పార్లమెంటులో మాట్లాడటం దుర్మార్గమన్నారు. హిందూ, ముస్లింలను రెచ్చగొడుతూ బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని రామకృష్ణ విమర్శించారు. వక్ఫ్ చట్టానికి సవరణల పేరుతో ముస్లింల ఆస్తులు దోచుకోవడానికి మోదీ సర్కారు కుట్ర చేస్తోందన్నారు. పదేళ్లకు పైగా అధికారం చెలాయిస్తున్న మోదీ...ఏ వర్గం కష్టాలు తీర్చలేదన్నారు. అంబానీ, అదానీ, టాటాలకు మోదీ సర్కారు ఆస్తులు దోచిపెడుతోందని విమర్శించారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వ విధానాలను గుడ్డిగా సమర్థించడం సిగ్గుచేటన్నారు. దేశ రక్షణ, రాజ్యాంగ పరిరక్షణ, మతోన్మాదులను తరిమికొట్టేందుకు ప్రజాతంత్ర వాదులు ప్రతినబునాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ మోదీ పరిపాలన హిందూ, ముస్లింల ఐక్యతను దెబ్బతీస్తోందన్నారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు అతిథులకు ఆహ్వానం పలికారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, రాష్ట్ర నాయకులు ఎస్కే నజీర్, నాయకులు లంకా దుర్గారావు, డి.సూరిబాబు, కేవీ భాస్కరరావు విప్లవ, అభ్యుదయ గేయాలు ఆలపించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్క వీరభద్రరావు, మహిళా సమాఖ్య నగర అధ్యక్షులు ఓర్సు భారతీ, కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రాలకు హోంగార్డుల బదిలీ

సీఎంను సంప్రదించి త్వరలో నిర్ణయం

సీపీఐ నేత రామకృష్ణకు హోంమంత్రి అనిత హామీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ స్థానికత కలిగిన హోంగార్డులను స్వరాష్ట్రాలకు బదిలీ చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడుతో సంప్రదించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ఈ అంశంపై విజ్ఞప్తి చేయగా... ఆమె సానుకూలంగా స్పందించారు. పదిహేనేళ్ల క్రితం హోం గార్డులుగా నియమితులైన తెలంగాణ వారు ఆంధ్రప్రదేశ్‌లోను, ఆంధ్రప్రదేశ్ వారు తెలంగాణలోనూ పని చేస్తున్నారని వివరించారు. ఇంటర్మీడియట్ వరకు వీరు తెలంగాణలో విద్య పూర్తిచేసి తెలంగాణలో నాన్ లోకల్‌గా, ఆంధ్రప్రదేశ్‌లో విద్య పూర్తి చేసిన హోం గార్డులు తెలంగాణలో నాన్ లోకల్‌గా పరిగణనలోకి రావడం వలన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రామకృష్ణ తెలిపారు. స్థానికత కారణంగా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందుకోలేక పోతున్నారని హోం మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వారి పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పారు. సొంత రాష్ట్రాల బదిలీకి తెలంగాణ ముఖ్యమంత్రి కూడా అంగీకారం తెలిపారని రామకృష్ణ వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి... ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

వన్ స్టాప్ సెంటర్ భవన ప్రారంభోత్సవంలో మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర-విజయవాడ: మహిళల హక్కుల భద్రత, రక్షణకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్ నూతన భవనాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ వన్ స్టాప్ సెంటర్‌లో సుమారు 13 మంది సిబ్బంది ఉంటారన్నారు. ఇది 24 గంటలపాటు బాధిత మహిళలకు అందుబాటులో ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా నిర్మించే భవనాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళల రక్షణకు ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారు. మోసగించబడిన మహిళలకి న్యాయపరంగా, కుటుంబపరంగా సహాయ సహకారాలు అందించేలా వన్ స్టాప్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. ఇంట్లో చెప్పుకోలేని విషయాలు ఇక్కడ మహిళా అధికారులకు చెప్పుకోవచ్చన్నారు. రక్షణతోపాటు న్యాయం, ఆసుపత్రి, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. భద్రంగా ఉన్నామని అనుకున్నప్పుడు మాత్రమే వారిని తిరిగి స్వగృహానికి పంపిస్తామన్నారు. గుంటూరులో శక్తి సదన్ మహిళా వసతి గృహాన్ని త్వరలో ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. మహిళల, పిల్లల భద్రత అతి ముఖ్యమైన అంశాలని అన్నారు. 5,600 అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. 960 మంది సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ. సూర్యకుమారి, డైరెక్టర్ ఎం. వేణుగోపాల రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ దాసరి శ్రీలక్ష్మి, డీసీపీ సరిత పాల్గొన్నారు.

మీడియా కౌన్సిల్ ఏర్పాటు చేయండి

ఐజేయూ కార్యవర్గం డిమాండ్

చెన్నై: ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను మీడియా కౌన్సిల్ ఆఫ్ ఇండియాగా మార్చాలంటూ కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు పార్లమెంటు సెలెక్ట్ కమిటీ సూచించడం పట్ల ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) హర్షం వ్యక్తం చేసింది. సంబంధిత వర్గాలతో చర్చించి జాతీయ జర్నలిస్టు యూనియన్ల ప్రాతినిధ్యంతో మీడియా కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ఐజేయూ కోరింది. మీడియా బిల్లు ప్రవేశపెట్టాలని స్టాండింగ్ కమిటీ చేసిన సూచనను ప్రస్తావిస్తూ... వర్తమాన మీడియా స్థితిగతులను అధ్యయనం చేయడం కోసం ముందుగా మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని ఐజేయూ డిమాండ్ చేసింది. కమ్యూనికేషన్లశాఖను, ఎలక్ట్రానిక్ విభాగాన్ని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలో విలీనం చేయాలన్న సూచనకు ఐజేయూ అభ్యంతరం వ్యక్తం చేసింది. సమాచార ప్రసార శాఖను ప్రత్యేక శాఖగానే కొనసాగించాలని అభిప్రాయ పడింది. చెన్నైలో జరుగుతున్న ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశం గురువారం కొన్ని తీర్మానాలను ఆమోదించింది. దేశంలో మీడియా రంగ పరిస్థితి, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఐజేయూ జాతీయ కార్యవర్గం కూలంకషంగా చర్చించింది. జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలని, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ మీడియా అక్రిడిటేషన్ కమిటీల నిబంధనలను సవరించి జాతీయ జర్నలిస్టు సంఘాలకు వాటిలో ప్రాతినిధ్యాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్లపై పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా న్యూఢిల్లీలో ఆందోళనా కార్యక్రమం నిర్వహించాలని జాతీయ కార్యవర్గం నిర్ణయించింది. పత్రికలు మ్యాగజైన్లకు ఇప్పటివరకూ ఇస్తున్న పోస్టల్ రాయితీని రద్దు చేస్తూ తపాలా శాఖ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేసింది. ఐజేయూ జాతీయ అధ్యక్షులు, సెక్రటరీ జనరల్ పదవులకు త్వరలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ఆ మేరకు షెడ్యూల్‌ను సమావేశం ఖరారు చేసింది. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన అనుబంధ యూనియన్ల అధ్యక్ష కార్యదర్శులు తమ కార్యకలాపాల నివేదికలు సమర్పించారు. ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సెక్రెటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్మూ, మాజీ అధ్యక్షులు ఎస్ఎన్ సిన్హా, దేవులపల్లి అమర్, స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఎంఏ మాజిద్, ఐజేయూ కార్యదర్శులు వై.నరేందర్ రెడ్డి, డి.సోమసుందర్, తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఐజేయూ కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్ కుమార్, నగునూరి శేఖర్ పాల్గొన్నారు.

ట్రంప్ సామ్రాజ్యవాదానికి తలొగ్గిన మోదీ

రావుల వెంకయ్య, రాజన్ విమర్శ

ఆర్థిక స్వాతంత్ర్య పరిరక్షణ పోరాటాలకు పిలుపు

న్యూదిల్లీ: అమెరికా సామ్రాజ్య వాదానికి తలొగ్గడాన్ని భారత రైతులు సహించబోరని మోదీ ప్రభుత్వాన్ని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య హెచ్చరించారు. దేశ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవడం కోసం ఎన్నడూ జరగని విధంగా పోరాటాలకు రైతులు సిద్ధమవుతారన్నారు. ఏప్రిల్ 15, 16, 17 తేదీల్లో తమిళనాడులోని నాగపట్నంలో జరగబోయే ఏఐకేఎస్ 30వ జాతీయ మహాసభలో ఈమేరకు ఉద్యమ కార్యాచరణను నిర్ణయిస్తామని రాజన్, రావుల వెంకయ్య గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సామ్రాజ్యవాద వ్యతిరేక భారతదేశ వారసత్వ విలువలను మోదీ ప్రభుత్వం మంటగలుపుతోందని దుయ్యబట్టారు. అమెరికా విధించే 27 శాతం సుంకాలకు భారత్ తలొగ్గడమే కాకుండా ఇదేదో దౌత్యపరంగా సాధించిన విజయంగా విదేశీ వ్యవహారాల శాఖ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మహాత్మాగాంధీ, భగత్ సింగ్ వంటి వారి పురుటిగడ్డ విదేశీ ఆర్థిక దురహంకారానికి తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. వ్యవసాయ రంగాన్ని బహుళజాతి కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేసేలా ప్రపంచ బ్యాంకుకు సంబంధించిన 'బిజినెస్ రెడీ అగ్రికల్చర్ పాలసీ'కి మోదీ ప్రభుత్వం ప్రోత్సాహిస్తుండటాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. భారతదేశ రైతులపై కార్పొరేట్లు యుద్ధాన్నే ప్రకటించారని, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనల వల్ల ఆహార సార్వభౌమత్వం నాశనమవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆర్థిక దౌర్జన్యాన్ని ఎదిరించాలంటూ దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చారు. కార్పొరేట్ల దాడులకు వ్యతిరేకంగా ఆర్థిక సార్వభౌమత్వాన్ని పరిరక్షణ కోసం సంయుక్త కిసాన్ మోర్చాతో కలిసి పోరాడాలని దేశ ప్రజలను కోరారు. సీ2+50శాతం ఎంఎస్‌పీకి చట్టబద్ధమైన హామీ, సంపూర్ణ రుణమాఫీ, ఎన్‌పీఎఫ్ఏఎం రద్దు వంటి ప్రధాన డిమాండ్ల సాధనకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. అమెరికా అన్యాయంగా సుంకాలు విధిస్తూ అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తుందని రాజన్, రావుల వెంకయ్య విమర్శించారు. ట్రంప్ విధానాలకు తలొగ్గడంతో ఎన్నడూ లేని విధంగా రైతులు, కార్మికులు, లఘు పరిశ్రమలకు భారత ప్రభుత్వం మోసం చేస్తున్నదన్నారు. అమెరికా సుంకాలను చైనా, బ్రెజిల్‌తో సహా అనేక దేశాలు వ్యతిరేకిస్తుంటే... భారత్ తలొగ్గడం సిగ్గుచేటని విమర్శించారు. కొత్త టారిఫ్‌లతో దేశ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. భారత్ నుంచి ఎగుమతి అయ్యే వ్యవసాయోత్పత్తులపై అధిక సుంకాల ప్రభావం మహారాష్ట్రలోని మామిడి సాగుదారులు, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లోని బాస్మతి సాగుదారులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రలో మసాలా దినుసుల సాగుదారులు, కర్నాటకలోని జీడిపప్పు సాగుదారులు, కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడులోని కాఫీ సాగుదారులు, మహారాష్ట్ర, కర్నాటకలోని ద్రాక్ష సాగుదారులపై తీవ్రంగా ఉంటుందని రాజన్, రావుల వెంకయ్య పేర్కొన్నారు. విదేశాల నుంచి పత్తి, సోయా ఉత్పత్తులు, ఇథనాల్‌తో భారత మార్కెట్‌లు నిండివున్నాయని, దేశీయంగా ధరలు తగ్గించి, రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ను నిరాకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుత పాలనలో వ్యవసాయపరమైన దిగుమతులు రూ.70వేల కోట్ల నుంచి రూ.3లక్షల కోట్లకు పెరిగాయని, ఎగుమతుల సామర్థ్యాలు సంస్థాగతంగా నిర్వీర్యమయ్యాయన్నారు. ఫార్మా, వస్త్రాలపై టారిఫ్‌లతో పరిశ్రమలు మూతబడుతుండటంతో అనేక మంది ఉద్యోగాలు కోల్పోతున్నారని, పర్యవసానంగా నిరుద్యోగం తీవ్రస్థాయికి చేరుతోందని రాజన్, రావుల పేర్కొన్నారు.

ప్రికాట్ మిల్లును కాపాడాలి

కార్మికశాఖ కమిషనర్‌కు ఏఐటీయూసీ విజ్ఞప్తి

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలోని సత్యసాయి జిల్లాలోని ప్రి కాట్ బి మిల్లు యాజమాన్యం స్వార్థంతో ఉత్పత్తిని నిలిపివేయడం సరికాదని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకటసుబ్బయ్య తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ శేషగిరి బాబు, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మి నారాయణను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిగి మండలం కోడిగేనహళ్లి పంచాయితీలో ఉన్న ప్రికాట్ బి మిల్లు మూతపడకుండా కాపాడాలని కోరారు. ఈ మిల్లు 1983 వ సంవత్సరంలో ఏర్పడిన ప్రికాట్ బి మిల్లు చరిత్ర ఎంతో ఘనమైనదని ఎందరో కార్మికుల కుటుంబాల్ని పెంచి పోషించి ఉన్నతమైన స్థానంలో నిలబెట్టిన చరిత్ర ఈ మిల్లుకు దక్కిందని కార్మికులకు,కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న మిల్లును ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికులు పని నిలిపివేయటం ఫ్యాక్టరీ రన్ అవుట్ చేయటం కార్మికుల్లో ఆందోళన కలిగిస్తున్న విషయమని, ఇలాంటి పరిస్థితి నుండి యాజమాన్యం కార్మికుల సంక్షేమాన్ని వారి కుటుంబాల భవిష్యత్తును మానవతా దృక్పథంతో దృష్టిలో ఉంచుకొని తగు నిర్ణయం తీసుకొనే విధంగా ఫ్యాక్టరీ యదా విధంగా కొనసాగించే విధంగా ప్రభుత్వం తరఫున చర్యలు చేపట్టాలని ఏఐటియుసి కార్మిక సంఘం కోరుతున్నది వేలాది మంది కార్మికుల కుటుంబాలకు ఉపాధిని కల్పించి పరిగి మరియు హిందూపురం ప్రాంతానికే ఎంతో ఘనకీర్తి తెచ్చినా వస్త్ర మిల్లులలో ఈ ప్రికాట్ బి మిల్లు ప్రధానమైనదాని ఈ ఫ్యాక్టరీ ఇచ్చిన విద్య ప్రోత్సాహకం వల్ల ఎంతోమంది విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఉన్నతమైన శిఖరాలకు చేరుకున్నారని ఇలాంటి పరిశ్రమ మూతపడకుండా ప్రభుత్వం తరఫున సహకరించాలని ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి యజమాన్యంతో మాట్లాడి కార్మికులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఏ ఐటియుసీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని తెలిపారు .ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి డి బాబు, మిల్లు ప్రధాన కార్యదర్శి మారుతి రెడ్డి పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు మద్దతిచ్చే ప్రసక్తే లేదు: సీపీఐ



న్యూదిల్లీ: వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లుకు సీపీఐ వ్యతిరేకమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టంచేశారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. వక్ఫ్ సవరణ బిల్లుకు కేరళ ఎంపీలు మద్దతు ఇవ్వాలని కేరళ క్యాథలిక్ బిషప్స్ కౌన్సిల్ (కేసీబీసీ) కోరగా రాజా తిరస్కరించారు. మన పార్టీలు దీనిని వ్యతిరేకి స్తాయని ఆయన వక్కాణించారు. వక్ఫ్ బిల్లుకు ప్రతిపాదించిన సవరణలు రాజ్యాంగానికి విరుద్ధమైనవి, దేశ లౌకిక స్వభావానికి భంగం కలిగించేలా ఉన్నాయని రాజా అన్నారు. 'ఈ బిల్లును హిందూ-ముస్లిం కోణంలో కాగా రాజ్యాంగానికి విరుద్ధంగా... లౌకిక సిద్ధాంతాలకు తూట్లు పొడిచేలా సవరణలు ఉండటాన్ని చూస్తున్నాం' అని సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్ తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లుకు కేసీబీసీ మద్దతు ప్రకటించడంపై ఆయన స్పందిస్తూ అది వాళ్ల ఇష్టమని అన్నారు. వక్ఫ్ బిల్లు... క్రైస్తవులు, ముస్లింలు, హిందువుల సమస్య కాదన్నారు. అందులోని సవరణలు లౌకికవాదానికి విఘాతం కలిగించేలా ఉండటం వల్లనే వ్యతిరేకిస్తున్నామని సంతోశ్ కుమార్ చెప్పారు. పార్టీ విధానాలు, సిద్ధాంతాలను కట్టుబడి వ్యవహరిస్తామని ఆయనన్నారు. కాగా, లోక్‌సభలో బుధవారం 12 గంటల చర్చ అనంతరం వక్ఫ్ బిల్లును ఆమోదించడం విదితమే.

మత చిచ్చు కోసమే వక్ఫ్ బిల్లు

తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు: రాజ్యసభలో వాడీవేడి చర్చ

రాజ్యాంగానికి వ్యతిరేకం: కాంగ్రెస్

న్యూదిల్లీ: వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకమని రాజ్యసభలో ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ముస్లింలను లక్ష్యంగా చేసుకొని సమాజంలో మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి బీజేపీ ఈ బిల్లు తెచ్చిందని దుయ్యబట్టింది. రాజ్యసభలో కాంగ్రెస్ తరఫున చర్చను ప్రారంభించిన ఎంపీ సయ్యద్ నాసిర్ హుస్సేన్ అధికార పార్టీ దేశ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని విమర్శించారు. జేపీసీలో ప్రతిపక్షాలు చేసిన ఏ ఒక్క సిఫార్సును కూడా ఈ బిల్లులో చేర్చలేదన్నారు. ముస్లింలను ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణించేలా ఈ బిల్లు ఉందని ఆరోపించారు. రాజ్యసభలో ఈ బిల్లును బుల్డోజ్ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో కేవలం 240 స్థానాలు గెలుపొందిన బీజేపీ తన ఓటుబ్యాంక్‌ను పెంచుకునేందుకు 2024లో ఈ బిల్లు తెచ్చిందని హుస్సేన్ పేర్కొన్నారు. మహారాష్ట్ర కు చెందిన కాంగ్రెస్ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్‌ఘరి మాట్లాడుతూ... ఈ బిల్లును తీసుకువచ్చినందుకు కేంద్రంపై విరుచుకుపడ్డారు. ఇది అనైతిక చర్యగా పేర్కొన్నారు. ఈ బిల్లును ఆమోదించడానికి లోక్‌సభ తెల్లవారుజాము 2 గంటల వరకు పనిచేసిందని... అదే సమయంలో అమెరికా భారతదేశంపై 26 శాతం సుంకాలను విధించిందన్నారు. బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లు ప్రజలకు ఎంతమాత్రం మంచిది కాదన్నారు. యూపీఏ హయాంలో మాజీ ప్రధాని దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ విద్య, ఉపాధి హామీ, సమాచార హక్కును తీసుకువచ్చారని... మోదీ మాత్రం సీఏఏ, వక్ఫ్ సవరణ బిల్లు తీసుకువచ్చారని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాల వల్ల 700 మంది రైతులు అమరులయ్యారని గుర్తుచేశారు. ఇప్పటికైనా బీజేపీ కళ్లు తెరవాలని హితవు పలికారు. 'వక్ఫ్ బిల్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని చంపుతుంది' అని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఒక్కొక్కటిగా ఇటువంటి చట్టాల ద్వారా బీజేపీ మైనారిటీ వర్గాలను లక్ష్యంగా చేసుకుంటుందని సంజయ్ సింగ్ తెలిపారు. వక్ఫ్ బిల్లులోని 'నాన్-ముస్లిం' నిబంధనను ప్రస్తావిస్తూ... దేశవ్యాప్తంగా ఆలయ ట్రస్టులలో తక్కువ కులాల నుండి 80 శాతం రిజర్వేషన్లను కేటాయించే చట్టం చేయాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. కేంద్ర ఆరోగ్యమంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ముస్లిం మహిళల్ని భారతదేశంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా చేసిందని ఆరోపించారు. దేశ ప్రయోజనాల కోసం వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొచ్చామన్నారు. ప్రతిపక్షాలు సమస్యను పక్కదారి పట్టించడానికి ప్రయత్నిస్తు న్నాయని ఆరోపించారు. దిల్లీ ప్రజలు గుణపాఠం నేర్పించినప్పటికీ ఆప్ తీరు మారలేదన్నారు. తొలుత కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభలో ఆమోదం పొందిన వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభించారు.వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదని, ఏ ఒక్కరి మత విశ్వాసాలను దెబ్బతీయటం ప్రభుత్వం ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. సంక్లిష్టతలను తొలగించి, పారదర్శకత తేవటం సహా సాంకేతికతను ప్రవేశపెట్టడం ద్వారా వక్ఫ్ బోర్డు పనితీరు మెరుగుపర్చడమే ఈ బిల్లు లక్ష్యమని చెప్పారు. రాజ్యసభలో ఈ బిల్లుపై చర్చించడానికి 8 గంటలు కేటాయించారు. అవసరమైతే మరింత సమయం పెంచనున్నారు. ఆ తర్వాత ఓటింగ్ చేపడతారు. ఉభయ సభల్లో ఆమోదం పొందిన అనంతరం రాష్ట్రపతి సంతకంతో ఈ వక్ఫ్ బిల్లు చట్టంగా మారనుంది.

వక్ఫ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

వక్ఫ్ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. విపక్షాల ఆరోపణలు, అధికారపక్షం కౌంటర్లతో సభ వాడీవేడిగా జరిగింది. అనంతరం ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా 288 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు వీగిపోయాయి.

అభిరామ్‌కు చంద్రబాబు అభినందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గుంటూరుకు చెందిన మ్యాగ్నమ్ వింగ్స్ సీఈఓ అభిరామ్ చావా గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. తాను తయారు చేసిన రెండు సీట్లతో కూడిన ఎయిర్ ట్యాక్సీ, అందులోని సెక్యూరిటీ ఫీచర్స్ గురించి సీఎంకు వివరించారు. తయారీకి అయిన ఖర్చును తెలిపారు. దీంతో అభిరామ్‌ను చంద్రబాబు అభినందించారు. ఈ ప్రాజెక్టుకు సివిల్ ఏవియేషన్ అనుమతులు లభించేలా కేంద్రంతో మాట్లాడతానన్న సీఎం... పరిశోధనలు కొనసాగించాలని అభిరామ్‌కు సూచించారు.

ఎయిడ్స్ నియంత్రణలో ఏపీకి 7వ స్థానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎయిడ్స్ నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ మెరుగ్గా పనిచేస్తున్నట్లు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ న్యాకో మెచ్చుకుంది. ఎయిడ్స్ నియంత్రణలో ఏపీ 7వ స్థానంలో నిలిచిందని ప్రకటించింది. 2024 ఏప్రిల్-డిసెంబర్‌లో 17వ ర్యాంకులో ఉన్న ఆంధ్రప్రదేశ్ పది స్థానాలు ఎగబాకి 7వ స్థానానికి చేరుకున్నదంటూ ఏపీ శాక్స్ సాధించిన ఫలితాలను న్యాకో వెల్లడించింది. లక్ష్యాలకు అనుగుణంగా ఎయిడ్స్ నియంత్రణలో మంచి పని తీరు కనబర్చినందుకు ఏపీ శాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ సిరి, సిబ్బందిని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు.

బయోగ్యాస్ ప్లాంట్లపై వాస్తవాలు వెల్లడించాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో రిలయన్స్ కంపెనీ పెట్టనున్న 500 బయోగ్యాస్ ప్లాంట్లపై ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... 2.5 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఆ మేరకు 5 లక్షల ఎకరాల భూమి సేకరించనుందని వివరించారు. ఈ ప్లాంట్ల వల్ల కంపెనీకి వచ్చే లాభమెంత?, అందులో రైతులకు దక్కేదెంత? తదితర వివరాలను రాష్ట్ర ప్రభుత్వం సమగ్రంగా ప్రకటించాలన్నారు. లీజుల పేరుతో రైతుల నుంచి తీసుకునే భూముల యాజమాన్యానికి భద్రత ఏమిటి?, దీనికి చట్టబద్ధత ఉందా? అని ప్రశ్నించారు. ఈప్లాంట్లలో తయారయ్యే మిథేన్, కార్బన్‌డయాక్సైడ్ వల్ల కలిగే అనర్థాలనుంచి ఇరుగు పొరుగు గ్రామాల ప్రజలకు భద్రత ఏంటని ప్రశ్నించారు. కనిగిరి నియోజకవర్గంలో ఒక ప్లాంటుకు పెడుతున్న పెట్టుబడి 3-5 సంవత్సరాలలో మొత్తం తిరిగి వస్తోందని, ఆ తర్వాత కంపెనీకి 100 శాతం లాభాలు ఉంటాయని, రైతులకిచ్చే లీజు పెరుగుతుందా? అయితే ఎంత? అనేది వివరించాలన్నారు. అంబానీకి ఇచ్చిన మాటను 30రోజుల్లో అమలు చేసిన నారా లోకేశ్...ప్రజలకిచ్చిన వాగ్దానాలను 300 రోజులవుతున్నా..ఎందుకు అమలు జరపలేదో చెప్పాలని నిలదీశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలు వెల్లడించి... ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.